




ESTD: 1999

www.voodayam.com

# వుదయం

ఖమ్మం | 11-03-2026 బుధవారం | సంపుటి : 13 | సంచిక : 242 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal

Follow us on









## వెల్ కం సర్..

### కొత్త గవర్నర్ శివప్రసాద్ శుక్లాకు సిఎం రేవంత్ స్వాగతం

**హైదరాబాద్, మార్చి 10 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణకు కొత్త గవర్నర్‌గా ఇటీవల నియమితులైన శివప్రతాప్ శుక్లా తొలిసారి రాష్ట్రానికి చేరుకున్నారు. మంగళవారం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న గవర్నర్ దంపతులకు సీఎం రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ కే.రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డితో పాటు గవర్నర్ ను స్వాగతించిన సీఎం అక్కడే మర్యదపూర్వకంగా గవర్నర్‌తో భేటీ అయ్యారు. నేడు హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ చేతుల మీదుగా కొత్త గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఏర్పాట్లు లోక్ భవన్‌లో అధికారులు చేస్తున్నారు. ఇటీవల పలు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం కొత్త గవర్నర్లను నియమించింది.

# ప్రభాకర్ రావుకు 'ముందస్తు'

## ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

### సిట్ దర్యాప్తుకి సహకరించాలని ఆదేశాలు ● ట్యాంపరింగ్‌కు ప్రయత్నిస్తే బెయిల్ రద్దు చేస్తామని హెచ్చరిక ●ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా ఎక్కడికీ వెళ్లొద్దని ఆదేశాలు



**హైదరాబాద్, మార్చి 10 (ఎఎంఎస్) :** తెలంగాణ రాజకీయాలను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన పరిణామం చోటు చేసుకుంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ లో కీలక నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసులో ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ప్రభాకర్ రావుకు అరెస్ట్ నుంచి మినహాయింపు కల్పిస్తూ జస్టిస్ బీవీ నాగరత్న నేతృత్వంలోని అత్యున్నత న్యాయస్థానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు చేస్తున్న దర్యాప్తుకు సహకరించాలని ప్రభాకర్ రావుకు సూచించింది. దీంతో ఈ కేసులో ప్రభాకర్ రావుకు అరెస్ట్ భయం నుంచి విముక్తి లభించనుంది. ఇక ఈ కేసులో సాక్ష్యాలను.. ఆధారాలను ట్యాంపర్ చేసినా, చేసేందుకు ప్రయత్నించినా.. తాము మంజూరు చేసిన ముంద స్తు బెయిల్ రద్దు అవుతుందని ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు హెచ్చరికలు జారీ చేసింది. కోర్టు అనుమతి లేకుండా రాష్టం, దేశం దాటేందుకు వీలు లేదని ప్రభాకర్ రావుకు సూచించింది. ఈ కేసులో సాక్షులుగా ఉన్న వారిని ప్రభావితం చేసినా బెయిల్ రద్దు చేస్తామని స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టు పర్మిషన్ లేకుండా ఎక్కడికీ వెళ్లకూడదని ప్రభాకర్ రావుకు తెలిపింది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలకంగా ఉన్న, అన్నీ తానై వ్యవహరించిన ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు ఊరట ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

మిగతా 2లో

# పంచాయతీలకు శాశ్వత భవనాలు

### ఉన్నత స్థాయికి టూరిజం ● అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కోర్సులు● శిశువిహార్‌కు యాచక శిశువులు ● డిప్యూటీ సీఎం : భట్టి



**హైదరాబాద్, మార్చి 10 (వుదయం ప్రతినిధి) :** వచ్చే మూడేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలకు శాశ్వత భవవనాలు నిర్మాణాలు పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పంచాయత్ రాజ్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేర కు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోవాలని సూచించారు. ప్రీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వివేక్ లతో కలిసి ఆయా శాఖల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ స్థలాలు అందుబాటులో ఉన్నచోట తహసిల్దార్ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యం పై దృష్టి పెట్టాలని సూచించారు. చిన్నారుల మెదడు బలంగా ఎదిగేందుకు అవసరమైన పౌష్టిక ఆహారంతో పాటు బోధనా పద్ధతుల తో వారికి తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. పట్టణాల్లో రహదారుల పైన కొంతమంది చంటి బిడ్డలను పెట్టుకొని యాచక వృత్తి కొనసాగిస్తున్నారు వారందరినీ శిశు విహార్ లో తీసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలని రోడ్లపై చంటి బిడ్డలు పట్టపగలు ఎండకు, వర్షాకాలంలో వానకు తడిసి వారి విలువైన బాల్యం మసకబారి పోతుందని ఆ విధంగా జరగడానికి అవకాశం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం తెలిపారు. శిశు విహార్ లో మోడ్రన్ కిచెన్ నిర్మించాలని సూచించారు.

మిగతా 2లో

## భూముల రీ- సర్వేకి ఆధునిక రోవర్లు


**హైదరాబాద్, మార్చి 10 (వుదయం ప్రతినిధి) :** భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని నివారించడానికి రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ఇందుకోసం ఒక ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. రాష్ట్రంలో భూ లావాదేవీలను మరింత పారదర్శకంగా నిర్వహించి, ప్రజలకు ముఖ్యంగా రైతులకు అత్యుత్తమ సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన 2026-27 బడ్జెట్ మిగతా 2లో

# భీకర యుద్ధం

### 11వ రోజూ భీషణంగా సాగిన అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ సైనిక ఘర్షణలు

### ఆగని పరస్పర దాడులు, ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి, ఇరాన్ కెర్మాన్ విమానాశ్రయంపై అమెరికా, ఇజ్రాయెల్ దాడి, ఇరాన్‌లోని ఆరు సైనిక స్థావరాలపై దాడులు పూర్తి : ఇజ్రాయెల్

### కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా నాయకత్వంలో మరింత నిశితమైన దాడులు చేస్తామని సంకేతాలు ఇస్తున్న ఇరాన్ ● తీవ్రమైన వైమానిక దాడులకు సిద్ధమవుతున్నట్లు అమెరికా ప్రకటన



**వుదయం, మార్చి 10 :** ఇజ్రాయెల్, యునైటెడ్ స్టేట్స్, ఇరాన్ దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడమే తప్ప తగ్గే అవకాశాలు కనిపించడం లేదు. ఇరాన్‌లో గల మౌలిక సదుపాయాలపై వాషింగ్టన్, టెల్ అవీవ్ దాడులు చేస్తుండగా, తెహ్రాన్ మాత్రం పశ్చిమాసియా వ్యాప్తంగా ఉన్న ఇజ్రాయెల్, యుఎస్ స్థావరాలపై దాడులు చేస్తోంది. గత నెల ఆఖరి రోజున ఇజ్రాయెల్, యుఎస్ చేపట్టిన దాడులలో ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా ఖమేనీని మట్టుబెట్టిన తర్వాత, అప్పటికే అస్థిరంగా ఉన్న ప్రాంతాన్ని మరింత తీవ్ర గందరగోళంలోకి నెట్టివేసింది. ఈ నేపథ్యంలో యుఎస్, ఇజ్రాయెల్ దాడులు ఇలాగే కొనసాగితే, మధ్య ప్రాచ్యం నుంచి ఒక్క లీటర్ చమురును కూడా రవాణా చేయడానికి అనుమతించమని ఇరాన్‌కు చెందిన రెవల్యూ షనరీ గార్డ్స్ స్పష్టం చేశాయి. దీనితో, కీలకమైన ఇంధన ఉత్పత్తి ప్రాంతం నుంచి ఎగుమతులను అడ్డుకుంటే ఇరాన్‌ను మరింత తీవ్రంగా యుఎస్ అడ్డుకుంటుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ భద్రతా వ్యవస్థ నూతనంగా నియమితుడైన సుప్రీం నాయకుడు మొజ్తాబా ఖమేనీకు అండగా నిలబ డటం, తాము ఇప్పుడప్పుడే వెనక్కి ఆలోచనలో లేమనే సంకేతాలు ఇవ్వడంతో ప్రపంచ విత్త మార్కెట్లు సోమవారం అస్థిరమయ్యాయి. ఈ క్రమంలోనే ట్రంప్ వ్యాఖ్యలు వెలువడ్డాయి.

**ఇక అత్యాధునిక దీర్ఘశ్రేణి క్షిపణులు: ఐఆర్‌జీసీ**

ప్రస్తుతం కొనసాగుతున్న స్థాయిలో తాము మరో ఆరు నెలల పాటు యుద్ధం చేయగలమని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. దీనికి సంబంధించి ఐఆర్‌జీసీ ప్రతినిధి అలీ మొహమ్మద్ నైనీ మాట్లాడిన దృశ్యాలను ఇరాన్ టీవీ ప్రసారం చేసింది. ఇప్పటివరకు తాము మొదటి, రెండో జనరేషన్ క్షిపణులను మాత్రమే ప్రయోగించామని.. ఇక ముందు అత్యాధునిక దీర్ఘశ్రేణి క్షిపణులతో దాడులు చేస్తామని మొహమ్మద్ నైనీ ఇజ్రాయెల్, అమెరికాలను హెచ్చరించారు.

## యుద్ధంలో తీవ్ర దశలోకి ప్రవేశిస్తున్నాం

### యుఎస్ రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్

**వుదయం డెస్క్, మార్చి 10 :** ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, దాని మిత్రదేశాలు అత్యంత తీవ్రమైన వైమానిక దాడుల దశలోకి ప్రవేశిస్తున్నాయని అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ మంగళవారం వ్యాఖ్యానించారు. ఇరాన్ క్షిపణి ప్రయోగ ఫ్రీక్వెన్సీ గత 24 గంటల్లో కనిష్ట స్థాయికి మిగతా 2లో

## పిఎం కిసాన్ యోజనలో బోగస్‌ల ఏరివేత

**హైదరాబాద్, మార్చి 10 (వుదయం ప్రతినిధి) :** వ్యవసాయం చేసే రైతులకు ఆర్థికంగా అండగా ఉండేందుకు..కేంద్రం అమలు చేస్తోన్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన ( పీఎం కిసాన్ ) పథకం తెలంగాణలో పక్కదారి పట్టింది. ఐటీ చెల్లింపుదారులు, భూమిని అమ్మేసినా, ఇతర అర్హతలేవీ లేకున్నా రాష్ట్రంలో 32 వేల మంది అక్రమంగా ఈ పథకం కింద లబ్ధిపొందినట్లు అధికారుల సర్వేలో తేలింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఈ పథకం ద్వారా లబ్ధిపొందుతోన్న రైతుల జాబితా నుంచి ఈ 32వేల మంది పేర్లను తొలిగించడంతో పాటు వారికి అందుతోన్న సాయాన్ని మిగతా 2లో

# స్పీకర్ పై అవిశ్వాసం : తీర్మానంపై చర్చ

### పాలక ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం, జగదాంబికా పాల్ అధ్యక్షతపై విపక్షం అభ్యంతరం

**న్యూఢిల్లీ, మార్చి 10 (వుదయం) :** లోక్‌సభలో మంగళవారం అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్రమైన వాగ్వాదం చోటు చేసుకుంది. స్పీకర్ ఓం బిర్లా తొలిగింపును కోరుతూ పెట్టిన తీర్మానం సందర్భంగా ఈ మాటల యుద్ధం చోటు చేసుకుంది. కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావేద్ తీర్మానాన్ని చదివిన అనంతరం, సభకు అధ్యక్షత వహిస్తున్న బీజేపీ ఎంపీ జగదంబికా పాల్ 10 గంటల చర్చకు అనుమతిచ్చారు. ఈ తీర్మానాన్ని 50మంది ఎంపీలు సమర్థించారు. కాగా, సభకు పాల్ అధ్యక్షత వహించడం పట్ల ప్రతిపక్ష ఎంపీలు అభ్యంతరాలు లేవనెత్తుతూ, గత అనేక సంవత్సరాలుగా ప్రభుత్వం డిప్యూటీ స్పీకర్‌ను నియమించకుండా రాజ్యాంగ శూన్యతను సృష్టించిందని ఆరోపించారు. జగదంబికా పాల్ అధికారాన్ని ప్రశ్నిస్తూ, మిమ్మల్ని లోక్‌సభ స్పీకర్ నియమించారని కాంగ్రెస్ ఎంపీ కె.సి వేణుగోపాల్ అన్నారు. ఈ తీర్మానం సందర్భంగా ప్రక్రియకు అధ్యక్షత వహించేందుకు సభ ఒక వ్యక్తిని ఎన్నుకోవాలని ఆయన అన్నారు. ఇందుకు సమాధానంగా, అధికార పక్ష ఎంపీలు ఈ వాదనలను వ్యతిరేకిస్తూ రాజ్యాంగ నిబంధనలు, చట్టం, సభ నియమాలను ఉదహరించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ, ప్రతిపక్షాల వాదన అసంబద్ధమని,



లోక్‌సభ తీర్మానాన్ని చర్చించేటప్పుడు అధ్యక్షత వహించే సమర్థ్యం పాల్‌కు ఉందని అన్నారు. స్పీకర్ తొలగింపు తీర్మానం పరిశీలనలో ఉన్నప్పుడు చైర్‌పర్సన్ల ప్యానెల్ సభ్యుడు లోక్‌సభకు అధ్యక్షత వహించవచ్చని రిజిజు అన్నారు. స్పీకర్ తొలగింపు తీర్మానం పై చర్చ జరుగుతున్నప్పుడు చైర్‌పర్సన్ల ప్యానెల్ సభ్యుడు జగదాంబికా పాల్ లోక్‌సభకు అధ్యక్షత వహించవచ్చు అని రిజిజు అన్నారు. ప్రతిపక్షాలను ఎక్కువగా అడ్డుకున్న పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు భవిష్యత్తులో పార్లమెంటరీ రికార్డులపై పరిశోధన జరిగినప్పుడు, ప్రతిపక్షాలకు అత్యంత అంతరాయం కలిగించిన పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అని గణాంకాలు తెలియజేస్తాయి అని దీనికి ప్రతిస్పందనగా కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా జోక్యం చేసుకుని, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా కిరణ్ రిజిజు ఎక్కువగా అంతరాయం కలిగించారని నేను మీతో ఏకీభవిస్తున్నాను. కానీ ఇంత బాధ్యతా రహితమైన ప్రతిపక్షాన్ని మనం ఎప్పుడూ చూడలేదు అని వ్యాఖ్యానించారు. స్పీకర్ ఎంపిక చేసిన

మిగతా 2లో

# కేంద్ర నిధులు దయాభిక్షం కాదు

### అది రాష్ట్రాల హక్కు, తెలంగాణ ప్రజలు పన్ను చెల్లిస్తున్నారు, నిధులు ఎందుకు ఇవ్వరు?

### రాష్ట్రాల మధ్య వివక్ష తగదు ● ప్రాయోజిత పథకాల్లో కేంద్రం వాటాను తగ్గించుకోంటోంది :

### కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ

**హైదరాబాద్, మార్చి 10 (వుదయం ప్రతినిధి) :** కేంద్రం నుంచి వచ్చే నిధులు కేంద్రం దయ కాదు.. తెలంగాణ హక్కు అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు కేంద్రానికి పన్నులు చెల్లిస్తున్నప్పుడు ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం కేంద్రం చర్యలు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో జరుగుతున్న కేంద్ర బడ్జెట్ చర్చలో తెలంగాణకు సంబంధించి రావాల్సిన నిధులు,పెండింగ్ ప్రాజెక్ట్ లపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలు చర్చించాలన్నారు. ఎన్నికల సమయంలో తెలంగాణకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్న పొన్నం వాటిని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కి పొన్నం బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో



వివక్ష చూపొద్దని డిమాండ్ చేశారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ కు ప్రతి బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయిస్తున్నారనీ అయితే తాము దానిని వ్యతిరేకించడం లేదన్నారు. కానీ ఆ రాష్ట్రానికి కేటాయిస్తున్న బడ్జెట్‌లో సగం నిధులైన కేంద్రం తెలంగాణకు ఇవ్వాలన్నారు. ఎన్నికలు, రాజకీయాలు వేరు అన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై వివక్ష చూపొద్దన్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు కేంద్రంతో కొట్లాడి రాష్ట్రానికి నిధులు సాధించాలన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన సమాఖ్య స్ఫూర్తిని లక్ష్యాన్ని గౌరవిస్తూ రాష్ట్రాలకు పన్నుల వాటలో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**రాష్ట్రాలపై భారం**

కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్రం తన వాటాను తగ్గించుకుంటోందని మంత్రి పొన్నం ఆరోపించారు. తద్వారా రాష్ట్రాల మీద భారాలు మోపుతున్నారనీ ఇది సరికాదన్నారు. కేంద్ర ప్రయోజత పథకాల్లో కేంద్ర వాటా 90 శాతం ఉండే విధంగా పునరుద్ధరించాలన్నారు.

మిగతా 2లో

## సర్ న్యాయమూర్తులపై ఆరోపణలు సహించం

### సిజెఐ తీవ్ర హెచ్చరిక



**న్యూఢిల్లీ, మార్చి 10 (వుదయం):** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితాకు సంబంధించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)ను పర్యవేక్షిస్తున్న న్యాయ అధికారుల సమగ్రతను ప్రశ్నించే ఏ ప్రయత్నాన్నైనా సహించబోమని సుప్రీం కోర్టు మంగళవారం హెచ్చరించింది. అటువంటి చర్యలను సహించబోమని, న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని కలిగి ఉండాలని ప్రకటించింది. కొనసాగుతున్న సవరింపు ప్రక్రియకు సంబంధించి దాఖలైన అనేక పిటిషన్లను విచారిస్తున్న సమయంలో ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)


మిగతా 2లో

# గాంధీ సరోవర్ డిపిఆర్

### 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం, 'లండన్ ఐ' తరహాలో చరఖా రంగుల రాట్నం

### ● బాపూఘాట్ వద్ద రూ. 400 కోట్లతో నిర్మాణాలు ● మూసీనదిపై 15 వంతెనలు, సైక్లింగ్ ట్రాక్‌లు, బోటింగ్, పర్యాటక హంగులు

**హైదరాబాద్, మార్చి 10 (ఎఎంఎస్) :** మూసీ నది పునరుజ్జీవంలో మరో ముందడుగు పడింది. బాపూఘాట్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం రూ. 400 కోట్లతో 'గాంధీ సరోవర్' చేపట్టిన ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం అయింది. 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం, మ్యూజియం, 'లండన్ ఐ' తరహాలో చరఖా రంగుల రాట్నం ఈ ప్రాజెక్టుకు ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. వీటితో పాటు మొత్తం మూసీ నదిపై 15 వంతెనలు, సైక్లింగ్ ట్రాక్‌లు, బోటింగ్, పర్యాటక హంగులతో ఆ నది కనువిందు చేయనున్నది. హైదరాబాద్ నగర నడిబొడ్డున మురుగు, వ్యర్థాలతో ప్రవహిస్తున్న మూసీ నదిని అందంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోన్నది. మూసీని ప్రపంచ స్థాయి పర్యాటక, ఆర్థిక కేంద్రంగా మార్చేందుకు పునరుజ్జీవన ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా.. బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌ను చేపడుతోంది. ఈ మేరకు తాజాగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డీపీఆర్‌ను సిద్ధం చేసింది. ఈ లెక్కన బాపూఘాట్ వద్ద 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం నిర్మాణం కానుంది. మూసీ నదికి రెండు వైపులా విశాలమైన రోడ్లు, నది పొడవునా ఆకట్టుకునే పార్కులు ఏర్పాటు కానున్నాయి. బాపూఘాట్ వద్ద ప్రభుత్వానికి 60 ఎకరాల భూమి భూమి ఉంది. ఇందులో 34 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్లతో గాంధీ సరోవర్ ప్రాజెక్టు రాబోతుంది.



మిగతా 2లో



### అంతర్జాతీయ విమానాశ్రయంగా మధురై ఎయిర్ పోర్టు

భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం 2

### రూ. 20 కోట్లతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్

మంత్రి సీతక్క



2

### అవయవ మార్పిడి చికిత్సల ఖర్చు తగ్గించాలి

ప్రైవేటు ఆస్పత్రులకు మంత్రి రాజనర్సింహ



## రక్త దానం మహాదానం..
# తోటి వారికి ప్రాణదానం

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వుదయం, వికారాబాద్ :** మహిళా దినోత్సవ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ రక్తదాన శిబిరం లో వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి 117 వ సారి స్వచ్ఛంద రక్తదానం చేసారు.ఈ సందర్భంగా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ రక్త దానం మహాదానమని తోటి వారికి ప్రాణదానం అన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి తోటి ప్రాణాలు కాపాడాలని పిలుపు నిచ్చారు. మహిళా దినోత్సవ సందర్భంగా నేడు మహిళా దినోత్సవ సందర్భంగా 117 వ సారి రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి రక్తదాన చేయడం అభినందనీయ మన్నారు. అనంతరం సాయి చౌదరి కలెక్టర్ దీపక్ తివారి నుండి రక్తదాన ప్రశంసా పత్రం అందుకున్నారు.

# గాంధీ సరోవర్ డిపిఆర్

మొదటి పేజీ తరువాయి..

100 మీటర్ల ఎత్తు వరకు పలు అంతస్తుల్లో టవర్ కట్టి అందులో సమావేశ గదులు, మ్యూజియం, గాంధీ చరిత్రపై ప్రదర్శనశాల, కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు. ఈ టవర్‌పై 35-50 మీటర్ల ఎత్తున గాంధీ విగ్రహం కొలువుదీరనుంది. గాంధీ విగ్రహం వెనుక లండన్ థేమ్స్ నది ఒడ్డున కనిపించే 'లండన్ ఐ'ను పోలిన రంగుల రాట్నం ఏర్పాటు చేయనున్నారు. గాంధీ స్మృతుల్లో ఒకటైన చరఖాను తలపించేలా ఈ నిర్మాణం కనిపించనుంది. పక్కనున్న 98 ఎకరాల డిఫెన్స్ భూములను సేకరించే ప్రక్రియ ప్రస్తుతం పురోగతిలో ఉందని అధికారులు చెబుతున్నారు. మూసీలో నిత్యం మంచినీటిని ప్రవహింపజేయడంతోపాటుగా నదికి రెండు వైపులా ఉన్న పరీవాహక ప్రాంతాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్ జంట జలాశయాల నుంచి గాంధీ సరోవర్ వరకు మొత్తంగా 15 వంతెనలు నిర్మిస్తారు. ఒకవైపు 100 అడుగుల రోడ్డు, మరోవైపు 80 అడుగుల రోడ్డు నిర్మించనున్నారు. దాంతో పాటుగా కాలిబాట, సైక్లింగ్ ట్రాక్, ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తారు. నదిలో పూడికను తొలగించి, అంచులను సరిచేసి కొన్ని ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేస్తారు. పిల్లల పార్కులు, హోటళ్లు, వేడుకలు నిర్వహించుకునేలా యాంఫీ థియేటర్లు ప్రాజెక్టులో భాగం కానున్నాయి. మూడు, నాలుగు చోట్ల చిన్నపాటి ఆనకట్టలనూ కూడా నిర్మిస్తారు. గాంధీ సరోవర్‌లో బోటింగ్ సదుపాయం కూడా ఉండనుంది.

# కేంద్రం నిధులు దయాభిక్షం కాదు

మొదటి పేజీ తరువాయి..

కిసాన్ సమ్మాన్ నిధి, సామాజిక పెన్షన్లు గత పదిహేనులుగా నామమాత్రంగా ఇస్తున్నారని ఆరోపించారు. ఆయా మొత్తాలను పెంచాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించాలని డిమాండ్ చేశారు. 12 ఏండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఒక్క పెద్ద ప్రాజెక్ట్ కూడా ఇవ్వలేదన్నారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణకు కేంద్రం చేయుతనందించాలన్నారు. తెలంగాణపై కేంద్రం స్పష్టమైన వివక్ష చూపుతోందన్నారు. దేశ ఆర్థిక వృద్ధికి కీలకంగా దోహదపడుతున్న తెలంగాణకు ఈ బడ్జెట్‌లోనూ చేయడం లేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పడి 12 ఏళ్లు గడిచినా విభజన చట్టం హామీలు అమలు చేయడంలో కేంద్రం దారుణంగా విఫలమైందని తెలంగాణకు ఐఐఎం, నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ఊసు లేదు. ఒక్క ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం చేయడం లేదన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ నుండి బీజేపీ ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారు.. ఇక్కడి నుండి 8 మంది ఎంపీలుగా గెలిపించినా తెలంగాణపై ఈ వివక్ష తగదన్నారు.



## భూముల రీ- సర్వేకి
# ఆధునిక రోవర్లు

మొదటి పేజీ తరువాయి..

సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖలకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పిస్తూ మంత్రి పలు కీలక అంశాలను వెల్లడించారు. పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, అత్యాధునిక 'రోవర్' పరికరాలతో భూముల సర్వే నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు.ఇప్పటికే మండలానికి ఒకటి చొప్పున 460 రోవర్లను కొనుగోలు చేశామన్న ఆయన వచ్చే బడ్జెట్‌లో మరో 400 రోవర్ల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలో నక్షా (మ్యాప్) లేని 373 గ్రామాల్లో త్వరలోనే రీ-సర్వే చేపట్టబోతున్నామనీ ఇందుకు సంబంధించి 2026-27 బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత ప్రభుత్వ భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజా పరిపాలన సౌలభ్యం కోసం వీటికి అవసరమైన బడ్జెట్ కేటాయింపులు జరపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రెవెన్యూ, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు పాల్గొని శాఖల వారీగా నిధుల అవసరాలపై చర్చించారు.



# ప్రభాకర్ రావుకు ముందస్తు

మొదటి పేజీ తరువాయి..

కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో గత ప్రభుత్వంలో పోలీస్ ఉన్నతాధికారులుగా పనిచేసిన కొందరిపై సిట్ అధికారులు కేసులు నమోదు చేశారు. అందులో ప్రభాకర్ రావుతోపాటు.. ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు, తిరుపతన్న ఉన్నారు. అప్పట్లో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా వ్యవహరించిన ప్రభాకర్ రావుపై.. ఫోన్ ట్యాపింగ్ కేసులో పలు సంచలన ఆరోపణలను సిట్ అధికారులు మోపారు. ఆరోపణలు ఎదుర్కొంటోన్న పలువురు నిందితులపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ప్రభాకర్ రావుకు ముందస్తు బెయిల్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

# అవయవ మార్పిడిలో ఆదర్శంగా నిలవాలి

### రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
### అవయవ దానాల విధివిధానాలను సరళీకృతం చేయాలి
### ప్రైవేట్ ఆస్పత్రులపై మంత్రి ఆగ్రహం

**హైదరాబాద్, మార్చి 10 (వుదయం ప్రతినిధి) :** అవయవ మార్పిడి చికిత్సలో తెలంగాణ దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా కార్యాచరణను రూపొందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వైద్యాశాఖఅధికారులను ఆదేశించారు. అవయవ దానాలను ప్రోత్సహించే విధివిధానాలను సరళీకృతం చేయాలని సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో ట్రాన్స్ ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ ఆక్ట్ పాలసీ రూపకల్పనపై, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలుపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమీక్షలో అవయవ మార్పిడి చికిత్సలపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో



అవయవ మార్పిడి చికిత్సల ధరలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

సామాన్యులకు సైతం అవయవ మార్పిడి చికిత్సలకు అయ్యే ఖర్చును భరించే విధంగా ధరల నియంత్రణ ఉండాలని ప్రైవేట్ యాజమాన్యాలకు సూచించారు. ఇతర దేశాల నుంచి ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం వచ్చే రోగుల కోసం నూతన విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అవయవ మార్పిడి చికిత్సలకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో చెయ్యి మార్పిడి చికిత్స కోసం నాలుగు ఆస్పత్రులకు అనుమతులు ఇచ్చామన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ చేసిన సూచనలకు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు సానుకూలంగా స్పందించగా దాతలు ఇచ్చిన అవయవాలు వృథా కాకుండా ఆస్పత్రులు ప్రత్యేక చర్యలను చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ డా. క్రిస్టినా జెడ్ చొంగ్తు, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. నరేంద్ర కుమార్, జీవన్ దాన్ డైరెక్టర్ డా. భూషణ్ రాజ్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి పెద్దపీట

### రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
### జూబ్లీహిల్స్ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన

**హైదరాబాద్, మార్చి 10 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పునరుద్ఘాటించారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్ నగర్ డివిజన్లో రూ..20 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టబోయే వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ లకు స్థానిక శాసనసభ్యులు నవీన్ యాదవ్ తో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర నిధులతో రాష్ట్రంలో మొత్తం 16 వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ మంజూరు కాగా హైదరాబాద్ జిల్లాకు నాలుగు భవనాలు కేటాయించినట్లు వివరించారు. ఈ నియోజకవర్గంలో ఒక్కొక్క భవనానికి రూ. 20 కోట్ల అంచనా వ్యయంతో రెండు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ భవనాలు నిర్మించనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. హాస్టల్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ హాస్టల్ భవన నిర్మాణంతో వెయ్యి మంది వర్కింగ్ మహిళలకు వసతి కల్పించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంత వడ్డెర కులస్తులు నివాసం కోల్పోవడం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తేగా ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రెండు పడకల గదుల ఇండ్లు అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు విద్యాబోధన, నాణ్యమైన ఆహారం అందించడంతోపాటు, పిల్లల ఆటలకు ఎంతో ఖరీదైన ఆట వస్తువులను కేంద్రాలకు అందించామన్న మంత్రి.. అంగన్వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చామన్నారు. స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళల ఉజ్వల భవిష్యత్తుకు నియోజకవర్గంలో రెండు హాస్టల్స్ ను చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, రెవిన్యూ డివిజనల్ అధికారి సాయిరాం, మాజీ కార్పొరేటర్ సిఎన్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# యుద్ధంలో తీవ్రదశలోకి ప్రవేశిస్తున్నాం: యుఎస్ రక్షణ

### యుఎస్ రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్

మొదటి పేజీ తరువాయి..

చేరుకోవడంతో ఇరాన్ నిరాశ చెంది, తర్జనభర్జన పడుతోంది అని హెగ్సెత్ నొక్కిచెప్పారు. దీని ఫలితంగా ఇరాన్ ఒంటరై, తీవ్రంగా ఓడిపోతోంది అని ఆయన తేల్చి చెప్పారు. ఇరాన్ క్షిపణి నిల్వలు, దాని ఆయుధాల కర్మాగార స్థావరం, ఇరాన్ నావికాదళాన్ని పూర్తిగా నాశనం చేయడం వంటి కార్యకలాపాల కొనసాగింపు కోసం యుద్ధ కార్యదర్శి నిర్దిష్ట సైనిక లక్ష్యాలను వివరించారు. హెగ్సెత్ టెహ్రాన్‌పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. తమ వ్యూహాత్మక ఎంపికలు తగ్గిపోతున్నందున పాఠశాలలు, ఆసుపత్రులు సహా పౌర ప్రదేశాల నుండి క్షిపణులను ప్రయోగించడాన్ని ఇరాన్ ఆశ్రయించిందని పేర్కొన్నారు.

**ఇజ్రాయెల్ దిశగా రెండవ ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి...**

మంగళవారం మధ్యాహ్నం ఇజ్రాయెల్‌పై ఇరాన్ రెండవ బాలిస్టిక్ క్షిపణి దాడిని ప్రారంభించిందని ఇజ్రాయెలీ సైన్యం నిర్ధారించింది. పది గంటల విరామానంతరం మొదలైన ఈ ప్రయోగాలను ఐడిఎఫ్ గుర్తించి, టెల్ అవీవ్ మెట్రోపాలిటన్ ప్రాంతం సహా ఉత్తర ఇజ్రాయెల్, కేంద్ర ఇజ్రాయెల్‌లోని కొన్ని ప్రాంతాల్లో వైమానిక దాడి సైరెన్లను మోగించింది. తాజా ప్రయోగం కారణంగా, గాయపడటాలు వంటి ప్రత్యక్ష ప్రభావాలు ఏమీ లేవని తొలి వార్తలు చెప్తున్నాయి. ఆ ప్రాంతం వాసులు షెల్టర్లలోకి వెళ్లగా, ఆ క్షిపణులను విజయవంతంగా అడ్డుకున్నామని లేదా అవి బహిరంగ ప్రదేశాలలో పడ్డాయని సైనిక అధికారులు చెబుతున్నారు.

ఇరాన్‌లో కెర్మాన్ విమానాశ్రయంపై దాడి చేసిన యుఎస్, ఇజ్రాయెల్ దక్షిణ ఇరాన్‌లోని కెర్మాన్ విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకుని అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేపట్టాయి. దీనితో ఆ విమానాశ్రయానికి, అనేక విమానాలకు నష్టం వాటిల్లిందని స్థానిక మీడియా వార్తలు వెల్లడించాయి. తస్నిమ్ వార్తా సంస్థ కెర్మాన్ ప్రావిన్స్‌లోని గవర్నర్ కార్యాలయాన్ని ఉటంకిస్తూ, విమానాశ్రయంలో కొంత భాగం దెబ్బతిన్నదని, రెండు పాత, సేవలకు నోచుకోని విమానాలపై దాడి జరిగిందని పేర్కొంది. ఇరాన్‌లోని ఆరు సైనిక వైమానిక స్థావరాలపై దాడులు పూర్తయినట్లు సోమవారం ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించిన తర్వాత కెర్మాన్‌పై దాడి జరిగింది, ఈ దాడి విమానాలు, రన్‌వేలు, వైమానిక రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుంది. ఈ వారం విమానాశ్రయ దాడుల శ్రేణికి ఈ తాజా ఆపరేషన్ తోడైంది.






# పంచాయతీలకు శాశ్వత భవనాలు

మొదటి పేజీ తరువాయి..

అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కోర్సులు ఉపాధి కల్పించే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులు రూపొందించాలని డిప్యూటీ సీఎం భట్టి అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా ఎం ఓ యు కుదుర్చుకున్న కంపెనీలను సంప్రదించి అందుకు అనుగుణంగా ఏటిసి సెంటర్లలో కోర్సులు ప్రవేశపెట్టాలని సూచించారు. క్యూర్, ప్యూర్ రేర్ పాలసీకి అనుగుణంగా వచ్చే పరిశ్రమలను దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులు ప్రవేశపెట్టాలి, స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేసుకోవాలని సమంత అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్ ట్రైబల్ ఏజెన్సీల ద్వారా మాత్రమే జరగాలని ఈ క్రమంలో ఏజెన్సీలకు ఐటీడీఏ ల నుంచి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని వారిని ఆర్థికంగా బలోపేతం చేసి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులకు సూచించారు. కవ్వాల్, శ్రీశైలం వంటి టైగర్ జోన్లు అభివృద్ధి చేసుకోవాలని పర్యాటకులను ఆకర్షించే విధంగా ఎకో, టెంపుల్ టూరిజం ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించేందుకు యువతను చైతన్యం చేయాలని, డ్రగ్స్ వినియోగం ద్వారా జరిగే నష్టాన్ని కళ్లకు కట్టినట్టు చూపించే విధంగా గ్రామస్థాయిలో కళారూపాలు ప్రదర్శించేలా సాంస్కృతిక శాఖ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా కళాకారులకు జీవనోపాధి కలగడంతో పాటు సమాజంలో మంచి మార్పు కనిపిస్తుందని అన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, సీసీఎల్ఏ సెక్రటరీ లోకేష్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ అనిత రామచంద్రన్, దివ్య దేవరాజ్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, గృహ నిర్మాణ శాఖ సెక్రటరీ గౌతం , డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

## పిఎం కిసాన్ యోజనలో
# బోగస్‌ల ఏరివేత

### పక్కదారి పడుతోన్న కేంద్ర నిధులు

మొదటి పేజీ తరువాయి..

నిలిపివేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే అనర్హుల ఏరివేత ప్రక్రియను ప్రారంభించారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఏటా మూడు విడతల్లో రూ.2 వేల చొప్పున మొత్తం రూ.6 వేలను రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. 2018-19 సంవత్సరంలో ప్రారంభమైన ఈ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 21 విడతలుగా.. దేశవ్యాప్తంగా ఉన్న అర్హులైన రైతుల అకౌంట్లలో రూ.14,237.05 కోట్లను వేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించిన గణాంకాలు చెబుతున్నాయి. పీఎం కిసాన్ యోజన ప్రారంభించిన కొత్తలో కేంద్ర ప్రభుత్వం 20.28 లక్షల మంది రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేసింది. ఆ తర్వాత 2021-22 డిసెంబర్ నాటికి 10వ విడతలో భాగంగా పథకం లబ్ధిదారుల సంఖ్య అమాంతం 36.07 లక్షలకు పెరిగింది. అప్పటి నుంచి ఏటా లబ్ధిదారుల సంఖ్య పెరగడంతో ఏటా అనర్హుల జాబితాను గుర్తించి.. వారిపై చర్యలు చేపట్టింది. 15వ విడత నాటికి ఈ లబ్ధిదారుల సంఖ్య 28.71 లక్షలకు పడిపోయింది. మధ్యలో కొన్నేళ్ల పాటు అధికారులు ఫోకస్ చేయకపోవడంతో మళ్లీ ఆ సంఖ్య పెరిగింది. చివరగా ఈ పథకంలో భాగంగా 21వ విడతలో దేశంలోని 30.08 లక్షల మంది అకౌంట్లలో డబ్బులు జమ చేశారు. అయితే ఇందులో అనర్హులను గుర్తించి వారి పేర్లను తొలగించనున్నారు. ఇందులో భాగంగానే ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే 32 వేల మంది రైతులు అనర్హులుగా ఉన్నట్లు గుర్తించిన కేంద్రం.. వారికి అందించే సాయాన్ని కట్ చేయనున్నారు. చాలా మంది తమ భూములను అమ్ముకున్నారని.. మరికొందరు ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లిస్తూనే ఏటా రూ.6 వేల నగదును కేంద్రం నుంచి అందుకుంటున్నారని గుర్తించారు. ఇలాంటి అనర్హులపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో కేంద్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం 10 శాతం మంది లబ్ధిదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి.. అనర్హులుగా తేలిన వారికి సాయాన్ని నిలిపివేస్తోంది.

**బయటపడిందిలా..**

పీఎం కిసాన్ పథకం కింద డబ్బులు పొందే రైతులు కచ్చితంగా ఈ-కేవైసీ చేయించుకోవాలనే రూల్ పెట్టడంతో చాలా మంది అనర్హులను గుర్తించి.. వారికి సాయాన్ని నిలిపివేశారు. ఆధార్ కార్డును లింక్ చేయడంతో ఇన్‌కమ్ ట్యాక్స్, అధికంగా భూమిని కలిగి ఉన్నవారు.. కుటుంబంలో భార్యాభర్తలు ఇద్దరికీ పీఎం కిసాన్ రావడంతో వారంతా బయటపడి.. అనర్హులు అయ్యారు. ఇప్పటికీ చాలామంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోకపోవడంతో లబ్ధిదారుల సంఖ్య భారీగా తగ్గింది. మరోవైపు.. గతేడాదిలో ఫార్మర్ ఐడీ రిజిస్టర్ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా ఆ ప్రక్రియ 70 శాతం కూడా చేరుకోలేదు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు ప్రతీ గ్రామానికి తిరిగి పరిశీలించగా.. 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు మాత్రమే ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తేలింది. 6 ఎకరాలకు పైగా ఉన్న రైతులు మాత్రం ముందుకు రావడం లేదని స్పష్టమైంది. ఈ నేపథ్యంలోనే 10 రోజులుగా వ్యవసాయ శాఖ అధికారులు లబ్ధిదారుల జాబితాను చెక్ చేస్తున్నారు. ఆదాయ పన్ను చెల్లింపుదారులు, చనిపోయిన వారు, భూమిని అమ్మేసినవారు, 5 ఎకరాలకు పైబడిన కుటుంబాల్లో ఇద్దరూ లేదా అంతకంటే ఎక్కువ మంది లబ్ధి పొందితే వారికి ఇప్పటి నుంచి పీఎం కిసాన్ సాయం జమ కాదని అధికారులు స్పష్టం చేశారు.

## మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు
# కేబినెట్ పచ్చ జెండా

**ఢిల్లీ, మార్చి 10 (వుదయం) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ తాజా సమావేశంలో కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.8.8 లక్షల కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. జల్ జీవన్ మిషన్ పొడింపు కోసం మరో రూ.8.7 లక్షల కోట్లను కేటాయించింది. ముధురై ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటించేందుకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక సంత్రాగచ్చి-ఖరగ్‌పూర్ మధ్య రూ.2,905 కోట్లతో నాలుగు లైన్ల రహదారి, రూ.3,839 కోట్లతో బద్నావర్-థాండియా-తిమర్వానీ మధ్య 5 లైన్ల రహదారి నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. రూ.3,631 కోట్లతో జెవార్ విమానాశ్రయం-ఫరీదాబాద్ సెక్షన్‌ను కలిపే 6 లైన్ల ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉత్తరప్రదేశ్, హర్యానా మధ్య ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వే (ఢిల్లీ-ఫరీదాబాద్-బల్లభ్‌గఢ్-సోహ్నా అనుసంధాన రహదారి) నుంచి జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు హైబ్రిడ్ యాన్యుటీ మోడ్‌లో చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ కనెక్టివిటీ నిర్మాణం కోసం సవరించిన అంచనా వ్యయం రూ.3630.77 కోట్లకు ఆమోదం లభించింది. 31.42 కి.మీ. పొడవైన ఈ ప్రాజెక్టు ద్వారా దక్షిణ ఢిల్లీ, ఫరీదాబాద్, గురుగ్రామ్ నుంచి జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయానికి నేరుగా, వేగంగా వెళ్లేందుకు వీలుంటుంది. ఇది జాతీయ రాజధాని ప్రాంతంలో (ఎన్‌సీఆర్) ఆర్థిక వృద్ధిని, రవాణా సామర్థ్యాన్ని పెంచుతుంది.



# జాతీయం-అంతర్జాతీయం



# దాడులతో అల్లాడుతున్న గల్ఫ్

**వుదయం డెస్క్, మార్చి 10 :**
యుఎస్ ఇజ్రాయెలీలు ఉమ్మడిగా ఇరాన్‌పై దాడి చేసిన తర్వాత గత 11 రోజులుగా యుఎస్‌కు మిత్రులుగా ఉన్న గల్ఫ్ దేశాలపై ఇరాన్ డ్రోన్లతో, క్షిపణులతో ప్రతీకార దాడులకు దిగింది. చమురు సరఫరాలలో అంతరాయాలు ఏర్పడటంతో, చమురు ధరలు తీవ్రంగా ఊగిసలాడుతున్నాయి. సోమవారం నాడు 30శాతం పెరిగి, ఈ యుద్ధం త్వరలోనే ముగియవచ్చు అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన అనంతరం తగ్గిపోయాయి.



ఈ అంతరాయం షిప్పింగ్, బీమాలో మాత్రమే కాకుండా విమానయానం, వ్యవసాయం, ఆటోమోటివ్, ఇతర పరిశ్రమలపై కూడా తీవ్రమైన గొలుసు ప్రతిచర్యను కలిగించింది, అని అరాంకో సిఇఒ అమీన్ హెచ్ నాస్సర్ పేర్కొన్నారు. అంతరాయం ఎక్కువ కాలం కొనసాగితే ప్రపంచ చమురు మార్కెట్లకు విపత్కర పరిణామాలు ఉంటాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అంత దుష్పరిణామాలను ఈ పరిస్థితులు చూపుతాయి అని ఆయన అన్నారు. గతంలో అంతరాయాలను ఎదుర్కొన్నప్పటికీ, ఇప్పటివరకు ఇది ఈ ప్రాంతంలోని చమురు, గ్యాస్ పరిశ్రమ ఎదుర్కొన్న అతిపెద్ద సంక్షోభం ఇదే అని ఆయన వివరించారు.

అధిక సరఫరా, యుఎస్ సుంకాలు, ఇతర ఆర్థిక ప్రతికూలతలు ఆదాయాలపై ప్రభావం చూపిన తర్వాత 2025లో అరామ్‌కో నికర ఆదాయంలో 12.1 శాతం క్షీణతను నివేదించిన నేపథ్యంలో నాజర్ ఈ విషయం చెప్పారు. 2019లో రికార్డు స్థాయిలో ప్రారంభ పబ్లిక్ ఆఫర్‌ను ప్రారంభించిన అరామ్‌కో, 18 నెలల్లో 3 బిలియన్ డాలర్ల వరకు మొట్టమొదటిసారిగా వాటా బైబ్యాక్ కార్యక్రమాన్ని కూడా ప్రకటించింది.

ఈ వివాదం ఈ ప్రాంతం అంతటా విస్తరిస్తున్నందున, ఇతర గల్ఫ్ దేశాల మాదిరిగానే యుఎఇ కూడా ఇరానియన్ క్షిపణులు, డ్రోన్ల బారిన పడింది.

**గల్ఫ్ అంతటా దాడులు**

పశ్చిమాసియా యుద్ధం ఇప్పుడు సరఫరాలను తీవ్రంగా అస్థిరపరిచింది. ఇరాన్ గల్ఫ్ అంతటా ఇంధన కేంద్రాలపై దాడులు జరిపింది, వాటిలో అరాంకో విశాలమైన రాస్ తనురా సౌకర్యం కూడా ఉంది. దీనితో ఇది కొన్ని కార్యకలాపాలను నిలిపివేయవలసి వచ్చింది.

గల్ఫ్ తీరంలోని ఈ భారీ సముదాయం మధ్యప్రాచ్యంలోని అతిపెద్ద శుద్ధి కర్మాగారాలలో ఒకటి, సౌదీ ఇంధన రంగానికి మూలస్తంభం. సౌదీ చమురు క్షేత్రాలను కూడా ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది.

బహ్రెయిన్‌లోని అల్ మామీర్ చమురు కేంద్రం సోమవారం నాడు ధ్వంసం కావడంతో అగ్నిప్రమాదం, నష్టం వాటిల్లింది. ఆ దేశ ప్రభుత్వ యాజమాన్యంలోని ఇంధన సంస్థ బాప్కో కార్యకలాపాలను నిలిపివేసింది.

ఖతార్, కువైట్‌లోని ఇంధన ఉత్పత్తిదారులు గతంలో ఇలాంటి ప్రకటనలు చేశారు. తమ నియంత్రణకు ఆవల జరిగే ఘటనల వల్ల ఒప్పందాలను నెరవేర్చకుండా ఆపగలవనే హెచ్చరిక ఇది. ఇరాన్‌పై ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ భారీ వైమానిక దాడిని ప్రారంభించిన తర్వాత గల్ఫ్ దేశాలు టెహ్రాన్ సైనిక ప్రతిస్పందనను ఎక్కువగా భరించాయి.

**యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి గల్ఫ్‌లో 23 మంది మృతి:**

ఇరాన్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి పొరుగు రాష్ట్రాలలో 23 మంది మరణించినట్లు గల్ఫ్ రాష్ట్రాల అధికారులు, యుఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) పేర్కొన్నాయి. మరణించిన వారిలో ఎక్కువ మంది సైనిక లేదా భద్రతా సిబ్బంది, వీరిలో ఏడుగురు యుఎస్ సైనికులు, 10 మంది పౌరులు ఉన్నారు.

కువైట్ సైనిక, ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆరు మరణాలను నివేదించింది, వారిలో ఇద్దరు కువైట్ సైనికులు, ఇద్దరు సరిహద్దు గార్డులు ,ఇద్దరు పౌరులు ఉన్నారు, వారిలో ఒకరు 11 ఏళ్ల బాలిక.

యుఎఇ రక్షణ మంత్రిత్వ శాఖ, దుబాయ్ మీడియా ఆరు మరణాలను నివేదించాయి. వీరిలో నలుగురు పౌరులు, సాంకేతిక లోపం కారణంగా హెలికాప్టర్ కూలిపోవడంతో మరణించిన ఇద్దరు సైనిక సిబ్బంది ఉన్నారు.

సౌదీ అరేబియా పౌర రక్షణ సంస్థ ఇద్దరు పౌరుల మరణాలను నివేదించింది. బహ్రెయిన్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ రెండు మరణాలను నివేదించింది. సముద్రంలో ఒక నావికుడు మరణించినట్లు ఒమన్ సముద్ర భద్రతా కేంద్రం నివేదించింది. ఖతార్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ 16 మంది గాయపడ్డారని, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని నివేదించింది. కువైట్‌లో ఆరుగురు యుఎస్ సర్వీస్ సిబ్బంది మరణించారని, సౌదీ అరేబియాలో ఒకరు మరణించారని సెంట్‌కామ్ నిర్ధారించింది.

# ఎల్‌పిజి ఆందోళనలపై మంత్రులతో మోదీ సమావేశం

**న్యూఢిల్లీ, మార్చి 10 (వుదయం) :**
తీవ్రమవుతున్న ఇరాన్ ఇజ్రాయెల్ అమెరికా యుద్ధం భారత ఎల్‌పిజి సరఫరాలపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతుందో అంచనా వేసేందుకు పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురీ, విదేశాంగ మంత్రి ఎస్. జయశంకర్‌లతో మంగళవారం ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు.



అంతర్జాతీయ ఇంధన సరఫరాలకు కీలకమైన సముద్ర మార్గం, వ్యూహాత్మక హొర్మూజ్ జలసంధి మూసివేతతో ఏర్పడబోయే కొరతను ఎలా నిర్వహించాలన్న దానిపై చర్చ దృష్టి పెట్టింది. భారతదేశ ఇంధన భద్రతలో ఈ జలసంధి కీలక పాత్ర పోషిస్తుంది. ఎందుకంటే, భారత్ తన ఎల్‌పిజి అవసరాల్లో 62 శాతాన్ని దిగుమతి చేసుకుంటుంది. ఈ దిగుమతులలో అధిక భాగం, 85 నుంచి 90 శాతం ఉంటుందని అంచనా, సౌదీ అరేబియా వంటి గల్ఫ్ ఉత్పత్తిదారుల నుంచి హొర్మూజ్ మార్గం ద్వారా తెచ్చుకుంటుంది.

సరఫరాలలో అంతరాయం ఏర్పడటంతో, దేశీయ వినియోగదారులను రక్షించేందుకు తాత్కాలిక, ఆకస్మిక చర్యలను చేపట్టింది. ఈ లోటును భర్తీ చేయడానికి అధికారులు ప్రత్యామ్నాయ వనరులను కూడా అన్వేషిస్తున్నారు.


ప్రతి ఏడాది భారత్ 31.3 టన్నుల ఎల్పీజీని వినియోగిస్తుంది. ఇందులో కుటుంబాలు 87శాతం ఉపయోగిస్తుండగా, హోటళ్లు, రెస్టారెంట్లు తదితరాలతో కూడిన వాణిజ్య రంగం మిగిలిన 13 శాతాన్ని వినియోగిస్తుంది.

గృహాలకు నిరాటంకమైన సరఫరాలను నిర్ధారించేందుకు ప్రభుత్వం దేశీయ కుకింగ్ గ్యాస్‌కు ప్రాధాన్యత ఇవ్వడంతో, వాణిజ్య వినియోగదారులకు తగ్గింది. ముంబై, బెంగళూరుతో సహా పలు హోటళ్లు, ఇతర సంస్థలు ఈ అంతరాయాల గురించి గగ్గోలు పెడుతున్నాయి.

ఎల్పీజీ ఉత్పత్తిని పెంచవలసిందిగా పెట్రోలియం మంత్రిత్వ శాఖ రిఫైనరీలను ఆదేశించి, నిల్వలను అరికట్టడానికి గృహాలకు రీఫిల్ బుకింగ్ చక్రాన్ని 21 నుండి 25 రోజులకు పొడిగించింది.

# భారత్‌లో అవయవ మార్పిడి కోసం 89,839 మంది వేచివున్నారు

**న్యూఢిల్లీ, మార్చి 10 (వుదయం డెస్క్) :**
అవయవ మార్పిడి శస్త్రచికిత్స చేసేందుకు ఆసుపత్రులకు అనుమతి ఇచ్చే అధికారం ఆయా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని సంబంధిత అధీకృత సంస్థలకు ఉంటుంది. అవయవ మార్పిడి చేసేందుకు నమోదు చేసుకున్న 804 ఆసుపత్రుల్లో 217 ఆస్పత్రులు 2025 ఏడాదికి జాతీయ రిజిస్ట్రీ పోర్టల్లో వివరాలను నమోదు చేయడంలో విఫలమయ్యాయి. మానవ అవయవాలు, కణజాలాల మార్పిడి చట్టం (టీహెచ్ఓటీఏ) 1994లోని నిబంధనలు, దాని పరిధిలో రూపొందించిన నియమాలు, నియంత్రణల ప్రకారం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి. 2015 నుంచి జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ రిజిస్ట్రీ పోర్టల్ పని చేస్తోంది. ఈ సంస్థ www.notto.mohfw.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆసుపత్రులు, సంస్థలతో సహా అధీకృత వినియోగదారులకు అందుబాటులో ఉంది.



2026 మార్చి 3 నాటికి జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (ఎన్ఓటీటీవో) జాతీయ రిజిస్ట్రీ పోర్టల్లో ఆసుపత్రులు, అవయవ మార్పిడి కేంద్రాలు అందించిన సమాచారం ప్రకారం.. దేశంలో ప్రధాన అవయవాల కోసం ఎదురుచూస్తున్న వారి సంఖ్య 89,839. 2025లో దేశంలో నిర్వహించిన అవయవ మార్పిడి శస్త్రచికిత్సల సంఖ్య 20,019.

జాతీయ అవయవ మార్పిడి కార్యక్రమం (ఎన్ఓటీపీ)ని భారత ప్రభుత్వం అమలు చేస్తోంది. దేశంలో అవయవ మార్పిడికి సంబంధించిన మౌలిక వసతులను, సంబంధిత సేవలను మెరుగుపరచడం, అవయవ దానంపై అవగాహనను పెంపొందించడమే ఈ కేంద్ర ప్రభుత్వ పథకం లక్ష్యం. ఈ కార్యక్రమం పరిధిలో ఉత్తర ప్రాంతం (కేంద్రపాలిత ప్రాంతం లదాఖ్ మినహా), తూర్పు ప్రాంతం, ఈశాన్య ప్రాంతం (మణిపూర్, నాగాలాండ్ మినహా)లోని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రాంతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థలు (ఆర్వోటీటీవోలు), రాష్ట్ర అవయవ, కణజాల మార్పిడి సంస్థలు (ఎస్ఓటీటీవోలు) ఏర్పాటయ్యాయి. రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు బదులుగా ఈ సమాచారాన్ని కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్ రావ్ జాదవ్ లిఖితపూర్వకంగా అందించారు.

# అఫ్గాన్‌పై దాడులు సరికాదు: ఐరాసలో భారత్

**న్యూఢిల్లీ, మార్చి 10 (వుదయం డెస్క్) :**
పాకిస్థాన్ అఫ్గానిస్థాన్ మధ్య సరిహద్దు ఘర్షణలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో అఫ్గాన్‌పై ఇటీవల జరిగిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో భారత ప్రతినిధి పర్వతనేని హరీష్ పేర్కొన్నారు. 'సరిహద్దుల్లో జరిగే హింస కారణంగా సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై సెక్రటరీ జనరల్ ఆందోళన వ్యక్తంచేశారు. అంతర్జాతీయ మానవతావాదం, అంతర్జాతీయ చట్టాలను బాధ్యతాయుతంగా పాటించాలి. పౌరుల రక్షణకు చర్యలు చేపట్టాలనే సెక్రటరీ జనరల్ పిలుపునకు మా మద్దతును పునరుద్ఘాటిస్తున్నాం' అని హరీష్ అన్నారు. ఈ సందర్భంగా అఫ్గాన్ భూభాగంపై ఇటీవల జరిగిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇవి అంతర్జాతీయ చట్టాలతో పాటు ఆ దేశ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించారు. ఇక, ఇరుదేశాలు సంయమనం పాటించాలని పలు దేశాలు పిలుపునిచ్చినప్పటికీ.. పాక్ అఫ్గాన్ మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన సరిహద్దు ఆపరేషన్‌లో అనేకమంది శత్రు సైనికులను హతమార్చామని ఇరువర్గాలు ప్రకటించాయి. ఇదిలాఉండగా.. అఫ్గాన్ సరిహద్దులోని ఉత్తర వజీరిస్తాన్‌లో ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా.. 18 మంది గాయపడ్డారు.




# హక్కులను కాలరాస్తున్న పర్సనల్ లా : సుప్రీం

**న్యూఢిల్లీ, మార్చి 10 (వుదయం) :**
భారతీయ మహిళల హక్కులను పునరుద్ధరించడానికి యూనిఫాం సివిల్ కోడ్ కీలకం, కానీ అన్ని వ్యక్తిగత చట్టాలను ఒకేసారి కొట్టివేయడం వల్ల శూన్యత ఏర్పడుతుందని ముస్లిం పర్సనల్ లా కింద మహిళల వారసత్వ హక్కులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను విచారిస్తూ సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొంది. ముస్లిం పర్సనల్ లా (షరియత్) అప్లికేషన్ యాక్ట్, 1937 ప్రకారం ముస్లిం మహిళల పట్ల వివక్షతతో కూడిన వారసత్వ హక్కులను పిటిషన్ సవాలు చేసింది. పిటిషన్ పరిధిని విస్తృతం చేయాలని ,ఆ శూన్యతను ఏలా పూరించవచ్చో సూచించాలని కోర్టు పేర్కొంది.



మతంతో సంబంధం లేకుండా ప్రతి చట్టం అందరికీ వర్తిస్తుందని అంటే, యూనిఫాం సివిల్ కోడ్ తీసుకురావాలని బిజెపి పట్టుబడుతున్న నేపథ్యంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం వారసత్వం, దత్తత, వివాహం, విడాకులపై వివిధ వర్గాలకు వేర్వేరు చట్టాలు ఉన్నాయి. అందరికీ ఒకే చట్టాన్ని వర్తింప చేయడం వల్ల మతపరమైన ఆచారాలలో జోక్యం చేసుకోవడమేనని విమర్శకులు అంటున్నారు.

భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ముస్లిం సమాజంలోనే కాకుండా, భారతీయ మహిళల్లో గణనీయమైన వర్గం వివిధ వ్యక్తిగత చట్టాల కింద వారి హక్కులను కోల్పోతూనే ఉన్నారని అభిప్రాయపడింది.

షరియా చట్టం కింద ముస్లిం మహిళలకు వారసత్వ హక్కులను పరిశీలిస్తే, హిందూ వ్యక్తిగత చట్టం కింద హిందూ అవిభక్త కుటుంబ అంశాలతో సహా ఇతర వ్యక్తిగత న్యాయ వ్యవస్థలను కూడా పరిశీలించవచ్చని న్యాయమూర్తులు అన్నారు.

మొత్తం వ్యక్తిగత చట్టాన్ని కొట్టివేయడం అన్నది సమాజంలో శూన్యతను సృష్టించగలదని కోర్టు అభిప్రాయపడింది.

ఇది ముస్లింలకు మాత్రమే కాకుండా హిందువులకు కూడా బహుముఖ, భారీ ఫలితాలను కలిగిస్తుంది. వ్యక్తిగత చట్టాలను చెల్లదని ప్రకటించి శూన్యతను సృష్టించడం కన్నా, పార్లమెంటు యూనిఫాం సివిల్ కోడ్‌పై చట్టాన్ని తీసుకురావడానికి వీలుగా ఈ అంశాన్ని శాసన జ్ఞానం వైపు వాయిదా వేయడం ఉత్తమం, అని జస్టిస్ బాగ్చి అన్నారు.

కొన్ని వ్యక్తిగత న్యాయ వ్యవస్థలలో ఏకపక్ష విడాకులు వంటి కొన్ని పద్ధతులు సంక్లిష్టమైన చట్టపరమైన ప్రశ్నలను లేవనెత్తుతాయని, అటువంటి చట్టాలపై ఆధారపడిన అన్ని సంబంధాలను కోర్టులు చెల్లుబాటు చేయవచ్చా అని కూడా ఆయన ఎత్తి చూపారు. ఆ వ్యాఖ్యలతో అంగీకరిస్తూ, అందుకు సమాధానం యూనిఫాం సివిల్ కోడ్‌లో ఉందని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదిస్తూ, ముస్లిం మహిళల వ్యక్తిగత చట్ట హక్కులు ముస్లిం పురుషుల కంటే తక్కువ స్థాయిలో ఉండకూడదని కోర్టు ప్రకటించవచ్చని వాదించారు.

'ట్రిపుల్ తలాక్'ను రాజ్యాంగ విరుద్ధమైన ఆచారంగా కొట్టివేసిన షయారా బానో కేసులో సుప్రీంకోర్టు 2017 తీర్పును పట్టి చూపుతూ, వివక్షతతో కూడిన వారసత్వ నిబంధనను గుర్తించిన ముస్లిం పర్సనల్ లా (షరియత్) అప్లికేషన్ యాక్ట్ అనే చట్టం, కోర్టు ఆ మేరకు చట్టంలో జోక్యం చేసుకోవచ్చని భూషణ్ వాదించారు.

# మధురై విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా

**న్యూఢిల్లీ, మార్చి 10 (వుదయం):**
తమిళనాడులోని మధురై విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదాని ప్రకటిస్తూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ అధ్యక్షతన ఈ రోజు నిర్వహించిన మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. టెంపుల్ సిటీగా పిలిచే తమిళనాడులోని మధురై విమానాశ్రయం ఆ రాష్ట్రంలోని పాత విమానాశ్రయాల్లో ఒకటి. దక్షిణ తమిళనాడుకి ఇది ముఖద్వారంగా ఉంది. పర్యాటకాన్ని, తీర్థయాత్రలను ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషించడమే కాకుండా ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి తోడ్పడుతుంది. మధురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ హోదా స్థాయికి పెంచడం ద్వారా ప్రాంతీయంగా రవాణా సదుపాయం విస్తరిస్తుంది. వాణిజ్యం, ఆర్థికాభివృద్ధి మెరుగవుతాయి. ఈ నగర చారిత్రక ప్రాముఖ్యతకు సరితూగేలా అంతర్జాతీయ భక్తులను, వ్యాపారాలను ఈ విమానాశ్రయం ఆకర్షిస్తుంది.




# స్పీకర్ పై అవిశ్వాసం : తీర్మానంపై చర్చ

మొదటి పేజీ తరువాయి

ప్యానెల్ నుండి వచ్చిన చైర్‌పర్సన్ అటువంటి చర్చల సమయంలో అధ్యక్షత వహించడానికి కారణం స్పీకర్ అధికారం అని గొగోయ్ తన వ్యాఖ్యలను పునరుద్ఘాటించారు. స్పీకర్‌కు వ్యతిరేకంగా తీర్మానంపై చర్చ సందర్భంగా స్పీకర్ నియమించిన ప్యానెల్ సభ్యుడిని అధ్యక్షత వహించడానికి అనుమతించడం రాజ్యాంగ ఉల్లంఘనే అని ఆయన వాదించారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని సభలో మాట్లాడటానికి అనుమతించకపోవడంతో స్పీకర్ పక్షపాత వైఖరిని కలిగి ఉన్నారని ఆరోపిస్తూ మొత్తం 118 మంది ప్రతిపక్ష ఎంపీలు ఈ తీర్మానంపై సంతకం చేశారు. తీర్మానాన్ని చదువుతూ, కాంగ్రెస్ ఎంపీ జావేద్, ప్రతిపక్ష మహిళా ఎంపీలు ప్రధాన మంత్రిపై భౌతిక దాడికి ప్రణాళిక వేస్తున్నారని స్పీకర్ తప్పుడు ఆరోపణలు చేశారని కూడా ప్రస్తావించారు. పార్లమెంటు వర్గాల ప్రకారం, ఈ తీర్మానంపై చర్చను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రారంభిస్తారు. బీజేపీ ఎంపీలు అనురాగ్ ఠాకూర్, నిషికాంత్ దూబే, రవి శంకర ప్రసాద, భర్తృహరి మహతాబ్ ఈ విషయంపై వ్యాఖ్యానిస్తారు. లోక్‌జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) నాయకుడు చిరాగ్ పాశ్వాన్ కూడా చర్చ సందర్భంగా సభలో మాట్లాడతారు. కాంగ్రెస్ ఎంపీలు గౌరవ్ గొగోయ్, మనీష్ తివారీ, దీపేందర్ సింగ్ హుడా, జోతిమణి లోక్‌సభ స్పీకర్‌ను తొలగించాలని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా తమ వాదనలు వినిపిస్తారు.



# సర్ న్యాయమూర్తులపై ఆరోపణలు సహించం

మొదటి పేజీ తరువాయి

సూర్యకాంత్, జస్టిస్ జొయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం హెచ్చరించింది.

మీ దరఖాస్తులు అకాలమైనవి, మీకు దానిపై విశ్వాసం లేదని ఈ చర్య వెల్లడిస్తోంది. అలాంటి దరఖాస్తులు దాఖలు చేయడానికి మీకు ఎంత ధైర్యం? న్యాయ అధికారులను ఎవరూ ప్రశ్నించడానికి ధైర్యం చేయకూడదని ఆయన వ్యాఖ్యానించారు. భారత ప్రధాన న్యాయమూర్తిగా నేను దీనిని సహించనని, సిజెఐ కాంత్ దరఖాస్తుదారులనుద్దేశించి అన్నారు.

ఓటర్ల చేరిక, తొలగింపు అభ్యర్థనలను పరిశీలించడానికి నియమితమైన న్యాయ అధికారుల ముందు క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయంటూ పేర్కొంటూ చేసిన కొన్ని దరఖాస్తులపై కోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని ఉంచాలని పునరుద్ఘాటిస్తూ, సుప్రీంకోర్టు తన ఆదేశాల ప్రకారం న్యాయ విధులను నిర్వర్తించే అధికారులను ఏ రకంగానూ తక్కువ చేసి చూడటాన్ని అనుమతించదని సిజెఐకాంత్ అన్నారు.

సంభావ్య ఫిర్యాదులను పరిష్కరించడానికి, కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుజోయ్ పాల్ ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయవచ్చని సుప్రీంకోర్టు ఆదేశించింది. సర్ ప్రక్రియ సమయంలో తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా అప్పీళ్లను విచారించడానికి సిట్టింగ్ లేదా మాజీ న్యాయమూర్తులు ఇందులో ఉంటారు.

"అప్పీలేట్ బెంచ్‌లో ఎంత మంది న్యాయమూర్తులు ఉండాలో నిర్ణయించే బాధ్యతను మేము (హైకోర్టు) ప్రధాన న్యాయమూర్తికి వదిలివేస్తున్నాము" అని ప్రధాన న్యాయమూర్తి కాంత్ అన్నారు.

అప్పీలేట్ యంత్రాంగం, ఈ ప్రక్రియలో నిమగ్నమైన న్యాయ అధికారులకు సంబంధించిన అన్ని ఖర్చులను ఎన్నికల కమిషన్ భరిస్తుందని ధర్మాసనం ఆదేశించింది.

మాజీ న్యాయమూర్తులు లేదా ప్రస్తుత న్యాయమూర్తులకు చెల్లించాల్సిన గౌరవ వేతనాన్ని నిర్ణయించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని అభ్యర్థించాం, అన్ని ఖర్చులను భారత ఎన్నికల సంఘం భరిస్తుంది. అదేవిధంగా, మాజీ న్యాయ అధికారుల సేవకు, ప్రత్యేకించి 200 మంది అలాంటి అధికారులు పొరుగు రాష్ట్రాల నుండి వచ్చినప్పుడు వారికి గౌరవ వేతనం నిర్ణయించమని కోరాం, అని ఆ ఉత్తర్వులో పేర్కొంది.

ఇసిఐ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మధ్య విశ్వాస లేమి ఉందని సుప్రీంకోర్టు గతంలో గమనించిన నేపథ్యంలో, సర్‌ను నిర్వహించడానికి పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్ నుంచి న్యాయ అధికారులను నియమించారు.

ఫిబ్రవరి 20న, సవరణ సజావుగా అమలు అయ్యేలా చూసేందుకు ప్రస్తుతం పనిచేస్తున్న, పదవీ విరమణ చేసిన జిల్లా న్యాయమూర్తులను నియమించాలని కోర్టు ఆదేశించింది.

మంగళవారం విచారణ సందర్భంగా, దాదాపు ఏడు లక్షల క్లెయిమ్‌లను పరిష్కరించారని, 63 లక్షలు తీర్పులో ఉన్నాయని, దాదాపు 57 లక్షలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి ధర్మాసనానికి తెలియజేశారు.

దీనికి ప్రతిస్పందనగా, ప్రధాన న్యాయమూర్తి కాంత్ అధికారుల పనితీరుపై విశ్వాసం వ్యక్తం చేశారు. న్యాయ అధికారులను నియమించినప్పుడు మీరు పారిపోతారని మాకు తెలుసు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి 10 లక్షల క్లెయిమ్‌లు పరిష్కరించామని మాకు చెప్పారు అని ఆయన వ్యాఖ్యానించారు. న్యాయ అధికారుల తీర్పుల తీవ్రతను నొక్కి చెబుతూ, ఒక న్యాయ అధికారి ప్రాథమికంగా మీకు ఓటు హక్కు లేదని కనుగొంటే, మీరు ఓటు వేయరు, అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

ఓటరు జాబితా వివాదాలను నిర్వహించడానికి అప్పీలేట్ బాడీ ఏర్పాటును ప్రకటిస్తూ నోటిఫికేషన్ జారీ చేయాలని కోర్టు ఇసిఐని ఆదేశించింది.







“ సంస్కరణల కోసం అతిగా ఆరాట పడడం వల్ల, ఎవరికోసమైతే దానిని ఉద్దేశించామో వారికే హానిని తలపెట్టిన వాళ్లంగా మిగిలిపోవచ్చు, వారు ఇప్పుడు పొందుతున్న దాని కంటే తక్కువ ప్రయోజనాలకు కుదించబడే ప్రమాదం ఉంది. 1937 నాటి షరియత్ చట్టం రద్దైతే ఏం జరుగుతుంది? దానివల్ల అనవసరమైన ఖాళీ ఏర్పడదా? – సిజెఐ సూర్యకాంత్
విచక్షణకు సంబంధించినంత వరకు ఇది మంచి కేసే కానీ, డైరెక్టివ్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ స్టేట్ పాలసీ (ఆదేశిక సూత్రాలు) ప్రకారం ఉమ్మడి పౌర స్మృతిని ఏర్పాటు చేసే అధికారం గల ప్రభుత్వం విజ్ఞతకే వదిలివేయవచ్చు కదా! ఒక పురుషుడికి ఒకే భార్య అనే నియమం అన్ని మతాల్లోనూ ఒకే రంగా అమలు కావడం లేదు. అలాగని అన్ని ఇద్దరు భార్యల పెళ్లిళ్లూ రాజ్యాంగ విరుద్ధమని కోర్టు ప్రకటించాలనడం సమజంసమేనా? ఉమ్మడి పౌర స్మృతి చట్టాన్ని తీసుకరావాలని ఈ కోర్టు ఎన్నోసార్లు సిఫారసు చేసింది.
* – జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ ”

## వేమన పద్యం

నేరనన్నవాడు నెరజాణ మహిలోన
నేర్తునన్నవాడు నిందజెందు
ఊరుకున్నవాడె యుత్తమయోగిరా
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# ముదిరిన చమురు సంక్షోభం

యుద్ధం ఎన్ని అనర్థాలకు దారి తీస్తుందో చెప్పడం సాధ్యం కాదు. ప్రత్యక్షంగా దానిని ఎదుర్కొంటున్న ఇరాన్ లో ఒక పాఠశాలపై అమెరికా వేసిన బాంబు దాడి 150 మంది బాలికల ప్రాణాలను బలి తీసుకున్నది. నేరుగా ఇరాన్ సుప్రీం లీడర్ ను, ఆయన కుటుంబాన్ని, అనేకమంది ఉన్నతాధికారులను అమెరికా హతమార్చింది , శ్రీలంక తీరం లోని ఇరాన్ యుద్ధనౌకను అందులోని వందకు పైగా సిబ్బంది సహా ముంచివేసింది .ఏక పక్షంగా యుద్ధానికి వెళ్లిన అమెరికా, ఇజ్రాయెల్ లు ఇంతమంది అమాయకులను బలి తీసుకోవలసిన అవసరమేముంది? ఎప్పుడో పల్నాటి యుద్ధం నాడే స్త్రీ బాల వృద్ధులను నిస్సహాయ స్థితిలోని వారిని, శరణు కోరినవారిని చంపరాదని బ్రహ్మానాయుడు యుద్ధంలో పాల్గొంటున్న తమవైపు యోధులను ఆదేశిస్తాడు.అలాగే యుద్ధం లో భాగంగా హత్యలకు పాల్పడడం నిషిద్ధమని 1945 నాటి ఐక్యరాజ్యసమితి నియమావళి స్పష్టం చేసింది. అయితే యుద్ధ ఉన్మాదులు వీటన్నింటినీ ఉల్లంఘించి మానవాళిని శోకతప్తులను చేయడమే కర్తవ్యంగా అగ్నివర్షం కురిపిస్తున్నారు. ఇందులో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కి సాటి లేరు. యుద్ధమిప్పట్లో ఆగే సూచనలు కనిపించడం లేదు. కొత్త ప్రాంతాలకు విస్తరించే ప్రమాదమే కనిపిస్తున్నది. ముఖ్యంగా ప్రపంచ చమురులో 20 శాతం ఆయిల్ రణా అయ్యే హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడం ప్రళయ సమానంగా తయారైంది.ఇక్కడ దేశదేశాల చమురు నౌకలు నిలిచిపోయాయి. దీని ప్రభావంతో చమురు ధరలు 25 శాతానికి పైగా పెరిగిపోయాయి. హోర్ముజ్ జలసంధి మూసివేత కారణంగా దాని ద్వారా వెళ్లే సౌదీ, యు ఎ ఇ, ఇరాక్, కువైట్ లు తమ చమురు నౌకలకు విరామం ప్రకటించాయి. ఇరాన్ ను ధ్వంస ధూళి చేసి కాళ్లబేరానికి రప్పించుకోవాలనుకుంటున్న అమెరికా, ఇజ్రాయెల్ కల ఫలించేలా లేదు.ఇరాన్ తన ఆయుధ శక్తిని యుక్తితో వినియోగించి అబ్బురపరుస్తున్నది. దాని డ్రోన్ దాడులు అటు ఇజ్రాయెల్ ను, ఇటు సాటి అరబ్ దేశాలను భ య పెడుతున్నాయి. అమెరికా స్థావరాలకు అవకాశమిచ్చినందుకు సోదర దేశాలపై ఇరాన్ విరుచుకుపడుతున్నది. ఇక ముందు మీ పై దాడులు చేయబోమని హామీ ఇచ్చి అదే పనిని కొనసాగిస్తున్నది. ఆయిల్ కొరత మనిషి జీవనరంగాలన్నిటినీ ప్రభావితం చేస్తుంది. ధరలు అనూహ్యంగా పెరిగిపోతున్నాయి. ప్రపంచం లోని సగం ఆయిల్ నిక్షేపాలు గల గల్ఫ్ దేశాలపై ట్రంప్ తలపెట్టిన ఈ యుద్ధం ప్రపంచ ప్రజలందరికి సంకటంగా మారడం ఎంతో ఆందోళనకరం.

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# మోడీని ఇరకాటంలో పెట్టిన డోనాల్డ్ ట్రంప్





కేవలం విదేశాంగ మంత్రి జై శంకర్ ప్రకటనతో సరిపెడదామని చూసిన పాలక కూటమి య త్నంతో సోమవారం నాడు పార్లమెంటు ఉభయ సభలు దద్దరిల్లాయి. పశ్చిమాసియాలో పరిస్థితి గురించి ప్రకటన కాదు, చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. గల్ఫ్‌లో చిక్కుకు పోయిన భారతీయుల గురించి ఆందోళన చెందుతున్నట్లు, చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలి మంత్రి చెప్పారు. యుద్ధం, దాని పర్యవసానాల గురించి కేంద్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో చర్చించాలని ప్రతిపక్షం పట్టుబట్టటంతో ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే సమావేశాలు వాయిదా పడ్డాయి, పశ్చిమాసియా పరిస్థితి గురించి ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ స్థానం అనుమతించలేదు. యుద్ధాలు, ప్రపంచాన్ని కుదిపివేసే ఇతర సంక్షోభాలు అప్పటి వరకు ఉదాసీనంగా ఉన్నవారిలో, కొందరు నేతల మీద ఉన్న భ్రమలు పటాపంచలు అవుతాయి, అయితే కొందరు వాటిని బహిరంగంగా అంగీకరించటానికి ముందుకు రారు. ఫర్లేదు, ఒకసారి బుర్ర ఆలోచించటం ప్రారంభించిన తరువాత ఎంతకాలం బిడియపడతారు ! ఎన్‌డిఏ ప్రభుత్వం, నరేంద్రమోడీ అనుసరించే లొంగుబాటు విధానాల గురించి వామపక్షాలు, ఇతర పార్టీలు ఎంతగా మొత్తుకున్నా చెవికి ఎక్కని వారికి గూబగుయ్యిమనిపించేలా వినిపించినందుకు నిజంగా డోనాల్డ్ ట్రంప్‌కు “ అభినందనలు ” చెప్పక తప్పదు.ప్రతి తరంలోనూ ఒక మహానుభావుడు అవతరిస్తాడు మరి ! జీవ పరిణామ క్రమంలో కొన్ని జీవుల మెదళ్లు ఎదగలేదు, మనుషుల్లో కూడా అలాంటి వారు ఉంటే వారి పట్ల జాలి చూపుదాం !! నెల రోజుల పాటు రష్యన్ ముడిచమురు కొనుగోలు చేసేందుకు భారత్‌కు అనుమతి ఇస్తున్నట్లు అమెరికా ప్రకటించగానే నరేంద్రమోడీ భక్తి మైకంలో ఉన్నవారికి చెర్నాకోల దెబ్బలా తగిలి మత్తువదిలింది. ఎవడు వాడు ఎచటి వాడు ఇటు వచ్చిన తెల్లవాడు అన్న శ్రీశ్రీ పాట చాలా మందికి డోనాల్డ్ ట్రంప్‌ను గుర్తుకు తెచ్చింది. అది కూడా కొత్తగా రష్యాలో కొనుగోలు చేసేందుకు కాదు. అమెరికా ఆంక్షల కారణంగా రష్యన్ రేవుల నుంచి బయలుదేరి, ఏ దేశానికి వెళ్లాలో తెలియక సముద్రంలో లంగరు వేసిన చమురు టాంకర్లలో ఉన్న సరకు మాత్రమే కొనుగోలు చేసుకోవాలి.ఈ ఉదంతాన్ని చూస్తే బందీగా ఉన్న బానిసకు రెండు నిమిషాల్లో కాలకృత్యాలు తీర్చుకురా అన్న యజమాని ఉదారత్వం కనిపించింది. ఇంతకీ మనం అసలైన దేశభక్తులం అని చెప్పుకొనే కాషాయదళాల పాలనలో ఉన్న స్వేచ్ఛా జీవులమా, అమెరికా యజమానులకు బానిసలమా ? ఎవరికి వారు నిర్ణయించుకోవాల్సిందే ! యావత్ దేశంలో ఆత్మగౌరవం గలవారందరూ అమెరికా ప్రకటనపట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే బిజెపి మాత్రం నరేంద్రమోడీ దౌత్య విజయం అంటూ భజన చేస్తున్నది. మొత్తం మీద ఈ పరిణామం ఆ పార్టీ నిజస్వరూపాన్ని వెల్లడించింది. నిజంగా విజయమే అయితే 30 రోజులే గడువు ఎందుకు ? నీ ఆంక్షలను మేము ఖాతరు చేయం, ఇప్పటి వరకు రష్యా నుంచి దిగుమతి చేసుకున్న చమురు ఇది, ముందు ముందు కూడా కొనసాగిస్తాం అని మోడీ సర్కార్ ఎందుకు చెప్పలేకపోయింది ? మధ్యలో రష్యా నుంచి దిగుమతులను ఎందుకు తగ్గించినట్లు ? పిల్లి పాలుతాగుతూ తనను ఎవరూ చూడలేదు అనుకుంటుందట. అమెరికా బెదిరింపులకు లొంగి మాస్కో నుంచి దిగుమతులు ఎలా తగ్గించారో లోకం కోడై కూస్తున్నది.చైనా అలా తగ్గించినట్లు వార్తలు లేవు. మన ఛాతీ 56 నుంచి 6 అంగుళాలకు తగ్గిపోయిందా ! ఇంతా చేసి ఇంటా బయటా పరువుపోయినా భారత్ సాధించింది కేవలం 30 రోజుల పాటు దిగుమతులకు అనుమతా, సిగ్గుచేటు !ఈ చమురు గురించి మీడియాలో వచ్చిన వార్త ప్రకారం ప్రామాణిక బ్రెంట్ రకం ముడి చమురు ధర కంటే నాలుగైదు డాలర్లు ఎక్కువగా ఉంటుందట, గతంలో రష్యా మనకు ఇచ్చిన 13 డాలర్ల రాయితీ పోయి ఇది అదనం. అవసరం మనదైపుడు వ్యాపారులు కొండెక్కుతారని తెలిసిందే. నియంత జూలియస్ సీజర్ చరిత్రలో అతగాడి నమ్మినబంటు బ్రూటస్ వెన్నుపోటు పొడుస్తాడు, అప్పుడు బ్రూటస్ నువ్వు కూడానా ( యూ టూ బ్రూటస్) అంటాడు సీజర్.ఇది ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే అధికారమే పరమావధిగా ఉన్నవారు ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తారో తెలియదు. ముఖ్యంగా పరీక్షా సమయం వచ్చినపుడు అసలు రంగు బయటపడుతుంది. బ్రిక్స్ కూటమిలో స్థాపక సభ్యులైన బ్రెజిల్,రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాతో పాటు ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండోనేషియా, ఈజిప్టు,ఇథియోపియా ఉన్నాయి.ఒక సభ్యురాలైన ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు జరుపుతున్నాయి, వాటిని ఇరాన్ ప్రతిఘటిస్తున్నది.ఈ క్రమంలో కూటమిలోని సౌదీ అరేబియా,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఉన్న అమెరికా సైనిక కేంద్రాలు, ఎంబసీల మీద ఇరాన్ దాడులు చేస్తున్నది.ఈ పరిణామంపై కూటమికి ప్రస్తుతం అధ్యక్ష స్థానంలో నాయకత్వం వహిస్తున్న భారత్ నోరుమెదపలేదు. ఇది మన గురించి ప్రపంచానికి ఎలాంటి సందేశం ఇస్తున్నది ? గతేడాది ఇదే అమెరికా, ఇజ్రాయెల్ పన్నెండు రోజుల పాటు ఇరాన్‌పై దాడులు చేసినపుడు బ్రిక్స్ అధ్యక్ష స్థానంలో ఉన్న బ్రెజిల్ వెంటనే ఆ చర్య అంతర్జాతీయ న్యాయాన్ని ఉల్లంఘించటమే అని ఖండించింది. అప్పుడు అది తన ప్రయోజనాల గురించి ఆలోచించలేదు. గత డిసెంబరు నుంచి భారత్ అధ్యక్ష స్థానంలోకి వచ్చింది. కూటమి కంటే తన ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నదని, అమెరికా–ఇజ్రాయెల్‌కు దగ్గర ఉన్నట్లు సంకేతాలు పంపినట్లు అల్ జజీరా పత్రిక, సండే గార్డియన్ వ్యాఖ్యానించాయి. సరిగ్గా యుద్ధ ప్రారంభానికి ముందు నరేంద్రమోడి ఇజ్రాయెల్ పర్యటన, ఇతర అంశాల గురించి పేర్కొన్నాయి. పారిశ్రామిక దేశాలతో కూడిన జి 7 కూటమికి ప్రత్యామ్నాయంగా పేద దేశాల ప్రయోజనాల కోసం ఏర్పడిందే బ్రిక్స్, దాని అజెండాల్లో ఇప్పుడు సభ్య దేశాల భద్రత అంశం కూడా ఉంది. అందువలన ఇరాన్ భద్రతకు ముప్పు తెచ్చిన వారి గురించి మౌనంగా ఉంటే కుదరదు, మనకు మన ప్రయోజనాలే ముఖ్యం అనుకుంటే అధ్యక్ష స్థానం నుంచి తప్పుకోవాలి. బ్రిక్స్ అమెరికా వ్యతిరేక కూటమి అని ట్రంప్ ఆరోపించాడు. సభ్య దేశాల సంగతి తేలుస్తాం అని మాట్లాడాడు. ఈ ఏడాది జనవరిలో



దక్షిణాఫ్రికాలో నిర్వహించిన మిలిటరీ విన్యాసాలకు భారత్ దూరంగా ఉంది.అమెరికాకు ఆగ్రహం కలిగించే చర్యలేవీ చేపట్టబోమని చెప్పకనే చెప్పింది. విశాఖపట్టణంలో మనదేశం మిలన్ 2026 విన్యాసాల్లో ఇరాన్ పాల్గొనగా అమెరికా మొఖం చాటేసింది. తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే, తమ్ముడు తనవాడైనా ధర్మాన్ని ధర్మంగా చెప్పాలి అన్న లోకోక్తులు తెలిసిందే. అమెరికాతో అన్ని దేశాలూ వాణిజ్యం చేస్తున్నాయి, అయినా ఒక పరిణామం జరిగినపుడు వాటి గురించి పట్టించుకోకుండా స్పందిస్తున్నాయి. అమెరికా దాడులను ఒక్క మనదేశం తప్ప బ్రిక్స్ స్థాపకసభ్యులైన నాలుగు దేశాలూ విడివిగా ఖండించాయి. మూడు రోజులు ఆలశ్యంగా ఈ ఉన్మాదానికి స్వస్థి పలకాలని దక్షిణాఫ్రికా స్పందించింది. ముందుగా పాలక ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ ఖండిస్తూ ఒక ప్రకటన చేసింది. అవసరమైతే మధ్యవర్తి పాత్రపోషిస్తామని కూడా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా ప్రకటించాడు. ఇదే దక్షిణాఫ్రికా జనవరి నెలలో నిర్వహించిన బ్రిక్స్ నౌకాదళ విన్యాసాలలో ఇరాన్ భాగస్వామిగా ఉండటానికి అంగీకరించినందుకు దక్షిణాఫ్రికాపై ట్రంప్ తీవ్రంగా విమర్శించాడు. తొలి దాడి, ఖమేనీ హత్య జరిగిన మూడు రోజుల తరువాత భారత విదేశాంగశాఖ ఒక ప్రకటన చేస్తూ చర్చలు, దౌత్యాన్ని కోరుతున్నామని, వివాదం త్వరగా ముగియాలని పేర్కొన్నది. ఇరాన్ నేతలతో ఎలాంటి మాటలు లేకపోగా దాని పేరు ఎత్తకుండా గల్ఫ్ దేశాల నేతలతో మాట్లాడుతూ వాటి భూభాగాలపై జరుగుతున్న దాడులను నరేంద్రమోడీ విమర్శించారు. గాజాలో ఇజ్రాయెల్ జరుపుతున్న మారణకాండ, వెస్ట్‌బాంక్ ప్రాంతంలో పాలస్తీనియన్లపై కొనసాగుతున్న మారణకాండను ప్రపంచ దేశాలు ఖండిస్తుండగా ఫిబ్రవరి 25,25 తేదీలలో పర్యటన జరిపి పార్లమెంట్ నెసెట్‌లో మాట్లాడుతూ వర్తమానంలో, తరువాత కూడా తాము ఇజ్రాయెల్‌తోనే ఉంటామని స్పష్టం చేశారు. హ మ స్ దాడులను ఖండించారు గానీ వారిని అణచేపేరుతో గాజాలో టెల్అవీవ్ జరిపిన మారణకాండ గురించి పల్లెత్తుమాట అనలేదు. గాజాలో యుద్ధ నేరాల కేసులో తమ ముందు హాజరు కావాలని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు కోరిన నెతన్యాహును ఆలింగనాలు చేసుకున్నారు. రెండు దేశాల సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి ఎదిగాయని కూడా మోడీ చెప్పారు. ఆ మాటలు చెబుతున్న సమాయానికే అమెరికా, ఇజ్రాయెల్ అన్ని యుద్ధ సన్నాహాలు చేసుకున్నాయి.ఒక రోజు తేడాతో దాడులను ప్రారంభించాయంటే మోడీకి ఆ విషయం తెలియకుండా ఎలా ఉంటుందని విమర్శకులు అంటున్నారు. నిజంగా తెలియదంటే మన వేగుల వ్యవస్థ ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించాల్సి ఉంటుంది. తెలుసు అంటే ఎరుకలో ఉండి కూడా మోడీ వెళ్లారంటే ఇజ్రాయెల్‌కు సమర్థనే అన్నది స్పష్టం. దీని గురించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. గల్ఫ్‌లో ఉన్న భారతీయుల గురించే మా తపన అని జైశంకర్ చెప్పారు. ఇరాన్‌లో కూడా ఉన్నారుగా, అయినా తమ మీద దాడి చేస్తే ఎక్కడ అమెరికా మిలిటరీ స్థావరాలు ఉన్నా వాటి మీద దాడి చేస్తామని ముందే ఇరాన్ ప్రకటించింది. దాని అర్థం తెలియనంత అమాయకంగా కేంద్ర ప్రభుత్వం ఉందని నమ్మటానికి ఎవరూ చెవుల్లో పూలు పెట్టుకొని లేరు. గతంలో ఉక్రెయిన్‌లో చిక్కుకు పోయిన భారతీయులను తీసుకు వచ్చేందుకు తన పలుకుబడిని ఉపయోగించి యుద్ధాన్ని కొద్ది రోజులు ఆపారని మోడీ గురించి పెద్ద ప్రచారం చేశారు కదా, ఆ పని ఇప్పుడెందుకు చేయలేదు ? పశ్చిమాసియా సంక్షోభ స మ య ంలో భ్రమల్లో ఉన్న అనేక మంది భారతీయులను మరో అంశంలో కూడా అమెరికా కళ్లు తెరిపించింది. మన స్వేచ్ఛా మీడియా దాని గురించి పెద్దగా వార్తలు ఇవ్వటానికి చర్చిందేందుకు భయపడింది. తమను దెబ్బతీసేందుకు భారత్‌ను అనుమతించనివ్వం, ఇరవై ఏండ్ల క్రితం చైనా వ్యవహారంలో చేసిన తప్పిదాన్ని పునరావృతం కానివ్వం, ఇది భారత్‌కు అర్థమైంది, మాకు పోటీగా మరొక అర్థిక వ్యవస్థ ఎదగటం మా పౌరుల ప్రయోజనాలకు విరుద్ధం అని న్యూఢిల్లీ గడ్డమీద రైసినా 2026 చర్చల్లో అమెరికా విదేశాంగశాఖ ఉపమంత్రి క్రిస్టోఫర్ లాండవ్ తెగేసి చెప్పినా మనం గొణగటం తప్ప గట్టిగా మాట్లాడలేకపోయాం. దీని అర్థం ఏమిటి ? గత పన్నెండు సంవత్సరాలుగా చైనాను పక్కకు నెట్టి మేడిన్ ఇండియా, మేకిన్ ఇండియా పథకాలతో భారత్‌ను ప్రపంచ ఫ్యాక్టరీగా మారుస్తాని మోడీ అండ్‌కో చెబుతున్నది.దానికి మేం అనుమతించం అని అమెరికా చెప్పింది. అంతే కాదు భారత్‌తో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం కూడా తొలుత తమ ప్రయోజనాలకే పెద్ద పీటవేసిందని కూడా క్రిస్టోఫర్ ఎలాంటి శషభిషలు లేకుండా చెప్పాడు. ముందే చెప్పినట్లుగా సంచలనాత్మక పరిణామాలు జరిగినపుడు జనంలో అనేక ఆలోచనలకు నాంది పడుతుంది. భారత్‌ను విశ్వగురువుగా మారుస్తానని చెప్పిన నరేంద్రమోడీ అమెరికా తోకగా మారుస్తున్నారని పశ్చిమాసియా సంక్షోభం వెల్లడించింది. గతంలో వామపక్షాలు, ఇతర పార్టీలు, ఎందరో మేధావులు చెప్పినా పట్టించుకోని వారు ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ తీరుతో ఆలోచించకతప్పటం లేదు !



ఎం కోటేశ్వరరావు
8331013288

## ఎండిపోతున్న నీటి వనరులు

# మృత్యు వొడిలో అడవులు

వేసవి ఇంకా మొదలుకాకముందే తెలంగాణ అడవుల్లో ఒక ప్రమాద సంకేతం కనిపిస్తోంది. అమ్రాబాద్ మరియు కవాల్ టైగర్ రిజర్వ్ ప్రాంతాల్లో చెరువులు, నీటి కుంటలు వేగంగా ఎండిపోతున్నాయి.ఫలితంగా వన్యప్రాణులు తాగునీటి కోసం అడవులను వదిలి అటవీ గ్రామాల బాట పడుతున్నాయి. ఇది కేవలం వన్యప్రాణుల సమస్య కాదు.. పర్యావరణ సమతుల్యానికి సంబంధించిన పెద్ద ప్రశ్న.

ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే – అడవులు నిశ్శబ్దంగా మృతి చెందుతాయి. వేసవి ఇంకా పూర్తిగా మొదలుకాకముందే తెలంగాణ అడవుల్లో ఒక నిశ్శబ్ద సంక్షోభం పెరుగుతోంది. చెట్ల మధ్య నడిచే గాలి, పక్షుల కిలకిలలు, జంతువుల కదలికలతో జీవం నిండిన అడవులు ఇప్పుడు నీటి కోసం ఎదురుచూస్తున్నాయి.మార్చి నెలలోనే ఎండలు భగ్గుమంటుండటంతో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కవాల్ టైగర్ రిజర్వ్ ప్రాం తాల్లో నీటి వనరులు వేగంగా ఎండిపోతున్నాయి. చెరువు లు, నీటి కుంటలు, చెక్ డ్యామ్‌లు నీటిని కోల్పోవడంతో అడవుల్లో నివసించే జింకలు, దుప్పులు, అడవి పందులు, ఇతర జంతువులు తాగునీటి కోసం తీవ్రంగా తల్లడిల్లుతున్నాయి. ఇది కేవలం ఒక కాలానుగుణ సమస్య కాదు. ఇది మనం ప్రకృతిని ఎలా నిర్వహిస్తున్నామన్నదానికి ప్రతిబింబం.

### ముందస్తు హెచ్చరికలు ఉన్నా.. సిద్ధత లేదు

భారత వాతావరణ శాఖ ఇప్పటికే తెలంగాణలో మార్చి నుంచి మే వరకు తీవ్ర ఎండలు ఉంటాయని హెచ్చరించింది. ఇలాంటి పరిస్థితుల్లో అడవుల్లోని నీటి వనరులను ముందుగానే సంరక్షించడం అత్యవసరం.అయితే నేలపై కనిపిస్తున్న పరిస్థితి వేరే కథ చెబుతోంది. నీటి కుంటలు పూడిపోవడం, చెక్ డ్యామ్‌లు దెబ్బతినడం, సోలార్ బోర్లు పనిచేయకపోవడం వంటి సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి.ఇది ఒక పెద్ద ప్రశ్నను ముందుకు తెస్తోంది. ప్రకృతిని రక్షించడంలో మన పరిపాలనా వ్యవస్థ ఎంత సిద్ధంగా ఉంది?



అమ్రాబాద్ అడవులు – నీటి కోసం ఎదురు చూపు

నల్లమల అడవుల మధ్య విస్తరించిన అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో వన్యప్రాణుల కోసం అనేక నీటి వనరులు ఏర్పాటు చేశారు. అధికారిక సమాచారం ప్రకారం అక్కడ 99 చెక్ డ్యామ్‌లు160 పర్కులేషన్ ట్యాంకులు1543 సాసర్ పిట్స్ (తాగునీటి కుంటలు)28 సోలార్ బోర్లుఉన్నాయి. ఈ సంఖ్యలు చూసినప్పుడు అడవుల్లో నీటి కొరత ఉండకూడదనిపిస్తుంది. కానీ వాస్తవం మాత్రం వేరేలా ఉంది. కొన్ని సోలార్ బోర్లు పనిచేయకపోవడం, నీటి కుంటలు ఎండిపోవడం వల్ల జంతువులు తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నాయి. నీటి కుంటలను ట్యాంకర్లతో నింపేందుకు అటవీశాఖ ప్రతిపాదనలు పంపినప్పటికీ నిధుల విడుదల ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది.

### కవాల్ అడవుల్లో కూడా అదే కథ

ఉత్తర తెలంగాణలోని కవాల్ టైగర్ రిజర్వ్‌లో పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. అక్కడ ఏర్పాటు చేసిన సాసర్ పిట్స్ దెబ్బతినడంతో అవి మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్నాయి.వేసవి తీవ్రత పెరిగే కొద్దీ నీటి వనరులు పూర్తిగా ఎండిపోతే వన్యప్రాణులు పెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంది.అడవి దాటుతున్న జంతువులునీటి కోసం జంతువులు ఇప్పుడు అడవులను వదిలి అటవీ గ్రామాల వైపు రావడం ప్రారంభించాయి. ఇది ప్రకృతి వ్యవస్థలోని అసమతుల్యతకు స్పష్టమైన సంకేతం.గ్రామాల్లోకి వచ్చిన జింకలు, దుప్పులు వంటి జంతువులపై వీధికుక్కలు దాడి చేస్తున్న ఘటనలు ఇటీవల నమోదయ్యాయి. కొన్ని చోట్ల అవి ప్రాణాలు కోల్పోయాయి.ఈ సంఘటనలు చిన్నగా కనిపించినా అవి అడవుల ఆరోగ్యాన్ని సూచించే పెద్ద సంకేతాలు. నీరు లేకపోతే అడవి నిలవదు. అడవుల్లో నీరు కేవలం తాగునీరు కాదు. అది జీవ వైవిధ్యాన్ని నిలబెట్టే మూలాధారం.నీరు ఉంటేనేగడ్డి పెరుగుతుంది. చిన్న జంతువులు జీవిస్తాయి. పెద్ద మృగాలు ఆహారం పొందుతాయి. అడవి జీవ చక్రం కొనసాగుతుంది.నీరు లేకపోతే ఈ మొత్తం జీవ వ్యవస్థ క్రమంగా కూలిపోతుంది.అడవుల భవిష్యత్తు – పరిపాలన పరీక్షఈ పరిస్థితి ప్రభుత్వానికి కూడా ఒక పరీక్షే. అడవుల్లో నీటి వనరులను సంరక్షించడం కేవలం అటవీశాఖ బాధ్యత కాదు. అది పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వ సంకల్పాన్ని చూపించే అంశం. తక్షణం తీసుకోవాల్సిన చర్యలు స్పష్టంగా ఉన్నాయి: పనిచేయని సోలార్ బోర్లను వెంటనే మరమ్మతు చేయాలి. నీటి కుంటలు, చెక్ డ్యామ్‌లను పునరుద్ధరించాలి. ట్యాంకర్ల ద్వారా తాత్కాలికంగా నీటి సరఫరా చేయాలి. వేసవి కాలానికి ప్రత్యేక అటవీ నీటి నిర్వహణ ప్రణాళిక రూపొందించాలి. ఈ చర్యలు ఆలస్యం అయితే దాని ప్రభావం కేవలం జంతువులపైనే కాదు.. మొత్తం పర్యావరణ వ్యవస్థపై పడుతుంది.

### వన్యప్రాణుల దాహం – మనిషికి హెచ్చరిక

అడవుల్లో దాహంతో విలవిలలాడుతున్న జంతువుల కథ ఒక నిశ్శబ్ద హెచ్చరిక.ప్రకృతి సమస్యలు ఎప్పుడూ ఒక్కరోజులో రావు. అవి చిన్న సంకేతాలతో ప్రారంభమవుతాయి. నీటి కుంటలు ఎండిపోవడం, జంతువులు గ్రామాల్లోకి రావడం, పర్యావరణ సమతుల్యం క్రమంగా కూలిపోవడం.. ఇవన్నీ పెద్ద సంక్షోభానికి ముందస్తు సూచనలు. అడవులను కాపాడటం అంటే కేవలం జంతువులను కాపాడటం కాదు. అది మనిషి భవిష్యత్తును కాపాడటమే.ఎందుకంటే చివరికి ఒక నిజం ఎప్పటికీ మారదు. అడవులు బతికితేనే మనిషి బతుకుతాడు.



శ్యాంమోహన్
9440595858

# గ్రామ స్వరాజ్య ధ్రువతార

భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని మహాత్మా గాంధీ చెప్పారు. ఆ మాటలకు సజీవ రూపం ఇచ్చి, ఒక మారుమూల పల్లెను అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మార్చేలా కూసం రాజమౌళి గొప్ప కృషి చేశారు. వరంగల్ జిల్లాలోని గంగదేవిపల్లి మాజీ సర్పంచ్ గా ఆయన మరణం తెలంగాణ గ్రామీణ వికాస చరిత్రలో ఒక శకాన్ని ముగించింది. అధికారం అంటే హోదా కాదు, అదొక సామాజిక బాధ్యత అని నిరూపించిన రాజమౌళి జీవన ప్రస్థానం నేటి తరం ప్రజా ప్రతినిధులకు ఒక పాఠ్యపుస్తకంగా చెప్పక తప్పదు. రాజమౌళి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన కాలంలో గంగదేవిపల్లి ఇతర పల్లెల లాగే ఎన్నో సమస్యలతో ఉండేది. కానీ, ఆయనలో ఉన్న ఒక స్పష్టమైన విజన్ ఆ గ్రామాన్ని మార్చివేసింది. అభివృద్ధి అంటే కేవలం కాంక్రీటు కట్టడాలు కాదని, అది ప్రజల ఆలోచనా విధానంలో రావాల్సిన మార్పు అని ఆయన బలంగా నమ్మారన్నట్లుగా ఆయన చేసిన ప్రణాళిక బద్దైదమైన కృషిని పరిశీలిస్తే ఇట్టే అర్థమవుతుంది. ఇందుకోసం ఆయన ఎంచుకున్న ఆయుధం "సమష్టి భాగస్వామ్యం". గ్రామంలో ఏ పని చేయాలన్నా గ్రామస్తులందరినీ భాగస్వాములను చేయడం, వారిలో బాధ్యతను పెంచడం రాజమౌళి అనుసరించిన గొప్ప వ్యూహం. గంగదేవిపల్లి దేశానికే ఆదర్శంగా నిలవడానికి రాజమౌళి అమలు చేసిన కొన్ని విప్లవాత్మక నిర్ణయాలే కారణం గ్రామంలో మద్యపానాన్ని పూర్తిగా నిషేధించడం ద్వారా పేద కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే ప్రయత్నం చేశారు. ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలనే పట్టుదలతో గ్రామస్తుల సహకారంతో నూటికి నూరు శాతం అక్షరాస్యత సాధించి దేశం దృష్టిని ఆకర్షించారు. ముఖ్యంగా గ్రామాభివృద్ధి కోసం 18 రకాల కమిటీలను ఏర్పాటు చేసి, అందులో మహిళలకు, యువతకు పెద్దపీట వేశారు. ఇంకుడు గుంతల నిర్మాణం, తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం వంటి రంగాల్లో ఈ కమిటీలు అద్భుతమైన ఫలితాలను ఇచ్చాయి. ప్రతి ఇంటికీ బ్యాంక్ ఖాతా ఉండటమే కాకుండా, గ్రామస్థులు పొదుపు చేసుకునేలా పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి ప్రోత్సహించి ఆర్థిక స్వావలంబన దిశగా గ్రామాన్ని నడిపించి ఫలితాలు సాధించారు. ఇలాంటి అనేక ప్రయోగాలతో ఆ గ్రామ ఖాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలుపడంలో ఆయన పాత్ర కీలకం. కేంద్ర ప్రభుత్వం నుండి ఎన్నోసార్లు ఉత్తమ పంచాయతీ పురస్కారాలను అందుకోవడమే కాకుండా, ఐక్యరాజ్యసమితి ప్రతినిధులు సైతం ఈ పల్లెను సందర్శించేలా రాజమౌళి కృషి చేశారు. ప్రధానులు, ముఖ్యమంత్రులు సైతం గంగదేవిపల్లి అభివృద్ధి నమూనాను అధ్యయనం చేయాలని సూచించారంటే అది రాజమౌళి అకుంఠిత దీక్షకు నిదర్శనంగా విశ్లేషకులు భావిస్తుంటారు. "నిర్మల్ గ్రామ్" పురస్కారం నుండి మరెన్నో జాతీయ అవార్డుల వరకు గంగదేవిపల్లి ప్రయాణం రాజమౌళి కీర్తి కిరీటంలో మణిపూసలు. కూసం రాజమౌళి అకాలమరణం ఆ గ్రామానికి తీరని లోటుగానే భావించాలి.

రాజేందర్ దామెర (దారా)
సీనియర్ జర్నలిస్ట్



# గ్రేటర్ హైదరాబాద్





## ఇంటి పట్టాలు అందజేత

### కౌన్సిలర్ కళ్యాణ్ కార్ దిలీప్ కుమార్

షాద్ నగర్, మార్చి 10,(వుదయం):

కోటి ఆనందాలతో కొత్త ఇంటి వైపు లబ్ధిదారులు అడుగుపెట్టారు.. కళ్ళల్లో నిండిన ఆనందాలతో తమ కలను నెరవేర్చుకున్నారు.. పట్టణంలోని 12వ వార్డులో మొత్తం 21 మంది లబ్ధిదారులకు కౌన్సిలర్ కళ్యాణ్ కార్ దిలీప్ కుమార్ ఇంటి పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తాను ఇచ్చిన మాట నిలబెట్టుకొని వారితో అర్హులందరికీ ఇళ్లను అందించారని సంతోషం వ్యక్తం చేశారు. లబ్ధిదారులు తాళ్లపల్లి జయమ్మ, పెద్దమని కవిత, బుస్రాబేగం, వడ్ల రాధిక, రెహమద్ బేగం, ఎమరబెల్లి అనసూయ, రొంపల్లి శ్రీలత, పెద్దాపురం అరుణ, సంపత్రి జయమ్మ, అన్నా సుల్తానా, భయ్యాంకరి సుమన్, గంగమొని ఇందిరా, కమ్మరి రాధిక, వేప చెట్టు అనసూయ, మలగారి లక్ష్మమ్మ, చాకలి జయమ్మ, వడ్ల జయమ్మ, పగడాల బాలమణి, కొక్కు చరిత, జంగం సంగీత, మెహరాజ్ బేగం ఈ ఇంటి పట్టాలను అందుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ ఇబ్రహీం, గంగమోని సత్తయ్య, నందిగామ మల్లేష్, దుర్గేష్, కొక్కు దశరథ, సురేష్, గంగ మోని సాయి, రమేష్, రాహుల్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు..

## నీరా కేఫ్ లీజుకు టెండర్ల ఆహ్వానం

### వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి మాధవ్ రెడ్డి

వికారాబాద్, మార్చి 10 (వుదయం):



హైదరాబాద్ నగరంలోని నెక్లెస్ రోడ్ వద్ద ఉన్ననీరా కేఫే భవనం (నీరా ప్రాసెసింగ్ యూనిట్, బ్యాంక్వెట్ హాల్ మరియు (7) వాణిజ్య దుకాణాలు) లీజుకు ఇవ్వడానికి టెండర్లు ఆహ్వానించబడినట్లు జిల్లా వెనుక బడిన తరగతుల అధికారి మాధవ్ రెడ్డి తెలిపారు. అందుకు గాను వికారాబాద్ జిల్లాలోని గౌడ వృత్తికి చెందిన సంఘాలు, 01-01-2026 నాటికి ఎక్సైజ్ శాఖలో నమోదు చేయబడి క్రియాశీలంగా ఉన్న సంఘాల నుండి నిర్దిష్ట నిబంధనలు మరియు షరతుల మేరకు ఈ టెండర్లు పిలవబడు తున్నట్లు ఆయన తెలిపారు. అందువల్ల వికారాబాద్ జిల్లా లోని అన్ని ఆసక్తి గల గౌడ వృత్తి సంఘాలు టెండర్ ప్రక్రియలో పాల్గొనవలసిందిగా కోరతున్నట్టు ఆయన తెలిపారు.

ఆసక్తి గల గౌడ వృత్తి సంఘాలు 09-03-2026 ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఆన్లైన్ ద్వారా బిడ్ దాఖలు చేసుకోవచ్చని ,బిడ్ల దాఖలుకు చివరి తేదీ 18 032026 మధ్యాహ్నం 3.00 గంటల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. సాంకేతిక బిడ్ తెరవడం 20-03-2026 ఉదయం 10.30 గంటలకు జరగనుండగా, ఆర్థిక బిడ్ అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు తెరవబడనున్నట్లు ఆయన తెలిపారు.

వివరమైన ప్రకటన, దరఖాస్తు విధానం మరియు టెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు www.tgttcfc.com వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్నాయని బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ తెలిపారు

## లబ్ధిదారులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు

### పట్టాలు అందజేసిన కౌన్సిలర్ నాజియా బేగం సర్వర్ పాష



షాద్ నగర్, మార్చి 10,(వుదయం):

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఇంటి పట్టాలు చేతికి అందాయి.. అనుకున్న కల సాకారం కావడంతో లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందాలు నిండాయి.. పట్టణంలోని 17వ వార్డులో దృశ్యమిది. ఈ వార్డులో లబ్ధిదారులకు మంజూరైన డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన పట్టాలను మంగళవారం కౌన్సిలర్ నాజియా బేగం సర్వర్ పాషాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులకు సొంతింటి కలను నెరవేర్చే బాధ్యత ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ చేపట్టారని, డబల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద తాగునీరు, రహదారులు, విద్యుత్, కాలువల నిర్మాణం వంటి సదుపాయాలను కల్పించి అనంతరం ఇండ్లను ఇచ్చారని వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కౌన్సిలర్ నాజియా బేగం, సర్వర్ పాషాలకు కృతజ్ఞతలు తెలిపారు.

## వైద్యసేవలపై కలెక్టర్ ఆరా



వికారాబాద్, మార్చి 10 (వుదయం):

సరైన వైద్య సేవలు సమయానికి స అందుతున్నాయా..అని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ప్రత్యక్షంగా రోగులను అడిగి తెలుసుకున్నారు. మంగళ వారం జిల్లా కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి స్వర్ణకుమారి ని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది సమయానికి వస్తున్నారా అని డిఎంహెచ్ఓ ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని, ప్రతి రోజు ఇన్ పేషెంట్ , ఔట్ పేషంట్ ఎంతమంది వస్తున్నారని డిఎంహెచ్ఓ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలు పరీక్షల కోసం ఎంతమంది వస్తున్నారని అడిగి తెలుసుకొని ,వచ్చిన పేషెంట్ల తో నేరుగా కలెక్టర్ వారికి అందుతున్న వైద్య సేవల పై ఆరా తీశారు.ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయా,ప్రతి నెల ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయని డిఎంహెచ్ఓ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, ఔషధాల నిల్వలు, రోగులకు అందుతున్న సౌకర్యాలను ఈ సందర్భంగా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సమయానికి సరైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఆసుపత్రిలో పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, మందుల అందుబాటు వంటి అంశాలను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిబంది హాజరు రిజిస్టర్, ఎన్ సి డి స్క్రినింగ్, హౌట్, ఇన్ ఫేషెంట్ల రిజిస్టర్ లను మరియు వార్డు రూమ్ , మందుల రూమ్ లను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పక్కనే ఉన్న సఖి కేంద్రం ను జిల్లా కలెక్టర్ సందర్శించాడు. కార్యక్రమంలో , డాక్టర్ సౌమ్య ,రజని వైద్యులు మరియు సిబ్బంది తదితరు లు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో మహిళల పాత్ర గొప్పది

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ




వికారాబాద్, మార్చి 10 (వుదయం):

సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని,కుటుంబం నుండి దేశ నిర్మాణం వరకు ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటున్నారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మంగళవారము మహిళా శిశుసంక్షేమ దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలును కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మహిళలందరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం మహిళా దినోత్సవం." లాభం కోసం ఇవ్వండి" అనే థీమ్ తో ముందుకు వెళ్లాలని ఉద్ఘాటించారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటిని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మహిళలు విద్య, ఉపాధి, ఆరోగ్యం మరియు స్వయం ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు.


సమాజంలో మహిళలకు గౌరవం, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ తెలిపారు.

మహిళల అభివృద్ధి ద్వారా సమాజం మరింత బలపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. మహిళలు విద్యతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, లింగ వివక్షత పూర్తి స్థాయిలో రూపుమాపాలని, జిల్లా కలెక్టర్ అన్నారు. యూపీఎస్సీ రిజల్ట్ లో కూడా మహిళలు ఎక్కువ శాతం ఉన్నారని, మహిళలు తలచుకుంటే ఏదైనా అవలీలగా చేయగలరని,అన్నిరంగాలలో రాణిస్తూ ముందుకు వెళుతున్నారని ముఖ్యంగా క్రీడారంగంలో మహిళల పాత్ర అమోఘమని, భారత దేశంలోనే మహిళలు ఉన్నత స్థానంలో ఉండి గౌరవం దక్కించుకున్నారని , ఈ సందర్భంగా మహిళలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు . మహిళలకు ప్రత్యేకంగా పథకాలు అందుబాటులో ఉన్నాయని వాటిలో పోషన్ అభియాన్, మహిళా శక్తి ఉన్నాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీలు, ఆశ వర్కర్లు, ఇతర ఉద్యోగులు మహిళా నవ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని తెలిపారు. ఒక కుటుంబంలో మహిళా మంచిగా ఉంటే ఆ కుటుంబం మంచిగా ఉంటుందని, సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గ్రామస్థాయిలో మరియు పాఠశాల స్థాయిలో మహిళల హక్కుల పైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.అంతకు ముందు అంతర్జాతీయ మహిళా దినోత్సవము సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, మరియు హెల్త్ క్యాంప్ లను కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ , అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, జిల్లా వైద్యాధికారి స్వర్ణ కుమారి, జిల్లా విద్యాధికారి రేణుక దేవి , డి పి ఆర్ ఓ చెన్నమ్మ ,మెప్మా పీడీ రవికుమార్ జిల్లా ఆర్గికల్చర్ ఆఫీసర్ సత్తార్ , మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అర్బ సుదాకర్ రెడ్డి, చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కాంతారావు, , మెహారున్నీసా,సీనియర్ అసిస్టెంట్ రాములు , ఐసిడిఎస్ సూపర్వైజర్లు, మున్సిపల్ మహిళా కౌన్సిలర్స్,ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఆర్టీసీ సిబ్బంది, డి సి పి యు సిబ్బంది,అంగన్వాడీ ఉద్యోగులు,ఏఎన్ఎంలు మరియు ఆశా కార్యకర్తలు ఇతర మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## వడ్డెరల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించం

### వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు పీట్ల శ్రీధర్



కుత్బుల్లాపూర్, మార్చి 10 (వుదయం ప్రతినిధి ) :

కులం పేరుతో వడ్డెరలను దూషించడం అత్యంత హేయమైన చర్య అని, ఇటువంటి కుల అహంకారపూరిత విమర్శలను ఏమాత్రం సహించేది లేదని జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షులు పీట్ల శ్రీధర్ స్పష్టం చేశారు. ప్రగతి నగర్ కు చెందిన వడ్డెర కులస్తుడు ఉప్పుజన్నంతిన రాములు నాయక్ అనే వ్యక్తి ఇష్టానుసారంగా బూతులు తిడుతూ, కులం పేరుతో దుశించి కించపరచడంపై వడ్డెర సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను నిరసిస్తూ మంగళవారం ప్రగతి నగర్ నుండి వందలాది మంది వడ్డెర కులస్తులు, సంఘం నాయకులు భారీ ర్యాలీగా బాచుపల్లి పోలీస్ స్టేషన్ కు తరలివెళ్లారు. కుల వివక్షకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి అనంతరం నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐ సరేష్ కు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా పీట్ల శ్రీధర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా వడ్డెర కులస్తులకు ఎక్కడ అన్యాయం జరిగినా, వారు ఏ మూలన ఇబ్బందుల్లో ఉన్నా జాతీయ వడ్డెర సంఘం ముందుండి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కష్టపడి జీవించే వడ్డెర జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తే సహించేది లేదని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జాతీయ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు వల్లెపు శివకుమార్, పీట్ల మల్లేష్, ప్రధాన కార్యదర్శి వడకొండలు,జాతీయ వడ్డెర సంఘం యువజన అధ్యక్షులు భరత్, జాతీయ కార్యదర్శి పల్లె కృష్ణ,కుత్బుల్లాపూర్ వడ్డెర సంఘం నాయకులు లింగస్వామి, రాష్ట్ర కార్యదర్శి జెరుపటి రాజు, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బోదాసు రవి, జాతీయ నాయకులు తన్నీరు వెంకటాద్రి, షణ్ముఖ రాజు,దండుగుల స్వామి, స్థానిక వడ్డెర సంఘం నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## పార్క్‌లను అభివృద్ధి చేయాలి

### అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశం

హైదరాబాద్, ,మార్చి 10 (వుదయం):




ఐడిహెచ్ డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీలో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పార్కులను అభివృద్ధి చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా మంగళవారం సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని ఐడిహెచ్ డబుల్ బెడ్‌రూం కాలనీ, అంబేద్కర్ నగర్ కాలనీలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హౌసింగ్ ఎండీ గౌతమ్ ఆయనతో కలిసి పర్యటించారు. పాత వాంబే పథకంలో నిర్మించిన నాలుగు బ్లాకుల ఇళ్లను కమిషనర్ కలెక్టర్, హౌసింగ్ ఎండి తో కలిసి పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం గురించి టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో పిల్లల సంఖ్య ఎక్కువగా పెంచాలని, కేంద్రం తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పాత వస్తువులను తొలగించాలని అలాగే పిల్లలకు సమయానికి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. అదేవిధంగా గాంధీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పరిశీలన చేసి రోజువారీ బయోమెడికల్ వ్యర్థాలను వేరుగా చేపట్టాలని , పాత సామగ్రిని సత్వరమే తొలగించి ఆసుపత్రి తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మెడికల్ అధికారికి సూచించారు. కాలనీని కలియతిరిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నివాసముంటున్న ప్రజలకు సూచించారు. కాలనీలో ఉన్న రెండు ఖాళీ స్థలాల్లో పిల్లల పార్కులను అభివృద్ధి చేయాలని సికింద్రాబాద్ జోనల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి , హౌసింగ్ ఎండి గౌతమ్ తో కలిసి మారేడుపల్లి అంబేద్కర్ కాలనీలో పేదల ఇళ్లను పరిశీలించి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అలాగే నివాసం ఉంటున్న కుటుంబాలు అక్కడ సమస్యలను కలెక్టర్ వివరించారు. ఈ ప్రాంత అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టే అవకాశాలపై పరిశీలిస్తుందని కలెక్టర్ అన్నారు .కార్యక్రమంలో జిహెచ్ఎంసి సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ మంగతాయారు, కవాడిగూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆర్. పుష్పలత, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన నాయకులు

నారాయణపేట, మార్చి 10 (వుదయం ప్రతినిధి) :

దామరగిద్ద మండల కేంద్రంలో జరిగిన ఉపాధ్యాయురాలు పదవీ విరమణ కార్యక్రమం పాల్గొన్న రాష్ట్ర పాడి,మత్స్య పరిశ్రమ, క్రీడలు యువజన శాఖా మంత్రి వాకిటి శ్రీహరి నీ సోమవారం నారాయణపేట ముదిరాజ్ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ముదిరాజుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ముదిరాజ్ సంఘం నాయకులు మిర్చి వెంకటయ్య,పళ్ళ వెంకట్రాములు, డాక్టర్ కాకర్ల భీమయ్య,గోపాల కృష్ణ తదితరులు ఉన్నారు.



## ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకం

సంగారెడ్డి, మార్చి 10 (వుదయం) :




ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు విజయవంతంగా అమలు చేయడంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12వ తేదీన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంపై మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్‌లకు ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం ద్వారా పాలనపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించబడుతుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక, ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాలు, అలాగే సర్పంచులకు 2018 పంచాయతీ రాజ్ చట్టంపై , మున్సిపల్ కౌన్సిలర్లు మరియు చైర్మన్‌లకు 2019 మున్సిపల్ చట్టం పై, అదే విధంగా వారి విధులు, బాధ్యతలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

## పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

### టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి

సంగారెడ్డి, మార్చి 10 (వుదయం):



సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే మహిళలు ప్రతి రంగంలో అద్భుతాలు సృష్టించగలరని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి అన్నారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల యూనియన్ (టీఎన్జీవోస్) ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, మహిళలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. మహిళలు ఏ రంగంలో ఉన్నా తమ బాధ్యతలను మరువకుండా అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఎదగాలని ఆమె అన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని పేర్కొన్నారు. మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడం, క్యాంటీన్ల నిర్వహణ, యూనిఫామ్ లు కుట్టే బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించడం వంటి పలు చర్యలను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. వచ్చిన అన్ని అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా మరింత ఎదగాలని సూచించారు. అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ, మహిళలు సహనం, పట్టుదలకు ప్రతిరూపాలని అన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ధైర్యంగా ముందుకు సాగుతూ తమ ప్రతిభను చాటుకుంటున్నారని తెలిపారు. కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగ విధులను సమన్వయం చేసుకుంటూ ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మహిళా ఉద్యోగులకు సూచించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగుల కోసం నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి ఈ సందర్భంగా బహుమతులు ప్రదానం చేశారు. అంతకుముందు మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి విజయలక్ష్మి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ, కార్యదర్శి రవి, కోశాధికారి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, శ్రీకాంత్, రాష్ట్ర మహిళా కార్యదర్శి నిర్మలా రాజకుమారి, హెచ్‌డబ్ల్యుఓ రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, పంచాయితీ కార్యదర్శుల రాష్ట్ర అధ్యక్షులు బలరాం, సుధామణి, లక్ష్మి, సుధారాణి, వెంకటేశం, యాదవ్ రెడ్డి, షరీఫ్, జగన్, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE XIth JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT : SECUNDERABAD**
**O.S. No. 91 OF 2026**

**Between:**

1. Gangala Naresh,
2. Gangala Srinivas,
3. Bathula Aruna,
4. Kasha Anitha,

**...Plaintiffs**

**AND**

**1. The Tahsildar / Mandal Revenue Officer,**
Tirumalagiri Mandal, Hyderabad.
**2. All Concerned**

**...Defendant**

To,
All Concerned

Please take notice that the plaintiffs herein filed the above suit against the defendents and All concerned, for declaration of legal heirs. The plaintiffs are only legal heirs / successors of deceased Late. Gangala Laxmi Narayana, expired on 28.06.2025, & Smt. Gangala Balamani, Expired on 16.08.2019. The said suit stands posted to 18-03-2026 for your appearance. If anybody have any objections / claims Should be appear in person or along with Advocate. If you fail to appear before the Hon'ble Court on **18-03-2026 at 10.30 A.M.** the matter will be decided in your absence.

**(BY ORDER OF THE COURT)**

Sd/-
**GILALLA RAMCHANDER,**
**B.Com., LL.M**
**Advocate,**
**#.10-5-779/36, Venkat Nagar,**
**Tukaramgate, Sec-bad-17.**
**Cell.No:.9849974586**

**IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE-CUM- IVJUDICIAL MAGISTARTE OF FIRST CLASS, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT : MEDIPALLY**
**O.S. No. 139 OF 2026**

**Between:**

1. Smt.Muntha Laxmamma,
W/o. Late Muntha Chinna Yadagiri.
2. Sri.Muntha Mallesh,
W/o. Late Muntha Chinna Yadagiri.
3. Smt.Mettu Latha, W/o. Mettu Balraju,
D/o. Late Muntha Chinna Yadagiri.
4. Smt. Vanagnti Mamatha, W/o. Vanaganti Chandra Shekar,
D/o. Late Muntha Chinna Yadagiri.
5. Smt.Gavvala Meena, W/o. Gavvala Krishna Yadav,
D/o. Late Muntha Chinna Yadagiri.

**...Plaintiffs**

**AND**

**The Tahsildar, Ghatkesar Mandal,**
**& All Concerned**

**...Defendant**

The General public is hereby informed that my clients i.e. Smt.Muntha Laxmamma & 4 Others had filed O.S.No. 139 of 2026 before the Hon'ble Court to declare the plaintiffs as legal heirs of deceased Sri.Muntha Chinna Yadagiri, S/o. Late Muntha Narsimha for the purpose of legal Status. The Hon'ble Court ordered notice to the general public inviting objections for the above Suit filed by the Plaintiffs. In case, any person(s) have any claim or interest or objections to the above suit, they shall appear in person or through counsel before the Hon'ble Prl. Junior Civil Judge, MedchalMalkajgiri District, At Medipally, on **05.05.2026 at 10-30 A.M.** failing which the above matter will be decided on merits & any objections received thereafter will not be entertained.

**(BY ORDER OF THE COURT)**

Sd/-
**K.Kondaiah,**
**Advocate,**
**#401, 4th Floor, LPT Market,**
**Chintalkunta, L.B.Nagar,**
**Hyderabad-500074.**
**Cell No. 7207779988**

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు




## నిర్మాణ పనులన్నింటినీ పూర్తి చేశాకే గృహప్రవేశం చేయాలి

**అదనపు కలెక్టర్ ఫణిందర్‌రెడ్డి**
**99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పరిశీలన**

**నారాయణపేట టౌన్, మార్చి 10 (ఉదయం ప్రతినిధి) :** పనులన్నింటినీ పూర్తి చేసి ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫణిందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దామరగిద్ద మండలం దామరగిద్ద గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇల్లు 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పనులను అదనపు కలెక్టరు సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆచరణ ప్రణాళిక గురించి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు అన్ని పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హౌసింగ్ గ్రామపంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ ద్వారానే సత్వర న్యాయం

**కొట్టుకుంటే ఒక్కరే గెలుస్తారు రాజీ పడితే ఇద్దరూ గెలుస్తారు**
**ఎస్పీ డాక్టర్ వినీత్**



**నారాయణపేట టౌన్, మార్చి 10 (ఉదయం ప్రతినిధి) :** వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవితకాలం కొనసాగుతాయి ఒకవేళ ఇంతటితో కలిసుంటామని ఒక నిర్ణయానికి వస్తే అప్పుడే సమసిపోతాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చ్ 28వ తేదీ వరకు నారాయణపేట జిల్లా కోర్టు, కోస్గి కోర్టు, మక్తల్ కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కక్షిదారులకు పోలీసులు అందుబాటులో ఉంటారని ఈ నెల 28వ తేదీ వరకు జాతీయ లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు, చిన్న చిన్న దొంగతనాల కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్ కేసులు, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులో, ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. రాజీ మార్గం రాజమార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని డబ్బులను వృధా చేసుకోవద్దని, న్యాయస్థానం ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్‌లు పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

## జర్నలిస్టులపై దాడి అమానుషం

**టీడబ్ల్యూజేఎఫ్ చేవెళ్ల అధ్యక్షుడు రాజు ఆగ్రహం**
**టీడబ్ల్యూజేఎఫ్ చేవెళ్ల డివిజన్ కమిటీ సంఘీభావం**



**చేవెళ్ల, మార్చి 10 (ఉదయం) :** చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు శివగళ్ల శేఖర్, నాగర్‌గూడ నరేందర్‌లపై జరిగిన దాడిని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ చేవెళ్ల డివిజన్ అధ్యక్షులు చేగూరి రాజు తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిస్టులపై ఇలాంటి దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులపై భౌతిక దాడికి పాల్పడిన నిందితులపై సంబంధిత సెక్షన్ల కింద వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, వారిని రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జర్నలిస్టులు తలుచుకుని పెన్ డౌన్ చేస్తే ప్రభుత్వ యంత్రాంగం స్తంభించిపోతుందని, పాలకులకు ప్రజలకు మధ్య వారధిగా ఉండే వ్యవస్థకు విఘాతం కలిగించడం ఎవరికీ మంచిది కాదని హెచ్చరించారు. దాడికి గురైన జర్నలిస్టులకు సంఘం అండగా ఉంటుందని, నిందితులకు శిక్ష పడే వరకు పోరాడుతామని రాజు స్పష్టం చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ చేవెళ్ల డివిజన్ కమిటీ తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

### ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో

# ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకం

**కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**




**గద్వాల, మార్చి10 (ఉదయం ప్రతినిధి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజుల పాటు దిగ్విజయంగా నిర్వహించేందుకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఎంతో కీలకమైనదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించి ఈ నెల 12వ తేదీన స్థానిక సంస్థల, ఇతర ప్రజాప్రతి నిధులతో నిర్వహించు శిక్షణ కార్యక్రమంపై మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లకు పాలనపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగేందుకు 99 రోజుల ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 12వ తేదీన ప్రజాప్రతినిధులకు నిర్వహించు శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణపై ఇప్పటికే షెడ్యూల్ తయారు చేయడం జరిగిందని, దాని ప్రకారం జూన్ 12వ తేదీ వరకు ఆయా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అన్ని జిల్లాల అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని సిఎస్ పిలుపునిచ్చారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ.. ఈనెల 12న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే ఈ శిక్షణ తరగతుల్లో ఉదయం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పది థీమ్‌లను వివరించడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై తెలియజేస్తామన్నారు. గ్రామస్థాయి నుంచి వివిధ సంక్షేమ పథకాలు పొందుతున్న వారి సంఖ్య, ఇతర వివరాలన్నీ క్రోడీకరించడం జరుగుతుందన్నారు. ఆయా అంశాలను సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమించనున్నట్లు చెప్పారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం కలిసికట్టుగా పనిచేస్తుందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఈనెల 12న ప్రజాప్రతినిధులకు నిర్వహించే శిక్షణా తరగతులను విజయవంతం చేసేందుకు ఆయా శాఖల అధికారులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల కార్యక్రమాన్ని ఆయా షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళిక తయారు చేసినందున దాని ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. శిక్షణ కార్యక్రమానికి రావాల్సిందిగా ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపాలని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాల్సిందిగా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ (రెవెన్యూ), నర్సింగరావు (స్థానిక సంస్థలు), అదనపు ఎస్పి శంకర్, ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జీవితంలో ఎంత ఎదిగిన ఒదిగి ఉండాలి




**నారాయణపేట, మార్చి 10 (ఉదయం ప్రతినిధి) :** జీవితంలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. దామరగిద్ద ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథి గా పాల్గొని విజయలక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మనకు విద్య నేర్పిన గురువులకు ఘనంగా వీడ్కోలు పలికే సంస్కృతి మనదన్నారు. ప్రతీ ఒక్కరూ తల్లిదండ్రులతో సమానంగా గురువులను గౌరవించాలన్నారు. విద్యార్థులను సమాజంలో అత్యున్నత స్థానంలో ఉండేలా తీర్చి దిద్దేది ఒక్క గురువుతోనే సాధ్యమని తెలిపారు. తరగతి గదిలో టీచర్లు పాఠాలు చెప్తున్నప్పుడు శ్రద్ధగా వింటే మీరు ఉత్తమ విద్యార్థులుగా రాణించగలుగుతారని హితబోధ చేశారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ చాలా ముఖ్యమని స్పష్టం చేశారు. తాము ఏదైనా సాధించగలుగుతామన్న సంకల్పం విద్యార్థులకు ఉండాలన్నారు. రాబోయే రోజుల్లో పోటీ ప్రపంచం లో ఎదురయ్యే సవాళ్ళను అధిగమించే శక్తి విద్యార్థులకు రావాలని మంత్రి ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. సమయం చాలా విలువైందని, ఆ సమయాన్ని మనం ఎంత చక్కగా ఉపయోగించుకుంటే అంత జీవితంలో పైకి ఎదగగలుగుతామని మంత్రి వెల్లడించారు. తాను వ్యవస్థను చదివాను కాబట్టే బీద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధిలో నా భూమిక ఉండాలనే తలంపుతో మక్తల్ –నారాయణ పేట– కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. నా ప్రాంతం గురించి చట్ట సభల్లో మాట్లాడి సాధించుకోవాలని అనుకునే వాడినని ఆ భగవంతుడి దయతో, మక్తల్ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా, మంత్రి గా ఇప్పుడు ఆ అవకాశం వచ్చిందని మంత్రి వెల్లడించారు. ఎత్తిపోతల పథకంలో భూమి కోల్పోయిన భూ నిర్వాసితులకు ప్రభుత్వం ఎకరానికి రూ.20లక్షలు ఇచ్చి ఆదుకుందని గుర్తు చేశారు.

ఈ ప్రాంతంలో వ్యవసాయానికి ప్రతీ ఎకరాకు నీళ్ళిచ్చే బాధ్యత తాను తీసుకుంటానని మంత్రి తెలిపారు. గతంలో ఈ ప్రాంతం నుంచి వలసలు పోయి బతికేవారని కానీ ఇప్పుడు ఇక్కడికే బ్రతకడానికి వలసలు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మంత్రితో పాటు భద్రాచలం ఐటిడిఎ కలెక్టర్ రాహుల్, నారాయణపేట ఆర్డిఓ రాంచందర్, డిఈఓ గోవింద రాజులు, దామరగిద్ద సర్పంచ్ కనికిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ను

## విజయవంతం చేయాలి

**కలెక్టర్ బాదావత్ సంతోష్**




**నాగర్ కర్నూల్, మార్చి 10 (ఉదయం ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 99 రోజుల "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"ను అచ్చంపేట మున్సిపాలిటీలో విజయవంతంగా అమలు చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మున్సిపల్ శాఖ అధికారులు ఆదేశించారు. మంగళవారం అచ్చంపేట పట్టణంలోని 3వ వార్డు హిందూ శ్మశాన వాటికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో చేపట్టిన శ్మశానంలో ముళ్లచెట్ల తొలగింపు, పరిశుభ్రత కార్యక్రమాలను నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ పరిశీలించారు. శ్మశాన వాటికలోని ముళ్ల కంప చెట్లను, పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, దహన సంస్కారాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా దారి వసతులను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమైన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జూన్ 12వ తేదీ వరకు ఐదు దశల్లో 99 రోజులపాటు వివిధ శాఖలకు సంబంధించిన పది ముఖ్య అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. మార్చి 6 నుంచి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడి–పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట మున్సిపల్ చైర్మెన్ గార్లపాటి శ్రీనివాసులు, ఆర్డిఓ యాదగిరి, మున్సిపల్ కమిషనర్ మురళి తదితరులు ఉన్నారు.

### ఇసుక అక్రమ రవాణాపై

## కఠిన చర్యలు

**ఇసుక పంపిణీ పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా చేపట్టాలి**
**ప్రతి ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి**
**కలెక్టర్ బాదావత్ సంతోష్**



**నాగర్ కర్నూల్, మార్చి 10 (ఉదయం ప్రతినిధి) :** జిల్లాలో ప్రజల అవసరాలు మరియు ప్రభుత్వ పనుల కోసం అవసరమైన ఇసుకను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తు చేసుకుని పొందే విధంగా చర్యలు చేపట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ప్రజల అవసరాలకు, అలాగే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను కూడా ఆన్‌లైన్ ద్వారానే పంపిణీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇసుక పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ అవసరాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే ట్రాక్టర్ యాజమాన్యాలు తమ వాహనాలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకుంటే వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జీపీఎస్ కలిగి మైనింగ్ శాఖ వద్ద రిజిస్టర్ అయిన వాహనాల ద్వారానే ఇసుక రవాణాకు అనుమతించాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న 18 ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పోలీసు, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు పర్యవేక్షణలో ఉండేలా చూడాలని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే లోడింగ్ నిర్వహించాలని సూచించారు. అక్రమంగా ఇసుక తరలించే వాహనాలు పట్టుబడితే రూ.20 వేల వరకు జరిమానా విధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మరిన్ని ఇసుక రీచ్‌లు ప్రారంభించేందుకు తహసీల్దార్లు ఆన్‌లైన్ ద్వారా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సమావేశంలో జిల్లా మైనింగ్ అధికారి వెంకటరమణ, కలెక్టరేట్ సి సెక్షన్ తహసీల్దార్ రవికుమార్, వంగూర్, ఉప్పునుంతల, కల్వకుర్తి తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## వ్యసనాల నుంచి విద్యార్థులను యువతను కాపాడాలి

**కలెక్టర్ కుష్బూ గుప్తా**



**మహబూబ్ నగర్ మార్చి 10(ఉదయం ప్రతినిధి):** జిల్లాలో మత్తు పదార్థాలు, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టి,డ్రగ్స్ మత్తు పదార్థాల వ్యసనాల నుంచి విద్యార్థులు, యువతను కాపాడేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పోలీసు, విద్య, ఎక్సైజ్, మహిళా శిశు సంక్షేమ, డ్రగ్ కంట్రోల్, వైద్య ఆరోగ్య, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మత్తు పదార్థాల దుర్వినియోగాన్ని నియంత్రించేందుకు శాఖల వారీగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఆమె సూచించారు. ప్రత్యేకంగా విద్య, వైద్యం, పోలీసు, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని ప్రతి నెల కనీసం ఐదు పాఠశాలల్లో మత్తు పదార్థాల వ్యసనం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, పోలీసు శాఖ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ అందించి అవసరమైతే పునరావాస కేంద్రాలకు పంపాలని సూచించారు.ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ అధికారులు జనవరి–ఫిబ్రవరి నెలల్లో 375 గ్రాముల గంజాయి, 325 గ్రాముల ఆల్ఫాజోల్ మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి మూడు కేసులు నమోదు చేసి చేసినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే 2025 సంవత్సరంలో మత్తు పదార్థాల అక్రమ రవాణాకు సంబంధించి మొత్తం 41 మందిపై 21 కేసులు నమోదు చేసి 8.976 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు. గంజాయి సహా ఇతర హానికర మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు వాహనాల తనిఖీలు, నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. విద్యా శాఖ అధికారులతో మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.
మత్తు పదార్థాల వ్యసనానికి వ్యతిరేకంగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమగ్ర కార్యాచరణ రూపొందించి ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ, మండల, జిల్లా స్థాయిల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలో ఎక్కడైనా గంజాయి మొక్కల అక్రమ పెంపకం గుర్తించారా అని కలెక్టర్ ప్రశ్నించగా, ఎక్సైజ్ అధికారులు స్పందిస్తూ 2023 సంవత్సరంలో ఒకటి లేదా రెండు కేసులు గుర్తించామని, అయితే గత రెండు సంవత్సరాలుగా జిల్లాలో గంజాయి మొక్కల అక్రమ పెంపకం జరిగిన కేసులు నమోదు కాలేదని తెలిపారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు దీనిపై అవగాహన కల్పించాలని, ఎవరైనా గంజాయి మొక్కలను అక్రమంగా పెంచితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రైతులకు తెలియజేయాలని సూచించారు. విద్యా శాఖ అధికారులు పాఠశాలల్లో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. ప్రతి పాఠశాలలో 6 నుండి 9వ తరగతి విద్యార్థుల కోసం "ప్రహరీ" క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి వారి ద్వారా పాఠశాలలో మత్తు పదార్థాల వ్యసనం మరియు దాని దుష్ప్రభావాలపై ఇతర విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, డి.సి.ఆర్.బి డి.ఎస్.పి రమణారెడ్డి, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్, సీఎంఓ సుధాకర్ రెడ్డి, వైద్య కళాశాల,వివిధ జూనియర్,డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ లు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను బాధ్యతగా చూసుకోవాలి

**• వృద్ధుల సంక్షేమ చట్టాలపై అవగాహన కల్పించాలి • అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్**



**వనపర్తి, మార్చి10(ఉదయం) :** వృద్ధుల సంక్షేమ చట్టాలపై సమాజంలో అవగాహన కల్పించి, వృద్ధులకు తగిన న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యానాయక్ తెలిపారు. మంగళవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సీనియర్ సిటిజన్స్ జిల్లా స్థాయి కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సీనియర్ సిటిజన్స్ సమస్యలపై కమిటీ సభ్యులతో చర్చించారు. సీనియర్ సిటిజన్స్ కమిటీ సభ్యులు సమాజంలో వృద్ధులు కుటుంబ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై పలు కీలక సూచనలను చేశారు. సమాజంలో వృద్ధులైన తల్లిదండ్రులను పిల్లలు పట్టించుకునే విధంగా సంరక్షించుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ సభ్యులు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల బాధ్యత పిల్లలపై ఉందన్నారు. జిల్లాలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిటీ సభ్యులు తమ దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. ప్రభుత్వం తరపున అట్టి సంవత్సరం పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. వృద్ధుల సమస్యలపై ఇప్పటి వరకు 127 ఫిర్యాదులు రాగా వాటిలో 65 పరిష్కరించామన్నారు, మిగిలిన ఫిర్యాదులు పలు దశల్లో ఉన్నాయన్నారు. వృద్ధుల కోసం జిల్లాలో డే కేర్ సెంటర్ ను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యుల సూచన మేరకు సమాజంలో వృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదేనని తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కళాజాత బృందాల ద్వారా, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా సీనియర్ సిటిజన్స్ సంరక్షణ చట్టంపై గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారికి సూచించారు. సమావేశంలో డిఎస్పి బాలాజీ నాయక్, డిఎంహెచ్వో సాయినాథ్ రెడ్డి, డిడబ్ల్యుఓ సుధారాణి, ఆర్డీఏ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్, సీనియర్ సిటిజన్స్ కమిటీ సభ్యులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి




**మహబూబ్ నగర్ మార్చి 10(వుదయం ప్రతినిధి) :** రైతు సంక్షేమమే ధేయ్యంగా ప్రభుత్వం పని చేస్తుందనిదేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు.మంగళవారం దేవర కద్ర నియోజక వర్గం లో భూత్పూర్ రైతు వేదిక వద్ద ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భూత్పూర్, అడ్డాకుల, మూసాపేట్ మండలాల రైతులకు స్పింక్లర్స్, భూత్పూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన రైతులకు హార్టి కల్చర్ ఇక్విమెంట్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట మేరకు రైతులకు ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని, రైతులకు వరి ధాన్యంపై 500 బోనాస్ ఇస్తున్నామని, అదే విధంగా గత ప్రభుత్వం నిలిపివేసిన వ్యవసాయ యాంత్రికరణ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించిందని, పంట బీమా పథకాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తివేస్తే, పంటల బీమా పథకాన్ని సైతం పునరుద్ధరించి,ముఖ్య మంత్రి రైతాంగానికి అండగా నిలిచారని అన్నారు.రైతు బంధు నెపంతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చే అన్ని సబ్సిడీలను ఎత్తివేసిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు పనిముట్లు, స్పింక్లర్స్ ఇస్తున్నామని, రైతులకు అన్ని విధాలుగా తోడ్పాటుగా నిలుస్తున్నామన్నారు. నిరంతరం రైతుల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి రైతులు అండగా నిలబడి ఆశీర్వదించాలని ఈ సందర్భంగా కోరారు.ఉద్యాన శాఖ డి.డి.వేణు గోపాల్ మాట్లాడుతూ ప్రజా పాలనా – ప్రగతి ప్రణాళిక లో భాగంగా రైతులకు మైక్రో ఇరిగేషన్ పథకంలో భాగంగా స్ప్రింక్లర్ సెట్లు 86 మంది రైతులకు సబ్సిడీ పై అందచేశారు. వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం లో రైతులకు ప్లాస్టిక్ క్రెట్స్ (టమాటా బాక్సులు ), వర్మి కంపోస్ట్ తయారు చేసుకొనే బెడ్లను కూడా ఆయన రైతులకు పంపిణి చేసారు. రైతులతో వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం పై సుదీర్ఘ చర్చ చేశారు. కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి మురళి,స్థానిక ప్రజా ప్రతి నిధులు పాల్గొన్నారు.

**రాష్ట్ర అభివృద్ధికి ప్రగతికి ప్రజా ప్రభుత్వం కృషి ..**

భూత్పూర్ మునిసిపాలిటి లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రహదారులు క్లీన్ చేయడం, డ్రైన్‌లు పూడిక తీసి క్లీన్ చేయడం కార్యక్రమంలో మంగళవారం దేవర కద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌గా 5 దశల్లో 5 ప్రత్యేక కార్యక్రమాలు 99 రోజులు జరుగుతాయని తెలిపారు.ఏప్రిల్ 2 గ్రామసభలు, గ్రామస్థాయి కార్యక్రమాలు ఏప్రిల్ 16 మండల స్థాయి కార్యక్రమాలు మే 2 నియోజకవర్గస్థాయి కార్యక్రమాలు మే 22 జిల్లాస్థాయి కార్యక్రమాలు జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ ప్రత్యేక కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పరిశుభ్రత, ఆరోగ్యం, యువత, క్రీడలు విద్య ,పిల్లల భద్రత, డ్రగ్స్ కు అడ్డుకట్ట, రైతు సంక్షేమం, వ్యవసాయం, మహిళలు ,పర్యావరణం వంటి కీలక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ప్రగతి వైపు అడుగులు వేస్తుందని అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, శానిటేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కాలనీలు, వీధులు పరిశుభ్రంగా ఉండేలా మున్సిపల్ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయాలని, ప్రతి పౌరుడు కూడా పరిశుభ్రతను కాపాడటంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

## మహిళ భద్రతపై అవగాహన కార్యక్రమం




**చేవెళ్ల, మార్చి10(వుదయం) :** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో మహిళలపై జరుగుతున్న వేధింపులు, దుర్వినియోగం, మహిళా భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం మంగళవారం చేవెళ్ల ప్రభుత్వ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ఉమెన్ ఎంప్లాయిమెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మహిళా సాధికారత సెల్ కన్వీనర్ కవిత ప్రధానంగా వ్యవహరించారు. కార్యక్రమంలో మహిళలపై జరిగే వివిధ రకాల వేధింపులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టపరమైన హక్కులు, మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాల్సిన విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల మహిళా అధ్యాపకులు పాల్గొని విద్యార్థులతో పరస్పర చర్చలు జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు స్వీయ రక్షణ పద్ధతులు, మహిళల గౌరవాన్ని కాపాడుకోవడం, సమస్యలు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్య సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.సి. కాంచనలత మాట్లాడుతూ.. మహిళల భద్రత, సాధికారత సమాజ అభివృద్ధికి అత్యంత అవసరమని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్



**నారాయణఖేడ్, మార్చి 10 (వుదయం) :** నారాయణఖేడ్ పట్టణంలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను సబ్ కలెక్టర్ ఉమా హారతి సందర్శించి విద్యార్థులు రాస్తున్న పరీక్షలను పర్యవేక్షించారు. మంగళవారం నారాయణ ఖేడ్ పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని సబ్ కలెక్టర్ ఉమా హారతి పర్యవేక్షించారు. ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.




## పాడి రైతుల సంక్షేమానికి కృషి

### కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల మార్చి 10 (వుదయం ప్రతినిధి) :** పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని అందులో భాగంగానే గేదెల కొనుగోలుకు సహకారం అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యం లో పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టిన మినీ డెయిరీ పథకానికి ఎంపికైన 44 మంది రైతులు గేదెలు కొనుగోలు చేసేందుకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి వెళుతున్న సందర్భంగా మంగళవారం ఐడిఓసి ఆవరణలో వాహనాన్ని జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు గేదెల కొనుగోలుకు రూ.2 లక్షలకు గాను 60 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని, మిగిలిన 40 శాతం బ్యాంకు లోన్ పొందుతారన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య సమీపంలో మంచి పాల ఉత్పత్తిని ఇచ్చే గేదెలు ఉండడంతో పాడి రైతులను అక్కడికి పంపిస్తున్నట్లు తెలిపారు. గేదెల కొనుగోలుకు సంబంధిత శాఖల పలువురు అధికారులు కూడా రైతుల వెంట అక్కడికి వెళ్లి సహకరిస్తారన్నారు. రైతులు కొనుగోలు చేసిన గేదెలు జాగ్రత్తగా వారి ఇంటికి చేరేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని నుషిత, పశుసంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలందించాలి

### కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల, మార్చి 10 (వుదయం ప్రతినిధి) :** ప్రజల నుంచి వచ్చే ఆర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వారికి మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, (ఎస్ఎస్ఆర్) భూ భారతి దరఖాస్తులు, సర్టిఫికెట్ల జారీ, జనాభా గణన, ఇందిరమ్మ ఇండ్లు, తదితర అంశాల పురోగతిపై అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ సేవలను ప్రజలకు వేగంగా, పారదర్శకంగా అందించేలా తహసీల్దార్లు సమర్థవంతంగా పని చేయాలన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వేగవంతం చేసి కనీసం 85% పురోగతి సాధించాలన్నారు. ఫార్మ్ 6,7,8లోని అన్ని దరఖాస్తులను పూర్తి చేయాలని ఆదేశించారు. భూభారతి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను వేగవంతం చేయాలన్నారు. మంజూరీలు పొందిన వారందరూ తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ, క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. కుల, ఆదాయ, ఎఫ్ –లైన్ పిటిషన్‌లు, ఇతర ధ్రువీకరణ పత్రాల పెండింగ్ దరఖాస్తులను వెంటనే పూర్తిచేయాలని తహసీల్దార్లకు ఆదేశించారు. సర్వేయర్ల నుండి వచ్చే ఫిర్యాదుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున, సర్వేయర్లు తమ పనిని సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. తహసీల్దార్లు సర్వేయర్ల పనిని సమగ్రంగా పర్యవేక్షించాలన్నారు. జనాభా గణన–2027 పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ఎంపీడీఓలు, తహసీల్దార్లు కృషి చేయాలన్నారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజల వినతులు స్వీకరించి పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలు జిల్లా ప్రజావాణికి రాకుండా మండల స్థాయిలోనే సమస్యలను పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఈనెల 12న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తహసీల్దార్లు, ఎంపీడీఓలు పూర్తి బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రూపొందించిన 99 రోజుల కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం అమలు చేయాలని, ప్రజాప్రతినిధులకు ముందుగానే ఆహ్వానాలు పంపించి వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ శ్రీనివాస రావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఒలు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నివాస ప్రాంతాల మధ్య డంప్ యార్డ్ తొలగించాలి

### సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి

అమీన్‌పూర్, మార్చి 10 (వుదయం) : అమీన్‌పూర్ ప్రాంతంలోని నివాస కాలనీల మధ్యలో ఉన్న డంప్ యార్డ్‌ను వెంటనే తొలగించాలని అమీన్‌పూర్ పీపుల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమల రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. నివాస ప్రాంతాల మధ్యలో డంప్ యార్డ్ ఉండటం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చెత్త కుప్పల కారణంగా దుర్వాసన, కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. అందువల్ల ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే డంప్ యార్డ్‌ను అక్కడి నుంచి తరలించి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మోడి బిల్డర్స్‌కు చెందిన రమేష్, నాగరాజు, టైలర్స్ కాలనీకి చెందిన అరుణ్‌తో పాటు ఇతర స్థానిక నివాసితులు పాల్గొన్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

## ప్రగతి ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలి

**మార్చి 12న గ్రామ పట్టణ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలి...**

**జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సిఎస్ రామకృష్ణా రావు**




**జగిత్యాల మార్చి 10 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిఎస్ రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ఇందులో పంచాయతీరాజ్ శాఖ ప్రధాన కార్యదర్శి ఆర్థిక ప్రణాళిక శాఖ కార్యదర్శి పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మున్సిపల్ పట్టణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ లు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు జగిత్యాల ఐడిఓసి నుండి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు ఈ సందర్భంగా ప్రభుత్వ సిఎస్ రామకృష్ణ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను మార్చి 06 తేది నుండి జూన్ 12వ తేది వరకు సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పని చేసి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని తెలిపారు మొదటగా మార్చి 06వ తేదీ మార్చి 12వ తేదీ వరకు ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు ఫైళ్ల క్లియరెన్స్‌పై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు గ్రామాలు పట్టణాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచడం పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించడం ద్వారా పరిపాలనలో పారదర్శకత పెరుగుతుందని ఈ కార్యక్రమాన్ని ఇదే స్ఫూర్తితో కొనసాగించాలని పేర్కొన్నారు అలాగే మార్చి 12వ తేదీన పట్టణ గ్రామ స్థానిక సంస్థలకు ఎన్నికైన కార్పొరేషన్ చైర్మన్లు కార్పొరేటర్లు మున్సిపల్ చైర్మన్లు కౌన్సిలర్లు సర్పంచ్ లు జిల్లా స్థాయిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు ఈ శిక్షణ ద్వారా పట్టణ గ్రామ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు చట్టాలు విధులు బాధ్యతలు అలాగే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు విధానం గురించి అవగాహన కల్పించాలని తెలిపారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా స్థానిక సంస్థల ప్రతినిధుల చురుకైన భాగస్వామ్యం అవసరమని కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఇప్పటికే శిక్షణ కార్యక్రమం ఇచ్చామని ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా అభివృద్ధి పనులకు పట్టణ గ్రామ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు చట్టాల పైన పరిపాలన పైన మంచి అనుభవం బలమైన పునాది పడుతుందని తద్వారా వచ్చే ఐదు సంవత్సరాలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసే అవకాశం దొరుకుతుందన్నారు అదే విధంగా 10 ప్రధాన అంశాల కింద వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు తెలిపారు ప్రతి శాఖకు స్పష్టమైన లక్ష్యాలను నిర్ణయించి వాటిని నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు.ఈ 10 అంశాలకు సంబంధించి పూర్తి స్థాయిలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించి ఇవి పూర్తి స్థాయిలో పకడ్బందీగా అమలు అయ్యేలా అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి మంత్రి వివిధ స్థాయిల ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని అలాగే శిక్షణ జరిగే చోట అన్ని రకాల మౌలిక సదుపాయాలు భోజన వసతి త్రాగు నీటి సౌకర్యం కల్పించాలని వివిధ రంగాల్లో నిపుణులను టిఓటిలను సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్లను కోరారు శిక్షణలో భాగంగా పంచాయతీరాజ్ పట్టణాభివృద్ధి విద్య వైద్యం ఆరోగ్యం పర్యావరణం వంటి పది అంశాల పైన అలాగే స్థానికంగా ఎదుర్కొనే అంశాల పైన పూర్తి స్థాయిలో ఈ శిక్షణ కార్యక్రమంలో వివరించాలని సూచించారు ప్రతి గ్రామంలో పట్టణాల్లో సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు ప్రజా ప్రతినిధులు అధికారులు కలిసి పని చేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని పేర్కొన్నారు పట్టణాలకు గ్రామాలకు వచ్చే నిధులను నియమ నిబంధనల మేరకు చట్టంలో పేర్కొన్న అంశాల మేరకు ఖర్చు చేయాలని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు ఈ సందర్భంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గురించి శిక్షణ కార్యక్రమం ఏర్పాట్ల గురించి వివిధ జిల్లాల కలెక్టర్లను సిఎస్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు జగిత్యాల జిల్లాలో 385 గ్రామపంచాయతీలు 5 మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికైన ప్రజాప్రతినిధులకు మార్చి 12వ తేదీన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు ఈ శిక్షణ కార్యక్రమం రెండు సెషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు ఇందులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజా ప్రతినిధుల విధులు బాధ్యతలు నిధుల ఖర్చు స్థానిక అంశాల పైన పూర్తి స్థాయిలో శిక్షణ కార్యక్రమంలో చర్చించనున్నట్లు తెలిపారు ఈ శిక్షణ కార్యక్రమం సంబంధించి పిపిటి భోజన వసతి త్రాగునీటి సౌకర్యం టీఓటిలు వంటివి సిద్ధం చేశామని తెలిపారు సంబంధిత అధికారులు ఈ శిక్షణ కార్యక్రమానికి అందుబాటులో ఉంటారని జిల్లాలో శిక్షణా కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పి సిఈవో గౌతమ్ రెడ్డి డిపిఆర్ఓ నరేష్ సిపిఓ సత్యం డిపిఓ మదన్మోహన్ కలెక్టరేట్ ఏవో హకీమ్ తదితరులు పాల్గొన్నారు.






# మహబూబ్‌నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## శ్రీలక్ష్మీ నృసింహుని హుండీ లెక్కింపు

**ధర్మపురి మార్చి 10(వుదయం ప్రతినిధి):**

ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానం ఆవరణలో మంగళవారం గడిచిన 58 రోజులకు సంబంధించిన హుండీలను లెక్కించారు. మొత్తం లెక్కించగా 51లక్షల20 వేల 748 రూ ఆదాయం వచ్చిందని, మిశ్రమ బంగారం 30గ్రా, మిశ్రమ వెండి 4 కిలోల 100 గ్రా,విదేశీ నోట్లు17 వచ్చాయని ఈఓ సంకటాల శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్ర మంలో దేవాదా యశాఖ కరీంనగర్ సహాయ కమిషనర్ నాయిని. సుప్రియ,సూపరిండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అల్వాల్. శ్రీనివాస్,ధర్మకర్తల మండలి సభ్యులు, తిరుమల సేవా గ్రూప్ ఇంచార్జి రవీందర్, సభ్యులు,కరీంనగర్ శ్రీవల్లి గ్రూప్,పెద్దపల్లి మమత రెడ్డి గ్రూప్, కరీంనగర్, ధర్మపురి,లక్షెట్టి పేట్ సేవకులు, ఇతరులు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్, సిబ్బంది, పోలీస్ సిబ్బంది,దేవస్థానం అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు

## మిలీనియం మార్చ్ విజయవంతం

**కరీంనగర్, మార్చి 10 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ ఉద్యమకారుల జేఏసీఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ గన్ పార్క్ వద్ద నిర్వహించిన మిలీనియం మార్చ్ విజయవంతం అయినట్లు ఆ సంఘం చైర్మన్ వెంకట మల్లయ్య, కరీంనగర్ నగర అధ్యక్షుడు గోడిశల రమేష్‌లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాది మంది ఉద్యమకారులు పాల్గొనడం జరిగిందని పేర్కొన్నారు.గన్ పార్కు తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించడం జరిగినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరాం, విమలక్క, అద్దంకి దయాకర్, చీమ శ్రీనివాస్, ప్రఫుల్ రాంరెడ్డి,తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉత్తర తెలంగాణ అధ్యక్షులు ఐల ప్రసన్న , కరీంనగర్ జిల్లా ప్రచార కార్యదర్శి వొడ్నాల రాజు,మంద వెంకన్న,నర్సింగోజు సాగర్, తోట రాకేష్,చిందం రాజేశం, బూర్ల ప్రకాష్, వాసం సత్యనారాయణ, బండ గోపాల్ రెడ్డి, గాజర్ల పెంటయ్య, లింగంపల్లి సత్యనారాయణ, పల్లె మురళి, పెద్దపల్లి మధుసూదన్, తోట రాకేష్, ఐల ప్రసన్న, కళ్యాణపు రేఖ, తిరుమల్ రెడ్డి, రాధ, సరస్వతి,రోజా,ఇరుముల్ల మల్లేశం, ఆసియా సుల్తానా,అలువాల రాజు,రాజేంద్ర ప్రసాద్ మహిళా ఉద్యమ కారులు 300 మంది పాల్గొన్నట్లు తెలిపారు.

## ఉద్యోగ అవకాశాలకై మూడు నెలల శిక్షణ

**పెద్దపల్లి , మార్చి 10 (వుదయం ప్రతినిధి)**

కరీంనగర్ లోని డాక్టర్. రెడ్డీస్ ఫౌండేషన్ లో ఉద్యోగ అవకాశాలకై ఉచిత భోజన వసతితో కూడిన 3నెలల శిక్షణ, వెంటనే ఉపాధి కల్పించుటకు మార్చి 13 జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వై.తిరుపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని నిరుద్యోగ యువతి యువకులకు కరీంనగర్ లోని డాక్టర్. రెడ్డీస్ ఫౌండేషన్ లో ఉద్యోగ అవకాశాలకై ఉచిత భోజన వసతితో కుడినా 3 నెలల శిక్షణతో ఉపాధి అవకాశాలూ, సోలార్ ప్యానెల్స్ ఇన్స్టలేషన్ ,ఇంగ్లీష్ కమ్యూనికేషన్ సాఫ్ట్ స్కిల్ కంప్యూటర్, ఇంటర్వ్యూ, స్కిల్ శిక్షణ కల్పిస్తున్నామని అన్నారు.డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సంస్థలో 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి డిప్లమా, బిటెక్, ఎలక్ట్రికల్ మెకానికల్ ఆపై విద్యార్హత సాధించిన వారు అర్హులని ,వయస్సు 18 సంవత్సరాలు నుండి 28 సంవత్సరాల లోపు ఉండాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు మార్చి 13న ఉదయం 11 గంటల కు సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో రూమ్ నెంబర్ 233 నూతన కలెక్టర్ భవన సముదాయంలో, పెద్దకాల్వల పెద్దపల్లి మొదటి అంతస్థులో వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 ఫోన్ నెంబర్ లో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు

## ఆర్ఎఫ్‌సీఎల్ రామగుండంపై కేంద్రం నిర్లక్ష్యం

**పెద్దపల్లి మార్చి 10 (వుదయం ప్రతినిధి)**



పెద్దపల్లి నియోజకవర్గంలోని ఆర్ఎఫ్‌సీఎల్ రామగుండం సంస్థను సరైన నిర్వహణ లేకుండా నడుపుతున్నారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థలో జరుగుతున్న మిస్ మేనేజ్మెంట్, నిర్లక్ష్యంపై కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా గారికి పలుమార్లు లేఖలు రాసినట్లు తెలిపారు. వ్యక్తిగతంగా కూడా కలసి సమస్యలను వివరించినప్పటికీ సరైన స్పందన రాలేదని అన్నారు. ప్రస్తుతం ఆర్ఎఫ్‌సీఎల్ రామగుండం సంస్థలో ఉత్పత్తి సామర్థ్యం పూర్తిగా వినియోగించుకోవడం లేదని, కేవలం సుమారు 70 శాతం మాత్రమే ప్రొడక్షన్ కొనసాగుతోందని పేర్కొన్నారు. సంస్థ హెడ్ ఆఫీస్ ప్రస్తుతం ఢిల్లీలో ఉండటం వల్ల ఇక్కడి సమస్యలపై తగిన శ్రద్ధ లేకపోతుందని, అందువల్ల హెడ్ ఆఫీస్‌ను హైదరాబాద్‌కు మార్చాలని కూడా పలుమార్లు లేఖలు, విజ్ఞప్తులు చేసినట్లు తెలిపారు.అయితే కేంద్ర ప్రభుత్వం దీనిపై సానుకూలంగా స్పందించలేదని, హెడ్ ఆఫీస్‌ను మార్చే అవకాశం లేదని అధికారికంగా లేఖ ద్వారా తెలియజేసినట్లు చెప్పారు. ఈ నిర్ణయం వల్ల సంస్థ నిర్వహణపై మరింత ప్రభావం పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.గతంలో మూతపడిన ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థను తిరిగి ప్రారంభించేందుకు మాజీ కేంద్ర మంత్రి జి. వెంకటస్వామి గారు, కాకా గారు కలిసి అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ గారితో చర్చలు జరిపి కృషి చేశారని గుర్తు చేశారు. అనంతరం వివేక్ గారు ఎంపీగా ఉన్న సమయంలో కూడా ఎంతో శ్రమించి సంస్థను మళ్లీ ప్రొడక్షన్‌లోకి తీసుకువచ్చారని తెలిపారు. ఈ సంస్థ ద్వారా అనేక మంది స్థానిక యువతకు ఉపాధి లభించిందని చెప్పారు.రామగుండం ఆర్ఎఫ్‌సీఎల్ ద్వారా తెలంగాణకు యూరియా సరఫరా జరగడంతో పాటు, దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఎరువులు పంపిణీ అయ్యే విధంగా వ్యవస్థ పనిచేసిందని వివరించారు. అయితే ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వంలో యూరియా నిర్వహణలో గందరగోళం నెలకొన్నదని, సరైన విధంగా ఇంపోర్టులు చేయకపోవడం, ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ఈ పరిస్థితి తెలంగాణ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోందని, దీనిపై నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

# తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

### రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**ఎల్కతుర్తి, మార్చి 10 (వుదయం ప్రతినిధి):**



గ్రామాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంపై మండల స్థాయి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మిషన్ భగీరథ, విద్య, వైద్య ఆరోగ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి, పోలీస్, రవాణా తదితర శాఖల అధికారులతో మంత్రి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల ద్వారా ఇప్పటికే చేపట్టిన కార్యక్రమాలు, కొనసాగుతున్న పనుల పురోగతిపై అధికారులు వివరాలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పాలన అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. పది ముఖ్య అంశాలతో రూపొందించిన ఈ కార్యక్రమం మార్చి 6 నుండి జూన్ 12 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.గ్రామాల్లో తాగునీటి సమస్యలను ముందుగానే గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రాలలో కాకతీయ మెడికల్ కళాశాల, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో అవసరమైన ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.అదేవిధంగా 2026-27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరగాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో చదువు మానేసిన విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని అధికారులకు ఆదేశించారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో విద్య ద్వారానే వ్యక్తి ఉన్నత స్థాయికి చేరుకోగలడని తేలిందని పేర్కొన్నారు. విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ సంఖ్యలో చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లోని విద్యార్థులందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వాటిని మరింత బలోపేతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.జిల్లాలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు చెందిన డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేయాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. త్వరలో సర్పంచులు, ఉపసర్పంచులకు హెల్మెట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి కోరారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు 99 రోజులపాటు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఎస్ఈ చలమారెడ్డి, డీఈ గాయత్రి, డీఈవో గిరిరాజ్ గౌడ్, డీఆర్‌డీఓ మేన శ్రీను, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, రవాణా శాఖ డిటిసి సురేష్ రెడ్డి, కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి తదితరులు, వివిధ గ్రామాల సర్పంచులు తమ అభిప్రాయాలు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రసాద రావు, ఎంపీడీవో విజయ్ కుమార్, పాలక మండలి చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఎల్కతుర్తిలో జెండర్ రిసోర్స్ భవనం ప్రారంభంఅనంతరం ఎల్కతుర్తిలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన జెండర్ రిసోర్స్ భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని, ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని అన్నారు. పర్యావరణానికి ముప్పుగా మారుతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించే ఉద్దేశంతో మహిళా సంఘాల ద్వారా స్టీల్ బ్యాంకులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు .ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, ఇతర అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాల్వ శ్రీరాంపూర్ కే.జి.బి.వీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





**కాల్వ శ్రీరాంపూర్, మార్చి 10 (వుదయం ప్రతినిధి)**

విద్యార్థినులకు మంచి పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కాల్వ శ్రీరాంపూర్ మండలంలో కే.జి.బి.వీ ను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థినులతో కలిసి భోజనం చేసారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, కేజీబీవీ లోని తరగతి గదులు, డైనింగ్ హాల్ , కిచెన్ ఏరియా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, ఇతర సౌకర్యాల గురించి ఆరా తీశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా కేజీబీవీ పరిసరాలను క్లీన్ చేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థినులకు అందించే ఆహారం పట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వ మార్గ దర్శకాల ప్రకారం అవసరమైన మేర పోషకాలు వచ్చే విధంగా చూడాలని అన్నారు. అంతకు ముందు ఓదెల మండలం కొలనూరు గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా అమలు చేస్తున్న పారిశుధ్య పనులు, ఫైల్ క్లియరెన్స్ అంశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు భారీగా తరలిన తెలంగాణ ఉద్యమకారులు

**పెద్దపల్లి మార్చి 10 (వుదయం ప్రతినిధి)**

పెద్దపల్లి జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు మంగళవారం హైదరాబాద్‌లో గన్ పార్క్ వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యమం మిలియన్ మార్చ్ కార్యక్రమానికి భారీ ఎత్తున తరలివెళ్లారు. రాష్ట్ర కన్వీనర్ మరియు జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఉద్యమకారులు సుల్తానాబాద్ నుండి బయలుదేరారు.ఈ సందర్భంగా ముందుగా పెద్దపల్లి పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించి, కొబ్బరికాయ కొట్టి బస్సును ప్రారంభించారు. అనంతరం "జై తెలంగాణ - తెలంగాణ అమరవీరులకు జోహార్" అంటూ నినాదాలు చేస్తూ హైదరాబాద్‌కు బయలుదేరారు.ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దాదాపు 13 సంవత్సరాల పాటు నిరంతరంగా పోరాటం చేశామని తెలిపారు. రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు మారుతాయని నమ్మకంతో ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఉద్యమాన్ని ముందుకు నడిపామని అన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు దొబ్బడ చంద్రకళ, నూనె రాజేశం, బింగి రాజు, మంతిని విజయ్ కుమార్, గోగుల రాజిరెడ్డి, చర్లపల్లి సురేష్ గౌడ్, ఆల శ్రీనివాస్ రెడ్డి, లలితా ఠాగూర్, కందుల అశోక్ పటేల్, జనగామ రవి, గుజ్జుల పద్మ, జ్యోతి ఠాగూర్, మద్దెల సంజీవ్, కట్ల ప్రతాప్, గోవిందుల ఎల్లస్వామి, గుర్రాల వీరేశం, పంగ రవి తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్

**కరీంనగర్, మార్చి 10, (వుదయం ప్రతినిధి):**

జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను మంగళవారం కలెక్టర్ చిత్ర మిశ్రా రాజకీయ పార్టీ ప్రతినిధిలతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్ధేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎంల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ ఫుటేజ్ పనితీరు, గదుల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ లక్ష్మి కిరణ్, ఆర్డీవో కె. మహేశ్వర్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేనీ శ్రీనివాస్, బిజెపి పార్టీ ప్రతినిధి దేవిశెట్టి నవీన్ కుమార్, టిడిపి పార్టీ ప్రతినిధి ఎర్రవెల్లి రవీందర్ బీఎస్పీ పార్టీ ప్రతినిధి సిరిసిల్ల అంజయ్య ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.



# ప్రజలకు మెరుగైన సేవలే ప్రభుత్వ లక్ష్యం : కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**కాల్వ శ్రీరాం పూర్, మార్చి 10 (వుదయం ప్రతినిధి)**

నూతనంగా ప్రారంభించిన మండల రెవెన్యూ అధికారి కార్యాలయం ద్వారా మండల ప్రజలకు మెరుగైన సేవలు వేగవంతంగా అందాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కాల్వ శ్రీరాంపూర్ మండలంలో 75 లక్షల రూపాయల గ్రాంట్ నిధులతో నూతనంగా నిర్మించిన మండల రెవెన్యూ అధికారి కార్యాలయాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, అదనపు కలెక్టర్ డి.వేణు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షమాట్లాడుతూ కాల్వ శ్రీరాంపూర్ మండలంలో ఎం.ఆర్.ఓ కార్యాలయ నిర్మాణం చాలా రోజులుగా పెండింగ్ లో ఉందని, 75 లక్షల రూపాయలతో అన్ని వసతులతో కూడిన నూతన తహసిల్దార్ కార్యాలయాన్ని నిర్మించుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. నూతన కార్యాలయం నుంచి ప్రజలకు మెరుగైన సేవలు అందాలని, వారి సమస్యలు సత్వరపు పరిష్కారం అయ్యే దిశగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ గ్రామాలను క్లస్టర్ గా విభజించి ప్రతి క్లస్టర్ కు గ్రామ పరిపాలన అధికారి నియమించామని తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత డిస్పోజ్ చేయాల్సి ఉంటుందని , ప్రతి దరఖాస్తు వీలైనంత త్వరగా పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. *పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ, ప్రజలకు సేవలు అందించే రెవెన్యూ శాఖకు మండలంలో మంచి కార్యాలయం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేస్తున్నట్లు తెలిపారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించామని, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షల పెంపు ,నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, రైతు రుణమాఫీ, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్, రైతు భరోసా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేద రైతులకు ఉన్న భూ హక్కుల సంరక్షణ కోసం భూ భారతి చట్టం ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ జగదీశ్వర్ రావు, ఎంపిడిఓ రామ్మోహన్ చారి,ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్లగొండ జిల్లా వుదయం ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని,ఫిర్యాదులు ఎక్కువగా ఉన్న శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఫిర్యాదులు పెండింగ్ లో లేకుండా చూడాలని చెప్పారు. ఒకవేళ ఏదైనా ఫిర్యాదు పరిష్కారం వివిధ కారణాలవల్ల ఆలస్యమవుతున్నట్లయితే అదే విషయాన్ని మధ్యంతర జవాబు ద్వారా ఫిర్యాదుదారుకు తెలియజేయాలని అన్నారు. ప్రజావాణి ఫిర్యాదులన్నీ ఖచ్చితంగా పరిష్కరించాలని అన్నారు. 30 రోజులకు మించి ఎలాంటి ఫిర్యాదు పెండింగ్ లో ఉండకూడదని, జిల్లా వ్యాప్తంగా ఈ ఫిర్యాదుల సంఖ్య 150 కి మించకూడదని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పెండింగ్ ఫైళ్ల జాబితా రూపొందించి ఈ నెల 15 లోపు వాటిని పరిష్కరించాలని కలెక్టర్ చెప్పారు.వచ్చే వారం లోపు పెండింగ్ ఫైల్స్ తో సహా పరిష్కరించిన వివరాలను సమర్పించాలన్నారు. ఇకపై అన్ని కార్యాలయాల ఫైళ్లు ఈ ఆఫీస్ ద్వారా నిర్వహించడం జరుగుతుందని, ఇందుకుగాను ఎన్ఐసి ద్వారా ప్రతి శాఖకు ఒక మెయిల్ ఐడి ఇవ్వనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు .ఇక పై మాన్యువల్ గా కాకుండా ఆన్లైన్లోనే ఫైళ్లు సమర్పించాలని చెప్పారు. ప్రజాపాలన ప్రజా ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రోజువారీ కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, సోమవారం జిల్లా వ్యాప్తంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ తో సహా అన్ని మున్సిపాలిటీలలో 5 కె రన్ మారథన్ నిర్వహించడం జరిగిందని, అలాగే సెగ్రిగేషన్ షెడ్లు, పార్కులపై దృష్టి సారించాలని, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డ్ లను గ్రామాలలో కచ్చితంగా వినియోగించాలని చెప్పారు.. పదవ తరగతి పరీక్షల ఏర్పాట్లను పూర్తిచేయాలని, ఇంటర్మీడియట్ పరీక్షలపై మండల ప్రత్యేక అధికారులు వారి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. జనగణనలో భాగంగా ఎన్యూమరేషన్ బ్లాక్ లను ఖరారు చేయాలని ,అలాగే ఎన్యుమరేషన్ సూపర్వైజర్ లను నియమించాలని చెప్పారు.ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినందున గ్రామపంచాయతీ వారిగా గృహప్రవేశాలు చేసే లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా మండలాల ప్రత్యేక అధికారులు చొరవ చూపాలని చెప్పారు. కాగా ఈ సోమవారం మొత్తం (125) ఫిర్యాదులు రాగా, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి (72), జిల్లా అధికారులకు సంబంధించి (53) ఫిర్యాదులు వచ్చాయి. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, దేవరకొండ ,చండూరు ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీ

# శ్రీనిధి అవకతవకలపై విచారణ జరిపించాలి

**మంత్రి సీతక్కకు వినతి ప్రతం అందజేసిన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ అనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి**



**రాయపర్తి వుదయం ప్రతినిధి :** హైదరాబాద్ రాష్ట్ర పంచాయతీ రాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు సీతక్క ని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ అనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గంలోని శ్రీనిధి సంస్థలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి, బాధితులకు న్యాయం చేయాలని మంత్రివర్యులకు వినతి పత్రం సమర్పించారు.శ్రీనిధి వ్యవహారంలో జరిగిన అక్రమాల వల్ల నష్టపోయిన బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు న్యాయం జరగడం అత్యంత ముఖ్యమని, ఈ అంశంపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని మంత్రి సానుకూలంగా స్పందించారు, ఆశాభావం వ్యక్తం చేశారు

# ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యను అభ్యసించండి

## ఇంటర్ పరీక్షా కేంద్రాల సందర్శన విద్యార్థులతో ముఖాముఖి




ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ ప్రిన్సిపాల్ మల్లం నవీన్, అధ్యాపక బృందం

**నర్సంపేట మార్చి 10 వుదయం ప్రతినిధి.**
నర్సంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ ఆధ్వర్యంలో అధ్యాపకులు డా. భద్రు, డా. సత్యనారాయణ, డా. సోమయ్య, డా. రాజీరు, రజిత, డా. సంధ్య, డా. పూర్ణచందర్, దివ్య, స్వప్న, రాకేష్, శ్రీనివాస్ సమీప ప్రాంతాల్లోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను సందర్శించి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి, ఉన్నత విద్యకు సంబంధించిన పలు అంశాలను వివరించారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నాణ్యమైన బోధన, తక్కువ ఖర్చుతో ఉన్నత విద్య పొందే అవకాశాలు, ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు, హాస్టల్, ఇతర సంక్షేమ పథకాల గురించి వారికి అవగాహన కల్పించారు. ప్రభుత్వ కళాశాలలో చదవడం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని వివరించారు. నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న సైన్స్ మరియు కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, గ్రంథాలయం, క్రీడా సదుపాయాలు వంటి అనేక సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. అదనంగా, పోటీ పరీక్షలకు సిద్ధం కావాలనుకునే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా కాంపిటేటివ్ ఎగ్జామ్ కోచింగ్ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలియజేశారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం కళాశాలలో వివిధ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, కెరీర్ గైడెన్స్ సెషన్లు, ప్లేస్‌మెంట్ సహాయకార్యక్రమాలు నిర్వహించామని క్రీడల్లో జాతీయ స్థాయిలో పదుల సంఖ్యలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారాని, రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు మరింత ప్రాయోజనకరంగా ఉండేలా చార్టర్డ్ అకౌంటెన్సీ మరియు అకౌంట్స్‌కు సంబంధించిన ప్రత్యేక శిక్షణకార్యక్రమాలను ప్రారంభించేందు కు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మల్లం నవీన్ తెలిపారు. ఇందుకోసం నిపుణులతో భాగస్వామ్యం చేసి విద్యార్థులకు ప్రాక్టికల్ ట్రైనింగ్ మరియు కెరీర్ మార్గదర్శకత అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో చదవడం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, విస్తృతమైన విద్యా వనరులు మరియు భవిష్యత్ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రిన్సిపాల్ వివరించారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు తమ ఉన్నత విద్య కోసం నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి అందుబాటులో ఉన్న అన్నిసదుపాయాలను వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మరియు అధ్యాపకులు పిలుపునిచ్చారు.

# పశువుల్లో గాలి కుంటు వ్యాధి - వ్యాధి రోధక టీకాలు

**జిల్లా పశు వైద్య , పశు సంవర్ధక అధికారి**

**నల్లగొండ జిల్లా వుదయం ప్రతినిధి :** జిల్లాలోని అన్ని పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలను అన్ని గ్రామాలలోని 3 లక్షల పశువులకు మార్చి 10 వ తేది నుండి ఏప్రిల్ 9 వ తేదీ వరకు నెల రోజుల పాటు ఈ టీకాలు వేయటం జరుగుతుంది అని జిల్లా పశు వైద్య మరియు పశు సంవర్ధక అధికారి డా జి వి రమేష్ తెలియ చేశారు.దీని కోసం జిల్లా లోని పశు వైద్య సిబ్బంది మరియు గోపాల మిత్రులు 80 బృందాలుగా ఏర్పడి ,అన్ని గ్రామాలలో టీకాలు చేస్తారు. టీకాలు నాడు చేసిన వివరాలను భారత్ పశుధన్ యాప్ లో నమోదు చేస్తారు.వ్యాధి కారణంఇది ఒక వైరస్ వల్ల వచ్చే అత్యంత అంటువ్యాధి. ఈ వ్యాధి ని ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ లేదా గాలి కుంటు వ్యాధి అని పిలుస్తారు. ఈ వ్యాధి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు మరియు పందులలో వస్తుంది ఈ వ్యాధి బాధిత ంతువుల లాలాజలం, ముక్కు స్రావాలు పాదాల గాయాల నుండి వచ్చే ద్రవం, కాలుషతమైన మేత, పరికరాల ద్వారా కూడా వ్యాపిస్తుంది.వ్యాధి లక్షణాలుఅధిక జ్వరం (104-106□F వరకు), నోటిలో బుడగలు / పుండ్లు, నాలుకపై గాయాలు, పెదవులు, దంతాల దగ్గర బ్లిస్టర్లు, పాదాల మధ్య గాయాలు, నడవలేకకుంటడం, ఎక్కువ లాలాజలం కారడం, పాలు తగ్గడం వంటి లక్షణాలు కనిపించడం మరియు దూడల్లో అకస్మాత్తుగా మరణం కూడా జరుగుతుంది.వ్యాధి చికిత్స ఈ వ్యాధికి ప్రత్యేకమైన వైరస్ మందు లేదు. లక్షణాల ఆధారంగా చికిత్స చేస్తారు. గాయాలకు పొటాషియం పెర్మాంగనేట్ నీటితో కడగడం,యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ మందులు, విటమిన్ బి కాంప్లెక్స్ ఇవ్వడం మరియు పశువులకు మృదువైన మేత ఇవ్వడం చేయాలి.వ్యాధి నివారణFMD టీకా (వ్యాక్సిన్) చేయటం వలన ఈ వ్యాధిని నివారించవచ్చు. FMD టీకా ను ప్రతి 6 నెలలకు ఒకసారి వేయాలి. కావున రైతులు ఈ సదా అవకాశాన్ని వినియోగించవలసిందిగా కోరుతున్నాం.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొని అన్ని గ్రామాలలో పూర్తి స్థాయి లో పశువులకు టీకాలు చేయించే విధంగా సహకరించ వలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాం. జిల్లా పశు వైద్య మరియు పశు సంవర్ధక అధికారి తెలిపారు.

# కేజీబీవి పాఠశాల సందర్శించిన మంత్రి పొన్నం



## పదవ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహం

**భీందేవరపల్లి, మార్చి 10 (వుదయం ప్రతినిధి) :** హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవి) పాఠశాలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులతో మాట్లాడిన మంత్రి, వచ్చే నాలుగు రోజులు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. విద్యార్థులు పూర్తి శ్రద్ధతో చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మంత్రి పరిశీలించారు. భోజన నాణ్యత, వంటశాల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేజీబీవి విద్యార్థులతో కలిసి మంత్రి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులతో సత్సంభాషణ జరిపి వారి చదువులు, వసతి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యాసానికి ప్రభుత్వం అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ రవి, డీఈఓ సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంత్య పుష్కరాల ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి మార్చి 10(వుదయం జిల్లా ప్రతినిధి):** కాళేశ్వరంలో నిర్వహించనున్న అంత్య పుష్కరాల ఏర్పాట్లు పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో అంత్య పుష్కరాల ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, విద్యుత్, మిషన్ భగీరథ, వైద్య, ప్రణాళిక శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంత్య పుష్కరాలకు చేపట్టిన అన్ని పనులు ఏప్రిల్ 30 వరకు శాశ్వత పనులను మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఘాట్ల వద్ద పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, విద్యుత్, తాత్కాలిక మరుగుదొడ్లు, పార్కింగ్ సదుపాయాలు, భక్తులు సురక్షితంగా స్నానం చేసేలా ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ శాఖ ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వైద్య శాఖ అత్యవసర వైద్య సేవలు, అంబులెన్స్ సౌకర్యాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పనుల పురోగతిని తరచూ పరిశీలిస్తూ సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాదాయ, ఇరిగేషన్, పీఆర్, ఆర్ అండ్ బి, విద్యుత్తు, మిషన్ భగీరథ, వైద్య, పోలీసు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రగతి ప్రణాళిక

## ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవర్

**నకిరేకల్ మార్చి 10(వుదయం ప్రతినిధి ):**
నకిరేకల్ పట్టణంలోని నారాయణ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నకిరేకల్ నియోజకవర్గ స్థాయి "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" అమలు పై సన్నాహక సమావేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు.
ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ , జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ,జిల్లా స్థాయి అధికారులు, మున్సిపాలిటీ చైర్మన్లు, సర్పంచులు, కౌన్సిలర్లు మరియు ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత సమర్థంగా చేరవేయడానికి 99 రోజుల "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు.తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందని, పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పలు సంక్షేమ పథకాలను అందిస్తున్నదని వివరించారు.ఈ 99 రోజుల కార్యక్రమంలో ప్రతి శాఖకు ప్రత్యేకంగా రోజులు కేటాయించి ప్రజా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించాలన్నదే ముఖ్యమంత్రి గారి లక్ష్యమని అన్నారు. సంకల్పంతో పని చేస్తే ప్రతి కార్యక్రమం విజయవంతమవుతుందని, అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.నకిరేకల్ నియోజకవర్గంలో గంజాయి సమస్య ఎక్కువగా ఉండేదని, ఇప్పటికే చాలా వరకు కట్టడి చేశామని తెలిపారు. యువత తప్పుదారిలో పడకుండా అందరూ కలిసి చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎదురయ్యే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని అన్నారు.ఇక అభివృద్ధి కార్యక్రమాల విషయానికి వస్తే, నకిరేకల్ పట్టణంలో 100 పడకల ఆసుపత్రిని త్వరలో ప్రారంభించనున్నామని, అలాగే చిట్యాల పట్టణంలో 30 పడకల ఆసుపత్రి, రామన్నపేటలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపడతామని వెల్లడించారు.రేషన్ కార్డు రాని వారు తిరిగి దరఖాస్తు చేసుకుంటే అర్హులైన వారికి తప్పకుండా కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్లు కేటాయిస్తామని అన్నారు.నకిరేకల్ పట్టణ భద్రత దృష్ట్యా తన నిధుల నుంచి సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ.30 లక్షలు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట మార్చి 10(వుదయం)
మహిళలు అన్ని రంగాలలో రాణించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు, జిల్లా ఎస్పీ కే నరసింహ, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీతారామారావు తో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, అందరికీ ఆదర్శంగా ఉన్నత స్థానానికి ఎదగాలని, ప్రతి మహిళ సాటి మహిళకు అండగా నిలబడాలని తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని, ప్రతి మహిళ జీవితంలో ఒడిదుడుకులు ఎదుర్కొన్న వారేనని తెలిపారు.మహిళలు విద్య, విజ్ఞానం, సాంకేతికత, ఉద్యోగం, వ్యాపారం వంటి ప్రతి రంగంలో ప్రతిభను చాటుతూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. మహిళ సాధికారత దేశ అభివృద్ధికి పునాది అని తెలిపారు. కుటుంబం నుంచి సమాజం వరకు ప్రతి స్థాయిలో మహిళల పాత్ర అపారమని, మహిళలకు మరిన్ని విస్తృతంగా అవకాశాలు కల్పిస్తే దేశ ప్రగతి మరింత వేగంగా సాగుతుందని అన్నారు. మహిళల విద్య, ఆరోగ్యం, భద్రతకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామిక వేత్తలు, యువ మహిళలు స్టార్టప్‌లు ప్రారంభిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని కలెక్టర్ అభినందించారు, మహిళల కోసం మన ప్రభుత్వం ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇండ్లు, 500 కే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాల అమలు చేస్తున్నాయని ఈ సందర్భంగా మహిళల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీలలో మహిళల ప్రాధాన్యత పెరిగినదని, మహిళల రక్షణకు ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకొచ్చినదని మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ ఏర్పాటు చేయనైనదని మహిళలు అన్ని రంగాలలో ధైర్యంగా ముందుకు వెళ్లాలని ఎస్పి అన్నారు.అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా మహిళల అధికారులను శాలువులతో సన్మానించారు ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి , మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత, కోదాడ డిప్యూటీ చైర్ పర్సన్ మల్లీశ్వరి, డిప్యూటీ సీఈఓ శిరీష, పంచాయతీరాజ్ ఇ ఇ రమాదేవి, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద రాణి, డిఎంహెచ్వో వెంకటరమణ, డిటిఓ రవికుమార్, సీడబ్ల్యూసీ సభ్యులు , సీడీపీవోలు, సూపర్వైజర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగాల కోత వార్తలు అవాస్తవం



భారీగా ఉద్యోగాల కోత విధిస్తున్నట్లు వచ్చిన వార్తలను ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రా తోసిపుచ్చింది. ఉద్యోగులను తొలగించే ప్రతిపాదనేదీ పరిశీలనలో లేదని స్పష్టం చేసింది. ఇటీవల సోషల్ డియా పోస్ట్‌లు, వాటాదార్ల నుంచి వస్తున్న ప్రశ్నల నేపథ్యంలో కంపెనీ ఈ వివరణ ఇచ్చింది. 'నమోదిత కంపెనీల వెల్లడి నిబంధనలన్నీ' పాటిస్తున్నామని, కార్యకలాపాల స్థిరత్వానికి కట్టుబడి ఉన్నామని టెక్ మహీంద్రా వివరించింది. మూడేళ్ల క్రితం కొత్త నాయకత్వం రూపొందించిన వ్యూహం వల్ల టెక్ మహీంద్రా వేగవంతమైన, స్థిరమైన వృద్ధి దిశగా అడుగులువేస్తోందని, సంస్థ నిర్వహణ మార్జిన్, భారీ ఒప్పందాల పెరుగుదలకు ఇది నిదర్శనమని కంపెనీ సీఈఓ, ఎండీ మోహిత్ జోషి పేర్కొన్నారు.

# బిజినెస్

## నష్టాల నుంచి కోలుకొని లాభాల వైపు పరుగులు



అమెరికా, ఇజ్రాయెల్ లబ ఇరాన్ యుద్ధం కారణంగా స్టాక్ మార్కెట్లు గత కొద్ది రోజులుగా నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం కూడా భారీ నష్టాల్లో ముగిశాయి. కానీ గత సెషన్‌లో భారీ పతనంతో ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేసిన భారతీయ స్టాక్ మార్కెట్లు, నేడు (మంగళవారం) ఉదయం నుంచే రికవరీ బాట పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలతో పాటు, కనిష్ట స్థాయిల వద్ద ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం మార్కెట్లకు భారీ ఊతాన్నిచ్చింది. ప్రస్తుతం సెన్సెక్స్ 77,991 పాయింట్ల వద్ద ట్రేడ్ అవుతూ, సుమారు 425 పాయింట్ల లాభంతో బలంగా కొనసాగుతోంది. అటు నిఫ్టీ కూడా తన కీలక స్థాయిలను తిరిగి పుంజుకుని 24,139.25 పాయింట్ల వద్ద ట్రేడ్ అవుతూ ఇన్వెస్టర్లలో ఆశలు చిగురింపజేస్తోంది. నేటి మార్కెట్ గమనానికి ప్రధానంగా ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలు వెన్నుదన్నుగా నిలిచాయి. నిన్నటి భారీ నష్టాల తర్వాత నాణ్యమైన షేర్ల ధరలు ఆకర్షణీయంగా మారడంతో దేశీయ ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేపట్టారు. దీనికి తోడు అమెరికా, ఇతర ఆసియా మార్కెట్ల సానుకూల ధోరణి కూడా మన మార్కెట్లలో ఉత్సాహాన్ని నింపింది. ప్రస్తుత ట్రెండ్ కొనసాగితే మార్కెట్లు మరింత లాభాల్లో ముగిసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## 8 దేశాల్లో యూపీఐ సేవలు



భారత ప్రధాని మోడీ ఇజ్రాయెల్ పర్యటనలో యూపీఐ అంశం కూడా చర్చనీయాంశమైంది. ఇజ్రాయెల్ ఫాస్ట్ పేమెంట్ వ్యవస్థతో యూపీఐని అనుసంధానం చేయడంపై ఇరుదేశాలు చర్చలు జరిపాయి. యూపీఐని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆకాశానికెత్తేశారు. దీంతో త్వరలోనే ఇజ్రాయెల్‌లో కూడా యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. అయితే ఇప్పటికే 8 దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయనే సంగతి చాలామందికి తెలియదు. ఇన్‌స్టంట్‌గా జరిగే ఈ క్యాష్‌లెస్ పేమెంట్స్ వల్ల కొన్ని దేశాల్లో భారతీయ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరగడం గమనార్హం. ఈ సేవలు వినియోగించుకోవాలంటూ యూపీఐ ఇంటర్నేషనల్ సెటప్ చేసుకుంటే సరిపోతుంది. ఎడారి దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ప్రయాణించే భారతీయులు పేటీయం యాప్‌తో యూపీఐ పేమెంట్స్ చేసుకోవచ్చు. ఫోన్‌పే యూజర్లయితే మాష్రెక్‌కు చెందిన నియోపే టర్మినల్స్‌లో కూడా యూపీఐ సేవలు ఉపయోగించుకోవచ్చు. భారతీయ రూపాయల్లోనే ట్రాన్సాక్షన్ జరుగుతుంది. మారకం విలువను యూడా యాప్స్ చూపిస్తాయి. భారత్ తర్వాత యూపీఐ సేవలను ఆరంభించిన తొలి దేశం భూటాన్. రూపే కార్డుల పేమెంట్‌ను కూడా స్వీకరించే ఈ దేశంలో 2021 నుంచి బీహెచ్ఐఎం ఎనేబుల్ చేసిన యూపీఐ క్యూఆర్ పేమెంట్స్‌ను కూడా అనుమతించారు. దీంతో భారతీయ పర్యాటకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా పేటీయంతో యూపీఐ సేవలు వినియోగించుకోవచ్చు. యూపీఐ సేవలు అనుమతించడంతో ఫ్రాన్స్‌కు భారతీయ పర్యటకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. 2024లో ఈఫిల్ టవర్ వద్ద యూపీఐ సేవలు ప్రారంభించిన తర్వాత.. భారతీయ పర్యాటకుల సంఖ్య సుమారు 40 శాతం పెరిగిందని అధికారులు చెప్తున్నారు. రెండేళ్ల క్రితమే 2024 మార్చి నెలలో నేపాల్‌లో యూపీఐ సేవలకు అనుమతి లభించింది. యూపీఐ ఇంటర్నేషనల్ ఎనేబుల్ చేసుకున్న వినియోగదారులు.. నేపాల్‌లో చాలా చోట్ల నేరుగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పేమెంట్స్ చేసుకోవచ్చు. ద్వీపదేశం సింగపూర్‌లో కూడా 2024 జనవరి నుంచి యూపీఐ పేమెంట్స్ అందుబాటులోకి వచ్చాయి. భీమ్, పేటీయం, ఫోన్‌పే వంటి యాప్స్‌తో ఇక్కడ పేమెంట్స్ చేసుకోవచ్చు. సింగపూర్‌లో నివశించే భారతీయులు స్వదేశంలోని బంధువులకు డబ్బులు పంపేందుకు కూడా యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చు. పొరుగు దేశం శ్రీలంకలో కూడా యూపీఐ సేవలు ఫుల్లుగా అందుబాటులో ఉన్నాయి. 2024 మే నుంచి అనుమతించిన ఈ సేవలతో లంకక్యూఆర్‌ను స్కాన్ చేసి నేరుగా పేమెంట్స్ చేయొచ్చు. భారత రూపాయిల్లోనే చెల్లింపులు జరుగుతాయి. అయితే కరెన్సీ మారకం విలువ కూడా యాప్‌లో కనపడుతుంది. భారత టూరిస్టులు మారిషస్‌లో కూడా యూపీఐ పేమెంట్స్ చెయ్యొచ్చు. 2024 ఫిబ్రవరిలో ఆ దేశం యూపీఐ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఈ దేశంలో రూపే సేవలు కూడా విస్తరించారు. ఇప్పుడు ఆ దేశంలో తీసుకునే రూపే కార్డులను భారత్‌లో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉపయోగించుకోవచ్చు. ఎడారి దేశం ఖతర్‌లోని ప్రముఖ టూరిస్ట్ ప్లేసుల్లో, డ్యూటీ ఫ్రీ షాపుల్లో యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయి. 2025 సెప్టెంబరులో యూపీఐ మాతృసంస్థ ఎన్‌పీసీఐ ఈ విషయాన్ని వెల్లడించింది. ఖతర్‌కు వెళ్లే అత్యధిక టూరిస్టులు వెళ్లే రెండో దేశం భారత్. యూపీఐ సేవల ద్వారా భారతీయ పర్యాటకులను ఆకర్షించడంతో పాటు, కరెన్సీ ఎక్స్చేంజ్ ఇబ్బందులను తొలగించేందుకు ఖతర్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మలేసియాలో కూడా అతిత్వరలో యూపీఐ పేమెంట్స్‌ను అందుబాటులోకి తెస్తామని గతేడాది అక్టోబరులో రేజర్‌పే ప్రకటించింది. అదే జరిగితే ఇష్టమొచ్చిన యూపీఐ యాప్ ద్వారా భారతీయ పర్యాటకులు నేరుగా పేమెంట్స్ చేసుకోవచ్చు.

## ముడి చమురు ధరల పెరుగుదల



ద్రవ్యోల్బణంపై పెద్ద ప్రభావం చూపదు

మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో ముడి చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో దేశీయంగా ద్రవ్యోల్బణ పెరుగుతుందనే చర్చలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు.ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు ధరలు ఇటీవల పెరగడం వల్ల దేశంలో ద్రవ్యోల్బణం భారీగా పెరుగుతుందనే ఆందోళనలు అవసరంలేదని నిర్మలా సీతారామన్ అన్నారు. ఇప్పటికే దేశంలో ద్రవ్యోల్బణం చాలా తక్కువగా ఉంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించిన కనిష్ట పరిమితికి దగ్గరగానే ఉంది. ముడి చమురుధరలూ దాదాపు ఒక ఏడాది కాలంగా తగ్గుతున్నాయని ఆమె ప్రస్తావించారు. అయితే, ఇటీవల పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ సంఘర్షణలు ప్రారంభమైన తర్వాత ధరలు పెరిగాయి. ఆ సమయంలో, భారత ముడి చమురు ధర బ్యారెల్‌కు 69.01 డాలర్ల నుంచి రోజుల వ్యవధిలో బ్యారెల్‌కు 80.16 కి పెరిగిందని మంత్రి వివరించారు.

## ఎల్పీజీ సిలిండర్ బుకింగ్ గడువు పెంపు



అంతర్జాతీయంగా ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతితెలిసిందే. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నడుస్తోంది. అమెరికా కూడా ఇరాన్‌పై దాడులు చేస్తుండగా.. ఇరాన్ అమెరికా- ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపైనా భీకర దాడులు చేస్తోంది. ఈ యుద్ధం ప్రభావంతో చమురు, సహజవాయువు సరఫరాలో కొరత తలెత్తనుందనే భయాలు నెలకొన్నాయి. ఇప్పటికే వంట గ్యాస్ సిలిండర్ ధరల్ని కేంద్రం పెంచింది. గృహ వినియోగ సిలిండర్ ధర రూ. 60, కమర్షియల్ సిలిండర్ ధర రూ. 115 చొప్పున పెరిగింది. ఈ క్రమంలోనే గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్‌ను అడ్డుకునేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు సిలిండర్‌కు సిలిండర్‌కు మధ్య బుకింగ్ గడువు 21 రోజులుగా ఉండగా.. దీనిని 25 రోజులకు పెంచింది. చాలా మంది సిలిండర్లకు కొరత ఏర్పడవచ్చన్న భయాలతో.. ముందస్తుగా బుక్ చేస్తున్నారు. గతంలో సగటున 55 రోజులకు ఒకసారి సిలిండర్ బుక్ చేసుకునే వారు కూడా ఇప్పుడు పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో 15 రోజులకే గ్యాస్ బుక్ చేస్తుండటం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో 21 రోజుల లాకిన్ నిబంధన తెచ్చింది. ఇప్పుడు ఆ గడువును 25 రోజులకు పెంచినట్లు తెలుస్తోంది. ఎల్పీజీ సరఫరాలో కాస్త అంతరాయం నేపథ్యంలో.. వాస్తవానికి ఆయిల్ కంపెనీలు కొద్ది రోజుల ముందే ముందస్తు చర్యలకు దిగాయి. కనీస గడువును బుధవారం నుంచే చమురు సంస్థలు అనధికారికంగా అమల్లోకి తెచ్చినట్లు తెలుస్తోంది. డబుల్ సిలిండర్ ఉన్న వారికి గడువు 30 రోజులు.. సింగిల్ సిలిండర్ ఉన్న వారికి 21 రోజులుగా నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పుడు దానినే 25 రోజులకు చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో వంట గ్యాస్ లభ్యతను నిర్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎమర్జెన్సీ పవర్స్‌ను ఉపయోగిస్తోంది. ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచాలని రిఫైనరీలను ఆదేశించింది. పారిశ్రామిక అవసరాలకు కాకుండా.. గృహ వినియోగదారులకు వంట గ్యాస్ సరఫరానే తొలి ప్రాధాన్యంగా ఉండాలని చమురు సంస్థలకు కేంద్రం స్పష్టం చేసింది.

## భారీగా పెరగనున్న భారత చమురు దిగుమతి బిల్లు



ఇరాన్, ఇజ్రాయెల్-యూఎస్ మధ్య పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. ఈ ఉద్రిక్తతల కారణంగా, సరఫరా భయాలు ముడి చమురు ధరలను బ్యారెల్‌కు దాదాపు 115 డాలర్లకు, ఒకానొక సమయంలో 125 డాలర్ల దగ్గరగా పెంచాయి. ఇది 2022 తర్వాత అత్యధిక స్థాయి. దీంతో దిగుమతి చేసుకున్న చమురుపై ఎక్కువగా ఆధారపడిన అనేక దేశాలకు ఆందోళన కలిగించింది. ముఖ్యంగా 85 శాతం చమురు దిగుమతిపై ఆధారపడిన మనదేశానికి ఇది భారం కానుంది. దీని కారణంగా, ప్రపంచ చమురు ధరలు పెరిగినప్పుడు, భారత్ అదేమొత్తంలో చమురును కొనుగోలు చేయడానికి చాలా ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుంది. గత ఆర్థిక సంవత్సరంలో (2024-25) మనదేశం దాదాపు 137 బిలియన్ డాలర్ల విలువైన 243 మిలియన్ టన్నుల ముడి చమురును దిగుమతి చేసుకుంది.ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100-115 మధ్య ఎక్కువ కాలం కొనసాగితే, మనదేశ చమురు దిగుమతి బిల్లు ప్రతి సంవత్సరం దాదాపు 56-64 బిలియన్ డాలర్లు(మన కరెన్సీలో రూ. 5-5.9 లక్షల కోట్లు) పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. దీనివల్ల కరెంట్‌ఖాతా లోటును పెరుగుతుందని, రూపాయి మరింత బలహీనపడొచ్చు,ద్రవ్యోల్బణం కూడా పెరగడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడినిపెంచుతుంది. అయితే, ఇప్పటివరకు ఆ స్థాయి సంక్షోభం లేదని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ప్రధాన ఆర్థిక వేత్త అదితి నాయర్ అన్నారు. కానీ, మధ్యప్రాచ్యంలో ఘర్షణలు కొనసాగితే పరిస్థితి మరింత ప్రమాదంగా మారుతుంది. అధిక చమురు ధరలు ఇంధన ధరలు, రవాణా ఖర్చులు, మొత్తం ఆర్థిక వృద్ధితో సహా ఆర్థిక వ్యవస్థలోని అనేక భాగాలను ప్రభావితంచే స్థాయి. దీన్ని దృష్టిలోఉంచుకుని ప్రభుత్వం, చమురు సంస్థలు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి.

# క్రీడలు

## వన్డే వరల్డ్ కప్ కోసం బ్లూప్రింట్ రెడీ చేస్తాం



టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత టీమిండియా హెడ్ కోచ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఈ విజయ గర్వం తలకెక్కించుకోకూడదని, మరింత కష్టపడాలని ఆటగాళ్లకు సూచించాడు.ట్రోఫీ నెగ్గడం గమ్యంలా భావించకుండా, కొత్త ప్రయాణానికి ఆరంభాలా భావించాలన్నాడు. ముఖ్యంగా టీ20 ఫార్మాట్లో మరింత ఎక్స్‌ప్లోజివ్‌గా ఆడతామని, 300 పరుగుల రికార్డు బద్దలు కొట్టేందుకు ప్రయత్నిస్తామని స్పష్టంచేశాడు. 'మేం ఇంకా 300 టార్గెట్ టచ్ చెయ్యలేదు. ఏదో ఒకరోజు అది కూడా అందుకుంటాం. మేం మరింత నిర్దాక్షిణ్యంగా మారతాం' అని చెప్పాడు. టోర్నీలో సంజూ ఆడి ఇన్నింగ్స్‌లు చూసిన తర్వాత.. వరల్డ్ కప్ వంటి వేదికపై కూడా తమ ఎగ్రెసివ్ అప్రోచ్ పనిచేస్తుందనే కాన్ఫిడెన్స్ ఇచ్చిందన్నాడు. అలాగే ఐపీఎల్ 2026 ముగిసే సమయానికి వచ్చే ఏడాది జరిగే వన్డే వరల్డ్ కప్ కోసం కూడా బ్లూప్రింట్ సిద్ధం చేస్తామని గంభీర్ తెలిపాడు. '2027 వరల్డ్ కప్ కోసం ప్లానింగ్‌ను ఐపీఎల్ తర్వాత స్టార్ట్ చేస్తాం.

## టీమ్ ఆఫ్ ది టోర్నీ ప్రకటించిన ఐసీసీ..
## భారత్ నుంచి నలుగురికి చోటు



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ -ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026కు గానూ టీమ్ ఆఫ్ ది టోర్నీ జట్టును సోమవారం ప్రకటించింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో భారత్..న్యూజిలాండను ఓడించి విజేతగా నిలిచింది. ఫైనల్ జరిగిన ఒక రోజు తర్వాత.. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన చేసిన 11 మంది ఆటగాళ్లతో జట్టును ప్రకటించింది. ఇందులో ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా నుంచి నలుగురికి చోటు దక్కింది. ఈ జట్టుకు సౌతాఫ్రికాకు చెందిన ఎయిడెన్ మార్‌క్రమ్ సారథిగా ఎంపికయ్యాడు.ఐసీసీ ప్రకటించిన జట్టులో భారత్ నుంచి.. సంజూ శాంసన్ , ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రాలకు చోటు దక్కింది. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచిన సంజూ శాంసన్.. ఐదు ఇన్నింగ్స్‌లలో ఏకంగా 321 పరుగులు చేశాడు. ముఖ్యంగా వెస్టిండీస్‌తో వర్చువల్ క్వార్టర్ ఫైనల్, ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్, న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో హాఫ్ సెంచరీ స్కోరు చేశాడు. ఇక వన్ డౌన్ బ్యాటర్.. ఇషాన్ కిషన్ కూడా ఈ టోర్నీలో పరుగుల వరద పారించాడు. 190కి పైగా స్ట్రైక్ రేటుతో అతడు 317 రన్స్ స్కోరు చేశాడు. న్యూజిలాండ్‌తో ఫైనల్.. హాఫ్ సెంచరీ సైతం చేశాడు. మరోవైపు ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా.. తన పాత్రకు న్యాయం చేశాడు. ఈ టోర్నీలో రెండు హాఫ్ సెంచరీలు చేయడంతో పాటు.. 9 వికెట్లు తీశాడు. ఇక జస్‌ప్రీత్ బుమ్రా .. సత్తాచాటాడు. 8 మ్యాచ్‌లలో 6.21 ఎకానతో 14 వికెట్లు పడగొట్టి.. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. ఫైనల్‌లో 15 పరుగులు మాత్రమే ఇచ్చి నాలుగు వికెట్లు తీశాడు. ఎయిడెన్ మార్‌క్రమ్ (కెప్టెన్), సంజూ శాంసన్ (వికెట్ కీపర్), సాహిబ్‌జాదా ఫర్హాన్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, విల్ జాక్స్, జేసన్ హోల్డర్, జస్‌ప్రీత్ బుమ్రా, లుంగి ఎంగిడి, ఆదిల్ రషీద్, బ్లెస్సింగ్ ముజరబానీ. 12వ ఆటగాడిగా అమెరికాకు చెందిన వాన్ చాక్‌విక్‌ను ఐసీసీ ఎంపిక చేసింది.

## ఆ సిరీస్ తర్వాత మనసు చెడింది.. ఆడలేకపోయా..: సంజూ



వరల్డ్ కప్‌లో అద్భుతంగా రాణించిన భారతస్టార్ సంజూ శాంసన్.. తాను ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి మాట్లాడాడు. కేరళకు తిరిగొచ్చిన అతనికి ఎయిర్‌పోర్టులో అద్భుతమైన స్వాగతం లభించింది. ఈ క్రమంలో తను ఎదుర్కొన్న సవాళ్లను గుర్తుచేసుకున్న సంజూ.. 'అంతా నా బుర్రలో ఉన్నదే. కివీస్‌తో సిరీస్ తర్వాత నా కలలన్నీ ముక్కలైపోయినట్లు ఫీలయ్యా. దేవుడు వేరే ప్లాన్ వేశాడేమో తెలియదు. కానీ కివీస్‌తో సిరీస్ తర్వాత అసలు ఆడలేకపోయా. సంతోషంగా లేకపోవడంతో బెడ్ ద నుంచి లేవలేకపోయా. ఎమోషన్స్‌లో కొట్టుకుపోయా. ఆ తర్వాత నెమ్మదిగా పరిస్థితిని స్వీకరించా. అప్పుడు కొంచెం త్వరగా కోలుకున్నా' అని వివరించాడు. అలాగే వరల్డ్ కప్‌లో జింబాబ్వేతో మ్యాచ్ తర్వాత గంభీర్‌ని కలిసిన విషయాన్ని గుర్తుచేసుకున్నాడు. ఓజింబాబ్వే మ్యాచ్ తర్వాత గౌతీ భాయ్‌ని జిమ్‌లో కలిశా. అప్పుడే 'సంజూ.. నెక్స్ట్ గేమ్ నువ్వు ఆడుతున్నావ్' అన్నాడు. నేను సిద్ధంగా ఉన్నానని చెప్పా' అని వెల్లడించాడు. అలాగే జట్టులో స్థానం కోసం తోటి ఆటగాళ్లతో పోటీ పడుతుంటే తాను మంచి ప్రదర్శన ఇవ్వలేనని, జట్టుతో కలిసి ఒక లక్ష్యం కోసం పోరాడేటప్పుడు రాణిస్తానని చెప్పుకొచ్చాడు. ఈ టోర్నీలో కేవలం ఐదు మ్యాచులే ఆడిన సంజూ 80.25 సగటు, 199.37 స్ట్రైక్ రేటుతో 321 పరుగులు చేశాడు. అంతేకాదు 24 సిక్సర్లు, 27 ఫోర్లు బాదాడు. టీ20 వరల్డ్ కప్ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత ప్లేయర్‌గా కోహ్లీ (319) రికార్డును బద్దలుకొట్టాడు.

## మరో రెండేళ్లు క్రికెట్ ఆడతా
## టీ20 ప్రపంచకప్ 2026 తర్వాత..




టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెబుతాడనే ప్రచారం జరిగింది. మ్యాచ్‌లో గెలిచినా.. ఓడినా.. 35 ఏళ్ల సూర్య రిర్మెంట్ ప్రకటిస్తాడని జోరుగా వార్తలు వచ్చాయి. అయితే అదే జరగలేదు. జై షా చేతుల దుగా సూర్యకుమార్ యాదవ్.. టీ20 ప్రపంచకప్ టిల్ అందుకున్నాడు. మ్యాచ్ అనంతరం అతడు మాట్లాడుతూ.. తన తర్వాతి టార్గెట్ ఏంటో చెప్పాడు. రెండేళ్ల తర్వాత జరిగే లాస్ ఎంజెలెస్ ఒలింపిక్స్ 2028లో క్రికెట్‌లో గోల్డ్ మెడల్ సాధించడమే తన లక్ష్యమని చెప్పుకొచ్చాడు. దీంతో పరోక్షంగా రిర్మెంట్ వార్తలకు చెక్ పెట్టాడు. మ్యాచ్‌తర్వాత సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ''మా తదుపరి లక్ష్యం ఒలింపిక్ స్వర్ణం. 2028లో లాస్ ఎంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌లో స్వర్ణం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అదే ఏడాది టీ20 ప్రపంచకప్ 2028 కూడా జరగనుంది. అందులోనూ సత్తాచాటుతాం'' అని సూర్యకుమార్ యాదవ్ తన మనసులోని మాటను బయటపెట్టాడు. తన కామెంట్స్‌తో రిర్మెంట్ పుకార్లకు చెక్ పెట్టాడు సూర్యకుమార్ యాదవ్. తాను మరో రెండేళ్ల పాటు భారత జట్టు తరఫున ఆడతానని చెప్పకనే చెప్పాడు. ఇక లాస్ ఎంజెలెస్ 2028 ఒలింపిక్స్ ద్వారా.. సుమారు 128 ఏళ్ల విరామం తర్వాత ఒలింపిక్స్‌లోకి క్రికెట్ అడుగుపెట్టనుంది. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ సంబంధించిన షెడ్యూల్ ఇప్పటికే విడుదలైంది. 2028 ఒలింపిక్స్ అమెరికాలోని లాస్ ఎంజెలెస్‌లో జరగనుంది. క్రికెట్ పోటీలు.. 2028 జులై 12 నుంచి అంటే.. ఒలింపిక్స్ ప్రారంభానికి రెండు రోజుల ముందు నుంచి ప్రారంభం కానున్నాయి. పోటీలు జులై 29న ముగియనున్నాయి. ఒలింపిక్స్‌లోని అన్ని మ్యాచ్‌లూ కూడా లాస్ ఏంజెలెస్‌కు 50 కి. దూరంలో ఉన్న పమోనాలోని ఫెయిర్‌ప్లెక్స్‌లో ప్రత్యేకంగా నిర్మిస్తున్న 500 ఎకరాల తాత్కాలిక స్టేడియంలో జరుగుతాయి. ఈ ఒలింపిక్స్‌లో క్రికెట్ టీ20 ఫార్మాట్‌లో జరుగనుంది. పురుషులు, మహిళల విభాగాల్లో మొత్తం ఆరు అంతర్జాతీయ జట్లు ఒలింపిక్స్‌లో పోటీ పడతాయి. స్వర్ణ, రజత, కాంస్య పతకాల కోసం ఆరు జట్లు పోటీ పడనున్నాయి.

## గంభీర్ ముఖంలో ఆ ప్రత్యేకత కనిపిస్తోంది: ధోనీ



ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో టీమిండియా అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టును 96 పరుగుల భారీ తేడాతో ఓడించి భారత జట్టు ప్రపంచకప్ ట్రోఫీని తన ఖాతాలో వేసుకుంది. ఈ ఘన విజయంపై క్రికెట్ దిగ్గజాలు ప్రశంసలు కురిపించాయి. సునీల్ గావస్కర్, సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి మాజీ, ప్రస్తుత క్రికెటర్లు టీమిండియాకు అభినందనలు తెలియజేశారు.వరల్డ్ కప్ గెలిచిన తర్వాత కోచ్ గౌతమ్ గంభీర్ ముఖంలో కనిపించిన చిరునవ్వు ఎంతో ఆకర్షణీయంగా ఉందని మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ పేర్కొన్నారు. గెలుపు కోసం ఉన్న పట్టుదలతో పాటు చిరునవ్వు కూడా ఉండటం నిజమైన 'కిల్లర్ కాంబినేషన్' అని ఆయన వ్యాఖ్యానించారు. అదేవిధంగా ఛాంపియన్ బౌలర్ అంటే గుర్తొచ్చే పేరు జస్ప్రీత్ బుమ్రానే అని ధోనీ ప్రశంసించారు. టి20 ఫార్మాట్‌లో ఒకే జట్టు వరుసగా రెండుసార్లు వరల్డ్ కప్ గెలుచుకోవడం గొప్ప విజయమని సచిన్ టెండూల్కర్ అభిప్రాయపడ్డారు. సాధారణంగా టి20 మ్యాచ్‌లలో 20 నుంచి 30 పరుగుల తేడాతో గెలిచినా అది పెద్ద విజయం అని భావిస్తారని, అలాంటిది ఫైనల్‌లో 96 పరుగుల తేడాతో గెలవడం నిజంగా విశేషమని సునీల్ గావస్కర్ పేర్కొన్నారు.ఈ టోర్నమెంట్ మొత్తం సంజు శాంసన్ అద్భుత ప్రదర్శన కనబరిచారని విరాట్ కోహ్లీ ప్రశంసించారు. టీమిండియా లో ఉన్న ప్రతిభావంతులైన ఆటగాళ్లతో ఇతర జట్లు సరితూగడం చాలా కష్టమని ఆయన అన్నారు.భారత బ్యాటిం గ్ శైలిపై స్పందించిన వీరేంద్ర సెహ్వాగ్, ఆటగాళ్లు గల్లీ క్రికెట్ ఆడినంత సులభంగా బ్యాటింగ్ చేశారని కొనియాడారు.

## శ్రీలంక హెడ్ కోచ్‌గా గ్యారీ కిర్‌స్టన్ ఎంపిక



భారత్‌తో పాటు టీ20 ప్రపంచకప్ 2026కు సంయుక్త ఆతిథ్యం ఇచ్చిన శ్రీలంక.. దారుణ ప్రదర్శన చేసింది. సెస్ కూడా చేరకుండానే సూపర్-8 దశ నుంచే నిష్క్రమించింది. ఈ నేపథ్యంలో ఆ జట్టు వచ్చే వన్డే ప్రపంచకప్ 2027పై ఫోకస్ చేసింది. ఇందులో భాగంగా టీమిండియాకు వన్డే ప్రపంచకప్ 2011 అందించిన దక్షిణాఫ్రికాకు చెందిన గ్యారీ కిర్‌స్టన్‌ను హెడ్ కోచ్‌గా నియమించింది. ఈ మేరకు సోమవారం అధికారికంగా ప్రకటనచేసింది. గతకొన్ని రోజులుగా శ్రీలంక క్రికెట్ దిగ్గజం సనత్ జయసూర్య.. శ్రీలంక హెడ్ కోచ్‌గా పనిచేశాడు. అతడి కోచింగ్‌లో ద్వైపాక్షిక సిరీస్‌లలో శ్రీలంక సత్తాచాటినా.. ఐసీసీ టోర్నీలో మాత్రం విఫలమైంది. తాజాగా టీ20 ప్రపంచకప్ 2026లో సూపర్-8 నుంచే నిష్క్రమించింది. ఎన్నో అంచనాలతో ఈసారి ఆ జట్టు బరిలో నిలిచింది. కానీ ఆశించిన ఫలి తాలు సాధించకపోవడంతో జయసూర్య.. కోచ్ పదవికి రాజీనామా చేశాడు. దీంతో కొత్త కోచ్ ఎంపిక అనివార్యమైంది.కోచింగ్‌లో సుదీర్ఘ అనుభవమున్నగ్యారీ కిర్‌స్టన్ ఏప్రిల్ నుంచి లంక కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. రెండేళ్ల పాటు అతడు ఈ బాధ్యతల్లో ఉండనున్నాడు. వన్డే ప్రపంచకప్ 2027 వరకు అతడే లంక హెడ్‌కోచ్‌గా ఉండనున్నాడు.దక్షిణాఫ్రికాకు చెందిన గ్యారీ కిర్‌స్టన్ ఆటగాడిగా సత్తాచాటిన తర్వాత కోచింగ్ ఫీల్డ్‌లోకి వచ్చాడు 2011లో భారత జట్టు వన్డే ప్రపంచకప్ గెలవడంలో అతడిది కీలకపాత్ర. ఆ తర్వాత ఐపీఎల్‌లోనూ హెడ్ కోచ్‌గా అతడు బాధ్యతలు చేపట్టాడు.

వుదయం సినిమా MOVIE TIME!

## ఇంకా ఎం అనుకోలేదు సెప్టెంబర్ 4న విడుదల

ఈటీవీ విన్‌తో కలిసి గతంలో పలు విజయవంతమైన ప్రాజెక్టులను అందించిన నిర్మాత వంశీ నందిపాటి, మరోసారి ఈటీవీ విన్‌తో కలిసి "ఇంకా ఎం అనుకోలేదు" అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముందుగా వచ్చిన వారి కలయికలోని సినిమాలు వినోదభరితంగా, ప్రత్యేకమైన హాస్యంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. "ఇంకా ఎం అనుకోలేదు" చిత్రానికి రచయితదర్శకుల జోడీ ప్రణయ్ వల్లూరిపల్లి, గిరి పెమ్మసాని దర్శకత్వం వహిస్తున్నారు. సంగీతాన్ని సింజిత్ ఎర్రమిల్లి అందిస్తుండగా, సినిమాటోగ్రఫీని రేహాన్ షేక్ నిర్వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను మంగళవారం విడుదల చేశారు. ఇప్పుడు సోషల్ మీడియా అంతా ఈ అనౌన్స్‌మెంట్ వీడియోపై, టైటిల్‌పైనే ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. సాధారణ ప్రమోషన్ విధానాన్ని కాకుండా, వినూత్నంగా మీమ్స్‌తో నిండిన సరదా వీడియో ద్వారా టైటిల్‌ను ప్రకటించారు. ఇందులో వ్యంగ్యంతో పాటు పాత ఈటీవీ థీమ్‌ను గుర్తుచేసే అంశాలు, హాస్యభరితమైన శైలి కనిపించాయి.



## రాజేంద్రప్రసాద్‌కు కత్తి కాంతరావు జాతీయ పురస్కారం

### అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలకు చెందిన మహిళలకు సత్కారం



భారత కల్చరల్ అకాడమి, తెలుగు ఫిల్మ్ టెలివిజన్ వెల్ఫేర్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం హైదరాబాద్ లో నటప్రపూర్ణ కత్తి కాంతరావు స్మారక జాతీయ పురస్కారాన్ని నటకిరీటి డా.రాజేంద్రప్రసాద్ కు అందజేశారు. ఘనంగా జరిగిన ఈ ప్రధానోత్సవ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, ప్రముఖ దర్శకులు ఎస్వీ కృష్ణారెడ్డి, సీనియర్ నటి కవిత, తెలంగాణ ఎఫ్ డీసీ ఎండీ, ఐ అండ్ పీఆర్ కమిషనర్ శ్రీమతి ప్రియాంక, దర్శకులు ప్రేమ్ రాజ్, విజన్ వీవీకే అధినేత విజయ్ కుమార్, నాగబాల డి.సురేష్ కుమార్, గీత రచయిత వెనిగళ్ల రాంబాబు, పొలిటికల్ లీడర్ వేణుగోపాలచారి, శ్రీ చిత్తరంజన్, శ్రీ శ్రీనివాసరాజు, శ్రీ అక్కినేని శ్రీధర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పార్థసారథి, రచయిత మామిడి హరికృష్ణ, సినీ పాత్రికేయుడు ప్రభు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిపి నటి జ్యోతి, సీనియర్ నటి డబ్బింగ్ జానకి, కాంతరావు కుమార్తె సుశీలతో పాటు వివిధ రంగాల్లోని మహిళల్ని సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

## శ్రీ కళా సుధా ఆధ్వర్యంలో 28వ ఉగాది పురస్కారాలు




చెన్నైలో తెలుగువారి ఘనకీర్తిని చాటుతూ శ్రీ కళా సుధ తెలుగు అసోసియేషన్ 1998వ సంవత్సరం, నవంబర్ 21వ తేదీన ప్రారంభించబడి 27 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా, 'పరాభవ' నామ సంవత్సర ఉగాది పండుగ రోజున 'మహిళా రత్న' మరియు 'బాపు బొమ్మ', 'బాపు రమణ', 'విశిష్ట' ఉగాది పురస్కారాలు మరియు సినీ రంగం2025 పురస్కారాలను మ్యూజిక్ అకాడమిలో మార్చి 15వ తేది 2026 ఆదివారం సాయంత్రం 4 గంటల 29 నిమిషాలకు 2025లో విడుదలైన చలన చిత్రాలలో వివిధ విభాగాలకు సంబంధించిన నటీ నటులను, దర్శక నిర్మాతలను మరియు సాంకేతిక నిపుణులను "ఉగాది పురస్కారము"లతో మరియు వివిధ రంగాలలో నిష్ణాతులైన మహిళా మణులకు "మహిళా రత్న పురస్కారము"తో సత్కరించుటకు కమిటి సభ్యులతో చర్చించి నిర్ణయించడమైనది. ఈ కార్యక్రమానికి శ్రీ కళా సుధ సభ్యులతోపాటు తెలుగువారందరూ విచ్చేసి తెలుగువారి ఘనకీర్తిని ఇనుమడింపజేయుచున్నారు.

ఈ సందర్భంగా జరగనున్న ఈ ఉగాది పురస్కారాలకు సంబంధించి వివరాలను చెబుతూ అవార్డు గ్రహీతల పేర్లను, అలాగే జరగనున్న కార్యక్రమ వివరాలను వెల్లడించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు చిత్ర నిర్మాతల మండలి సెక్రటరీ తుమ్మల ప్రసన్నకుమార్ గారు, సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ ప్రభు గారు, బేతిరెడ్డి శ్రీనివాస్ గారు, ప్రతివాధి భయంకర ఫణీందర్ గారు, వేణు గోపాల్ గారు, అజయ్ కుమార్ గారు, జర్నలిస్ట్ కేశవ గారు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఉగాది పురస్కారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా.. బ్రహ్మానాని చంద్ర శేఖర్ గారు, విశిష్ట అతిథిగా ఎంవిఆర్ మురళీ కృష్ణ, గౌరవ అతిథులుగా ఎ.సాయి ప్రసాద్, సాహు గారపాటి, శశికాంత్ వల్లేపల్లి, ముబా పద్మయ్య, రాజమౌళి శీర్ష, సరోజ వివేకానంద్ రానున్నారు. వశిష్ట ఉగాది పురస్కారం ప్రజా సేవ రంగంలో ఆంధ్ర ప్రదేశ్ టూరిజం ఇంకా సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ గారు అందుకోనున్నారు. అలాగే మహిళా రత్న పురస్కారాన్ని శ్రీమతి మమత మాది రెడ్డి గారు, అందెశ్రీ స్మారక పురస్కారాన్ని ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ గారు, పిబి శ్రీనివాస పురస్కారాన్ని తండ్రిని చిత్రానికి గాను సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ గారికి అందజేయడం జరుగుతుంది.

అలాగే ఉగాది పురస్కారాలు జాబితాలో ఉత్తమ చిత్రం గా మిరాయ్, ఉత్తమ సంచలన చిత్రంగా సంక్రాంతికి వస్తున్నాం, ఉత్తమ జ్యూరీ అవార్డు చిత్రంగా డ్యూడ్, ఉత్తమ నటుడిగా అక్కినేని నాగ చైతన్య, ఉత్తమ నటీమణిగా రష్మిక మందన్న, ఉత్తమ దర్శకుడిగా అనిల్ రావిపూడి, ఉత్తమ మాటల రచయితగా మహేష్ బాబు పి, ఉత్తమ ఛాయా గ్రహకుడుగా నికేత్ బొమ్మి, ఉత్తమ ప్రతినాయకుడిగా దీక్షిత్ శెట్టి, ఉత్తమ సంగీత దర్శకుడిగా భీమ్స్ సిసిరోలియో, ఉత్తమ నూతన దర్శకుడిగా రామ్ జగదీష్, ఉత్తమ నూతన నటుడిగా హర్ష్ రోషన్, ఉత్తమ నూతన హీరోగా కిరీటి రెడ్డి, ఉత్తమ గాయకుడిగా రమణ గోగుల, ఉత్తమ గాయనిగా హరిప్రియ అవార్డులను గెలుచుకున్నారు. అలాగే ఉత్తమ నూతన నటీమణులుగా ఐశ్వర్య అర్జున్, అనస్వర రాజన్, సాక్షి మడోల్కర్, డైలాగ్స్ & దర్శకుడిగా రాహుల్ రవీంద్ర, ఉత్తమ బాల నటుడిగా బుల్లి రాజు అవార్డులను గెలుచుకున్నారు.

## కొత్త ప్రయాణం మొదలుపెట్టిన యష్ రంగినేని



బిగ్ బెన్ సినిమాస్ బ్యానర్‌పై పెళ్లి చూపులు, డియర్ కామ్రేడ్, దొరసాని, అన్నపూర్ణ ఫోటో స్టూడియో వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించి నిర్మాతగా మంచి అభిరుచి ఉన్న వ్యక్తిగా గుర్తింపు పొందారు యష్ రంగినేని. ఈ రోజు ఆయన తన పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఇటీవల నటుడిగా కూడా ఆయన కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. రోషన్ మేక హీరోగా నటించిన ఛాంపియన్ చిత్రంలో యష్ రంగినేని కీలక పాత్రలో కనిపించారు. ఇందులో మాల వీరయ్య పాత్రలో ఆయన చేసిన నటనకు మంచి స్పందన లభించింది. యష్ రంగినేనితో పని చేసిన కొంతమంది దర్శకులు కూడా ఆయన నటన గురించి ఆసక్తికరంగా మాట్లాడుతున్నారు. ఒక దర్శకుడు మాట్లాడుతూ, "యష్ గారికి మంచి స్క్రీన్ ప్రెజెన్స్ ఉంది. ఆయన వ్యక్తిత్వం, బాడీ లాంగ్వేజ్ వల్ల తెరపై కనిపించే సన్నివేశాలకు ఒక ప్రత్యేకమైన ప్రభావం వస్తుంది" అని అన్నారు.

## విడుదలకి సిద్ధం అవుతున్న సందిగ్ధం



డిఫరెంట్ కంటెంట్‌తో ఆడియెన్స్‌ను ఆకట్టుకునేందుకు 'సందిగ్ధం' టీం రెడీ అవుతోంది. నిహాల్, ప్రియా దేశ్ పాగ్, అర్జున్ సిహెచ్, కాజల్ తివారి ప్రముఖ పాత్రల్లో నటించిన ఈ మూవీకి పార్థసారధి కొమ్మోజు దర్శకత్వం వహించారు. ఈ సినిమాని తీర్థ క్రియేషన్స్ బ్యానర్ మీద సంధ్య తిరువీధుల నిర్మించారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన కంటెంట్, పోస్టర్లు, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక త్వరలోనే వరుస అప్డేట్లతో ఆడియెన్స్‌ను ఎంగేజ్ చేయబోతున్నారు. ప్రస్తుతం 'సందిగ్ధం' సినిమాకి సంబంధించిన చిత్రీకరణ, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయి. సెన్సార్ కార్యక్రమాలు కూడా ప్రారంభం అయ్యాయి. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన రిలీజ్ డేట్‌ను మేకర్లు ప్రకటించనున్నారు. ఈ క్రమంలోనే వరుసగా అప్డేట్లను రిలీజ్ చేసేందుకు చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఈ చిత్రానికి గౌతమ్ రవిరామ్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ మూవీకి నందన్ కృష్ణ సినిమాటోగ్రఫర్‌గా పని చేస్తున్నారు. ఈ సినిమాలో నిహాల్, ప్రియా దేశ్ పాగ్, అర్జున్ దేవ్, కాజల్ తివారి, జీవ కోచెర్ల, నవీన్ రాజ్ సంకరపు, చిట్టి బాబు, ఆనంద్ భారతి, రైజింగ్ రాజు, అప్పారావు, నాగి, దుర్గ, శ్రీదేవీ, లక్ష్మణ్ రావు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు.

## సమ్మర్ రిలీజ్‌కు దీవాన



శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "దీవాన". ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి రూపొందిస్తున్నారు. "దీవాన" సినిమాను ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ గీతా ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సమ్మర్ లో "దీవాన" సినిమా గీతా ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. "దీవాన" సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ నుంచే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇటీవల వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేసిన ఈ సినిమా స్టోరీ పోస్టర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఇంటెన్స్ లవ్ స్టోరీగా వస్తున్న "దీవాన" హర్షిత్ రెడ్డి కెరీర్ లో మరో గుర్తుండిపోయే సినిమా కానుంది.

## 27 న సుయోధన





ప్రజ్వలా లైన్ క్రియేషన్స్ బ్యానర్ పై ప్రియదర్శి, ద్రిషిక చందర్ హీరో హీరోయిన్ గా డైలాగ్ కింగ్ సాయికుమార్, సీనియర్ హీరోయిన్ ప్రేమ కీలకపాత్రల్లో నటించిన చిత్రం సుయోధన. వై ఎస్ మాధవ్ రెడ్డి దర్శకత్వం లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని బోసుబాబు నిడుమోలు నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా మార్చి 27 న ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ డేట్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత బోసుబాబు నిడుమోలు మాట్లాడుతూ మంచి కదా కదానాలతో అత్యత్తమ ప్రమాణాలతో సుయోధన చిత్రాన్ని తెరకెక్కించడం జరిగింది. ప్రియదర్శి సాయికుమార్ ద్రిషిక చందర్ , సీనియర్ హీరోయిన్ ప్రేమ కీలక పాత్రలు పోషించారు. జై క్రిష్ సంగీత దర్శకత్వం వహించారు. రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ ను అందించారు . అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమాను మార్చి 27 న ప్రేక్షకులముందుకు తీసుకువస్తున్నాము. త్వరలో ఈ సినిమా టీజర్ ట్రైలర్ మరియు పాటలను రిలీజ్ చేస్తాము అన్నారు.

## ఉస్తాద్ భగత్ సింగ్ సెన్సార్ పూర్తి

ఈ వేసవికి చక్కటి వినోదాన్ని పంచడానికి తాను సిద్ధమంటున్నాడు 'ఉస్తాద్ భగత్ సింగ్'. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఉగాది కానుకగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా సెన్సార్ పూర్తి చేసుకోగా, ఎలాంటి కట్స్ లేకుండా యూ/ఏ సర్టిఫికెట్ వచ్చినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ పవన్‌కల్యాణ్ శ్రీలీల నడిచి వస్తున్న పోస్టర్‌ను విడుదల చేశారు. ఇక ఈ మూవీ రన్ టైమ్ 2 గంటల 34 నిమిషాలుగా నిర్ణయించారు. తొలుత అనుకున్న షెడ్యూల్ ప్రకారం మార్చి 26న ఈ మూవీ విడుదల కావాల్సి ఉంది. 'టాక్సిక్' వాయిదాతో వారం ముందుకు జరిగింది. వరుస సెలవుల నేపథ్యంలో 'ఉస్తాద్' ముందుకు రావడం మంచి నిర్ణయమే అయినా, 'ధురంధర్2' నుంచి గట్టి పోటీ ఎదుర్కొని నిలబడాలి. మూవీ విడుదల, టికెట్స్ విషయంలో 'ధురంధర్2' చాలా స్పష్టంగా ఉంది. ఇప్పటికే పెయిడ్ ప్రీమియర్స్ టికెట్స్ ఓపెన్ అయ్యాయి. మొదటి భాగం అంచనాలను పెంచిన నేపథ్యంలో 'పార్ట్2' బుకింగ్స్ హాట్ కేక్స్ గా అమ్ముడవుతున్నాయి. రెగ్యులర్ షోలకు సంబంధించి టికెట్స్ ఇంకా ఓపెన్ చేయలేదు. ఈ క్రమంలో 'ఉస్తాద్' ముందున్న అసలు సవాల్ ప్రతి అప్‌డేట్ పక్కాగా ఆన్‌టైమ్‌లో తీసుకురావడమే.



## #గోపీచంద్33 ఫస్ట్ లుక్ రిలీజ్



మ్యాచో స్టార్ టి గోపీచంద్, విజనరీ దర్శకుడు సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి భారీ స్థాయిలో నిర్మిస్తున్న హిస్టారికల్ మూవీ #గోపీచంద్33 తో రాబోతున్నారు. పవన్ కుమార్ ప్రజెంట్స్ చేస్తున్న ఈ చిత్రం గోపీచంద్ కెరీర్‌లోనే అత్యంత భారీ చిత్రాలలో ఒకటిగా రూపొందుతోంది.

ఈ చిత్రంలో రీతు వర్మ, టి గోపిచంద్ సరసన కథానాయికగా నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె పాత్ర సత్యవతిని ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా పరిచయం చేశారు. పోస్టర్‌లో రీతూ వర్మ అద్భుతమైన గ్రేస్‌తో పాటు ఫియర్స్, కమాండింగ్ లుక్‌లో కనిపిస్తున్నారు. విల్లు ఎక్కుపెట్టి ఏకాగ్రతతో కనిపిస్తూ, ఒక యోధురాలిలా ధైర్యం, సంకల్పాన్ని ప్రతిబింబిస్తున్నారు. పీరియడ్ స్టైల్ దుస్తులు, సంప్రదాయ ఆభరణాలు, యుద్ధానికి సిద్ధంగా ఉన్న లుక్ ఆమె పాత్రలోని పవర్ ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ సినిమాలో రీతూ వర్మ పూర్తిగా కొత్త తరహా పాత్రలో కనిపించనున్నారు. 7వ శతాబ్దంలో పర్వత ప్రాంతాల్లో నివసించే ఒక గిరిజన తెగకు చెందిన మహిళగా ఆమె పాత్ర ఉంటుంది. ఆ తెగ సంస్కృతి, ధైర్యం, సహనాన్ని ప్రతిబింబించేలా సత్యవతి పాత్ర రూపుదిద్దుకుంది. తన నటన ద్వారా రీతూ వర్మ ఆ పాత్రకు సహజత్వం, భావోద్వేగాలను తీసుకురానున్నారు.

## గోదారి గట్టుపైన బంగారు బొమ్మ సాంగ్

'మేమ్ ఫేమస్' తో విజయాన్ని అందుకున్న సుమంత్ ప్రభాస్ రూరల్ లవ్, ఫ్యామిలీ డ్రామా 'గోదారి గట్టుపైన' తో అలరించబోతున్నారు. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించింది. నిధి ప్రదీప్ ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జగపతి బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. ఫస్ట్ బ్రీజ్ గ్లింప్స్, చూడు చూడు, 'ఓ మై గాడ్' సాంగ్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ థర్డ్ సింగిల్ బంగారు బొమ్మ సాంగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ పాట మార్చి 13న రిలీజ్ కానుంది. సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ లో సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ లవ్లీ కెమిస్ట్రీ ఆకట్టుకుంది.



## మార్చ్ 13న డార్క్ నైట్

పూర్ణ ప్రదాన పాత్రలో రూపొందిన ఎమోషనల్ థ్రిల్లర్ చిత్రం "డార్క్ నైట్". మార్చ్13న తెలుగు రాష్ట్రాల థియేటర్లలో రిలీజ్ కాబోతుంది. జి.ఆర్. ఆదిత్య ఈ చిత్రానికి కథ రాసి దర్శకత్వం వహించారు. పూర్ణ ఇందులో హేమ పాత్రలో నటించి కథకు కీలకంగా నిలిచే పాత్రను పోషించారు. ఆమెతో పాటు త్రిగుణ్ (ఆదిత్ అరుణ్) రోషన్‌గా, విధార్థ్ అలెక్స్‌గా, సుభాశ్రీ రాయగురు సోఫియా పాత్రలో నటించారు. ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు ఆధిత్యా, సంగీత దర్శకుడు మిస్కిన్ మ్యూజిక్ అందించిన ఈ చిత్రాన్ని పట్లోళ్ల వెంకట్ రెడ్డి సమర్పణలో పి19 స్టూడియోస్ పతాకంపై సురేష్ రెడ్డి కొవ్వూరి ఈ చిత్రాన్ని నిర్మించారు.

"పూర్ణ ప్రదాన పాత్రలో నటించిన "డార్క్ నైట్" చిత్రం మార్చ్13న రెండు తెలుగు రాష్ట్రాల థియేటర్లలో విడుదల చేస్తున్నాం. డార్క్ నైట్ నాలుగు ప్రధాన పాత్రల జీవితాల చుట్టూ తిరుగుతుంది. వారి మధ్య ఉన్న సంక్లిష్ట భావోద్వేగాలు, రహస్యాలు, సంఘర్షణలు కథను ఉత్కంఠభరితంగా మలుస్తాయి. కథ ముందుకు సాగుతున్న కొద్దీ ప్రేక్షకులు భావోద్వేగాలతో నిండిన ప్రయాణాన్ని అనుభవిస్తారు. ఈ చిత్రంలో అతీంద్రియ అంశాలతో కూడిన ఒక ఊహించని ట్విస్ట్ కథను కొత్త మలుపు తిప్పుతూ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది. మిస్కిన్ ప్రత్యేకమైన సిగ్నేచర్ బిజిఎం తో ఈ చిత్రం భావోద్వేగం, సస్పెన్స్‌ల సమ్మేళనంగా నిలుస్తూ "డార్క్ నైట్"ను మరపురాని సినిమాటిక్ అనుభవంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. మొత్తానికి, కథ చెప్పే విధానం, భావోద్వేగాలు మరియు ఉత్కంఠతో కూడిన అంశాలతో "డార్క్ నైట్" ప్రేక్షకులను ఎమోషనల్ థ్రిల్ ఇస్తూ రెండు గంటలపాటు ఉత్కంటభరితంగా పాత్రలతో మమేకం చేస్తుంది. ముఖ్యంగా ఇప్పటి జనరేషన్లోనున్న యూత్ కు సంభందించిన అంశాలు హైలెట్ గా వారి అనుభవాలను ప్రతిబింబిస్తాయి." అన్నారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.